ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం




# వ్యవసాయం

జూన్, 2025

సంపుటి - 11 సంచిక-06 పేజీలు- 52 వెల : ₹ 20/-




రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గౌ॥ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్









# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక






రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మాత్యులు గౌ॥ శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మరియు నాగర్‌కర్నూల్ యం.పి డాక్టర్ మల్లురవి





రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర రైతు సంక్షేమ కమీషన్ చైర్మన్ గౌ॥ శ్రీ యం. కోదండ రెడ్డి మరియు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా॥ జి. చిన్నా రెడ్డి





రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య మరియు రాష్ట్ర రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు గౌ॥ శ్రీ యస్. రాములు నాయక్

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

జూన్, 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర జ్యేష్ఠ శుద్ధ షష్ఠి నుండి ఆషాఢ శుద్ధ పంచమి వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

**డా॥ సి. పద్మవేణి**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

**డా॥ పి. లీలా రాణి**

ప్రధాన శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) & హెడ్

**డా॥ ఎ. పద్మశ్రీ**

అసోసియేట్ ప్రొఫెసర్ (ఎంటమాలజి)

పర్యవేక్షణ

**డా॥ ఆర్. సునీత దేవి**

ప్రధాన శాస్త్రవేత్త, (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.
డి. డి. అయితే
Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030
పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



చిరునామా :

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.......................................... 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు............... 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ.................... 14
4. సాంకేతిక వ్యాసాలు
   - మొక్కజొన్న సాగులో శాస్త్రీయ పద్ధతులు-ఉత్తమ దిగుబడికి మార్గం........................................... 15
   - వానాకాలం కంది పంట సాగులో మెళకువలు............. 17
   - విత్తనశుద్ధి-అధిక దిగుబడికి మొదటి అడుగు................20
   - రైతు స్థాయిలో విత్తననాణ్యత నిర్ధారించే పరీక్షలు-వాటి నిర్వాహణ............................................. 22
   - రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.................................26
   - వ్యవసాయ పదవినోదం.................................. 28
   - గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారి చేతుల మీదుగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నాణ్యమైన విత్తనాల పంపిణీ జూన్ 2న ప్రారంభం-ఉపకులపతి డా॥అల్దాస్ జానయ్య.................................................... 29
   - ప్రత్తి గులాబి రంగు పురుగు నివారణకు చేపట్టవలసిన ముందస్తు చర్యలు.......................................... 30
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్............................ 31
   - సేంద్రీయ విధానాల్లో కీటకాల నియంత్రణ..................32
   - రైతు విజయానికి మొదటి మెట్టు-మంచి విత్తనం ఎంపిక...34
   - పంట మార్పిడి పాటించండి-సుస్థిర ఆదాయాన్ని పొందండి................................................ 36
   - నేలకు ఆరోగ్య సంజీవని ట్రైకోడెర్మావిరిడి................... 38
   - వర్షాధారిత ప్రాంతాలలో నేల మరియు నీటి సంరక్షణా పద్ధతులు.................................................... 40
   - జూన్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.................................................... 42
   - జీవాల పెంపకంలో అధిక లాభాలను సాధించడానికి శాస్త్రీయమైన చర్యలు.......................................... 44
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు.............................................. 46
6. రైతన్నకో ప్రశ్న.............................................. 47
7. విశ్వవిద్యాలయ వార్తలు......................................48
8. రైతు విజయగాథ
   - మిరప నల్ల తామర పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించి లాభాలు గడించిన రైతు విజయగాథ..... 49

# జూన్ మాసం క్యాలెండర్ - 2025

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర జ్యేష్ఠ శుద్ధ షష్ఠి నుండి ఆషాడ శుద్ధ పంచమి వరకు

<table>
<tr><th>SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00</th><th>MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00</th><th>TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30</th><th>WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30</th><th>THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00</th><th>FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00</th><th>SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30</th></tr>
<tr><td>1<br>జ్యేష్ఠ శుద్ధ షష్ఠి<br>రా. 12-12<br>ఆశ్రేష రా. 1-51<br>ప.వ. 2-31 ల 4-09</td><td>2<br>సప్తమి రా. 12-13<br>మఘ రా. 2-37<br>ప.వ. 2-14 ల<br>3-53</td><td>3<br>అష్టమి రా. 12-44<br>పుబ్బ తె. 3-52<br>ఉ.వ. 11-02 ల<br>12-43</td><td>4<br>నవమి రా. 1-44<br>ఉత్తర తె. 5-34<br>ప.వ. 11-34 ల<br>1-17</td><td>5<br>దశమి తె. 3-09<br>హస్త పూర్తి<br>ప.వ. 2-42 ల<br>4-26</td><td>6<br>ఏకాదశి తె. 4-55<br>హస్త ఉ. 7-39<br>సా.వ. 4-28 ల<br>6-14</td><td>7<br>ద్వాదశి పూర్తి<br>చిత్ర ఉ. 10-07<br>సా.వ. 4-20 ల<br>6-06</td></tr>
<tr><td>8<br>ద్వాదశి ఉ. 6-54<br>స్వాతి ప. 12-44<br>సా.వ. 6-56 ల<br>8-42</td><td>9<br>త్రయోదశి<br>ఉ. 8-55<br>విశాఖ ప. 3-19<br>రా.వ. 7-43 ల<br>9-29</td><td>10<br>చతుర్దశి<br>ఉ. 10-47<br>అనూరాధ<br>సా. 5-44<br>రా.వ. 11-49 ల<br>1-34</td><td>11<br>పూర్ణిమ<br>ప. 12-22<br>జ్యేష్ఠ రా. 7-50<br>తె.వ. 4-24 ల</td><td>12<br>జ్యేష్ఠ బ॥ పాడ్యమి<br>ప. 1-32<br>మూల రా. 9-32<br>ఉ.శే.వ. 6-07 వ<br>రా.వ. 7-50 ల<br>9-32</td><td>13<br>విదియ ప. 2-17<br>పూర్వాషాఢ<br>రా. 10-47<br>ఉ.వ. 7-38 ల<br>9-19</td><td>14<br>తదియ ప. 2-30<br>ఉత్తరాషాఢ<br>రా. 11-31<br>ఉ.వ. 7-20 ల<br>8-41<br>తె.వ. 3-34 ల<br>5-10</td></tr>
<tr><td>15<br>చవితి ప. 2-12<br>శ్రవణం<br>రా. 11-46<br>తె.వ. 3-43 ల<br>5-19</td><td>16<br>పంచమి<br>ప. 1-26<br>ధనిష్ఠ<br>రా. 11-33<br>వర్జ్యము లేదు</td><td>17<br>షష్ఠి ప. 12-14<br>శతభిషం<br>రా. 10-56<br>ఉ.వ. 6-35 ల<br>8-08<br>తె.వ. 5-04 ల</td><td>18<br>సప్తమి<br>ఉ. 10-39<br>పూర్వాభాద్ర<br>రా. 9-58<br>ఉ.శే.వ. 6-36 వ</td><td>19<br>అష్టమి ఉ. 8-44<br>ఉత్తరాభాద్ర<br>రా. 8-42<br>ఉ.వ. 7-03 ల<br>8-34</td><td>20<br>నవమి ఉ. 6-34<br>దశమి తె. 4-10<br>రేవతి రా. 7-13<br>ఉ.వ. 7-58 ల<br>9-27</td><td>21<br>ఏకాదశి<br>రా. 1-39<br>అశ్విని సా. 5-36<br>ప.వ. 1-52 ల<br>3-21<br>రా.వ. 2-30 ల<br>3-59</td></tr>
<tr><td>22<br>ద్వాదశి<br>రా. 11-11<br>భరణి ప. 3-51<br>తె.వ. 3-05 ల<br>4-35</td><td>23<br>త్రయోదశి<br>రా. 8-52<br>కృత్తిక ప. 2-20<br>తె.వ. 5-19 ల</td><td>24<br>చతుర్దశి సా. 6-36<br>రోహిణి ప. 12-49<br>ఉ.శే.వ. 6-49 వ<br>సా.వ. 6-07 ల<br>7-37</td><td>25<br>అమావాస్య<br>సా. 4-34<br>మృగశిర<br>ఉ. 11-31<br>రా.వ. 7-32 ల<br>9-04</td><td>26<br>ఆషాఢ శు॥ పాడ్యమి<br>ప. 2-47<br>ఆర్ద్ర ఉ. 10-27<br>రా.వ. 10-06 ల<br>11-39</td><td>27<br>విదియ ప. 1-22<br>పునర్వసు<br>ఉ. 9-44<br>సా.వ. 5-38 ల<br>7-13</td><td>28<br>తదియ ప. 12-22<br>పుష్యమి ఉ. 9-26<br>రా.వ. 10-19 ల<br>11-56</td></tr>
<tr><td>29<br>చవితి ప. 11-50<br>ఆశ్రేష ఉ. 9-36<br>రా.వ. 9-56 ల<br>11-34</td><td>30<br>పంచమి<br>ప. 11-48<br>మఘ ఉ. 10-16<br>సా.వ. 6-38 ల<br>8-19</td><td></td><td></td><td></td><td></td><td></td></tr>
</table>

**07 ఈద్-ఉల్-అజహా (బక్రీద్)**

**15 ఈద్-ఇ-గదీర్**

**27 రథ యాత్ర**

**మృగశిర కార్తెలు (08.06.25 నుండి 21.06.25)**

ఇతర పంటలకు లోతు దుక్కులు చేయుట

వరి : దీర్ఘకాలిక రకాల వరినారు పోయుట, వరి వేయబోయే పొలాల్లో సేంద్రియ ఎరువులు వేయుట, పచ్చిరొట్ట పైరులు విత్తుకొనుట

మొక్కజొన్న : సేంద్రియ ఎరువులు వేసి దుక్కులు దున్నుట. మొక్కజొన్న పంటలను విత్తుట

కాయ ధాన్యాలు : తక్కువ పంట కాలపు పెసర, మినుము, కంది విత్తుట. అంతర కృషి చేయుట

సజ్జ : ఎరువులు వేసి దుక్కులు దున్నుట, విత్తనం వేయుట

ఆముదం : ఎరువులు వేసి దుక్కులు దున్నుట

ప్రత్తి : దుక్కులు దున్నుట. విత్తనం వేయుట.

సోయాచిక్కుడు : విత్తుట.

వేరుశనగ : రసాయనిక ఎరువులు వేసి విత్తుట.

**ఆర్ధ్రకార్తె (22.06.25 నుండి 05.07.25)**

వరి : నారుమళ్ళలో అంతరకృషి, సస్యరక్షణ

జొన్న : దుక్కులు దున్నుట, రసాయనిక ఎరువులు వేయుట, విత్తనం వేయుట.

మొక్కజొన్న : సస్యరక్షణ - రెండవ దఫా ఎరువులు వేయుట

ప్రత్తి : అంతరకృషి, మొక్కలను పలుచన చేయుట.

పప్పుధాన్యాలు : వర్షాలు ఆలస్యం అయినచో కంది విత్తుటకు భూమిని తయారుచేయుట - విత్తుట.

సోయాచిక్కుడు : రసాయనిక ఎరువులు వేయుట, సస్యరక్షణ

# గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం - విత్తన స్వయం సమృద్ధికి సోపానం



అల్దాస్ జానయ్య
ఉపకులపతి

దేశ జనాభాలో సగం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మనరాష్ట్రంలో కూడా దాదాపు అదే సంఖ్యలో వ్యవసాయం చేస్తున్నారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు తక్కువగా రావడంతో రైతులు నష్టాలపాలు అవుతున్నారు. ఈ పరిస్థితుల నుండి రైతులను కాపాడేందుకు మరియు రైతులకు సకాలంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో మన ప్రభుత్వం ఈ వానాకాలంలో ప్రాధాన్య అంశంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు మరియు గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తన పంపిణీ అనే రెండు వినూత్న కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా మే 5 నుండి జూన్ 13 వరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఆరు అంశాలు అనగా తక్కువ యూరియా వాడండి – సాగు ఖర్చును తగ్గించండి, అవసరం మేరకు రసాయనాలను వినియోగించండి – నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడండి, రశీదులను భద్రపరచండి – కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందండి, సాగు నీటిని ఆదా చేయండి – భావితరాలకు అందించండి, పంట మార్పిడి పాటించండి – సుస్థిర ఆదాయాన్ని పొందండి మరియు చెట్లను పెంచండి – పర్యావరణాన్ని కాపాడండి అనే అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది.

ఆధునిక విత్తన రకాలను అభివృద్ధి చేయడంలో గణనీయమైన పరిశోధన పెట్టుబడులు ఉన్నప్పటికీ, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో సమర్థవంతమైన పంపిణీ మార్గాలు లేకపోవడం గమనార్హం. ప్రైవేట్ విత్తన సంస్థలు మంచి విలువ కలిగిన మరియు ఎక్కువ పరిమాణంతో ఉత్పత్తి చేయవలసిన పంటలపై మక్కువ చూపకపోవడం వలన పంటల విత్తనోత్పత్తి భారం ప్రభుత్వ సంస్థలపై పడుతుంది. దీని వలన 80–85% చిన్న రైతులు తమ విత్తనాల కోసం అనధికారిక వనరులపై ఆధారపడటానికి దారితీస్తుంది.

ఈ విత్తనాలలో జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత మరియు మొలకశాతం తక్కువ ఉండే అవకాశం ఉంది. ఈ సవాళ్ళు ఉన్నప్పటికీ, రైతు నుండి రైతుకు విత్తన వ్యాప్తికి సానుకూల ఉదాహరణలు ఉన్నాయి. విత్తనోత్పత్తితోపాటు విత్తనశుద్ధికరణ మరియు నాణ్యత పెంపొందించే పద్ధతులపై అవగాహన మరియు శిక్షణ ఇస్తే రైతుల నాణ్యమైన విత్తనోత్పత్తి సాధికారత సాధించవచ్చు. ఈ పద్ధతి ద్వారా రైతులకు అధిక దిగుబడినిచ్చే వివిధ వంగడాల నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉండవచ్చు. దీని ద్వారా అధిక దిగుబడులను సాధించడంతోపాటు రైతుల జీవనశైలిని కూడా మెరుగుపరచవచ్చు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆహార ఉత్పత్తిని పెంచడానికి మరియు పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడానికి బలమైన మరియు జీవవైవిధ్య విత్తన వ్యవస్థలు చాలా అవసరం.

స్థానిక విత్తన వ్యవస్థలు మరియు అధికారిక వ్యవస్థ కలిసి పనిచేస్తూ అధికారిక వ్యవస్థల నుండి నిర్దిష్ట పరిమితులను స్థానిక విత్తన ఉత్పత్తిలో చేర్చడం వలన ఇంటిగ్రేటెడ్ సీడ్ సిస్టమ్ (ఐఎస్ఎస్) విధానాన్ని అవలంభించడం వలన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించవచ్చు. రైతు సంఘాలు, స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జి) మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓ లు) ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషిస్తాయి. అధికారిక విత్తన ఉత్పత్తి పద్ధతుల ధృవీకరణ కోసం ప్రభుత్వ విధానాలు మరియు నాణ్యత నియంత్రణ చర్యలను విత్తనోత్పత్తిలో చేర్చి సరియైన శిక్షణ ఇవ్వడంతో మేలైన విత్తన ఉత్పత్తిని సాధించవచ్చు.

విడుదల చేసిన అధిక దిగుబడి రకాల విత్తనాలను రైతుల క్షేత్రాలలో పండించి గ్రామంలోని తోటి రైతులకు తక్కువ ధరకు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను ప్రతి గ్రామంలో అందుబాటులో ఉంచవచ్చు, తద్వారా విత్తన సాధికారత సాధించవచ్చు.

ప్రభుత్వాలు ఈ విధానాలను అవలింబించడం ద్వారా విత్తన నాణ్యత సమస్యలను పరిష్కరించటమే కాకుండా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచవచ్చు.

మన వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇదే మార్గంలో అడుగులు వేస్తూ రైతులకు మరింత చేరువ అవ్వాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతుంది. వర్సిటీ రూపొందించిన అధిక దిగుబడినిచ్చే వంగడాలు తెలంగాణలోని ప్రతి రైతుల క్షేత్రాలలో ఉండాలనే ఆకాంక్షతో ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనం అనే నినాదంతో వ్యవసాయ శాఖ సహకారంతో ముందుకు సాగుతున్నారు. ప్రతి గ్రామంలో దీని కోసం జూన్ 2వ తేదీన ఎంపిక చేసిన ముగ్గురు రైతులకు విశ్వవిద్యాలయం విడుదల చేసిన వరి, మొక్కజొన్న, కంది, పెసర మరియు జొన్న పంటల రకాల నాణ్యమైన విత్తనాలను అందించడం జరుగుతుంది. కావున, విత్తనాన్ని అందుకున్న రైతులు ఆయా రకాల విత్తనోత్పత్తి చేసి నాణ్యమైన విత్తనాన్ని తోటి రైతులకు అందిస్తారని ఆశిస్తూ...

(అల్దాస్ జానయ్య)
ఉపకులపతి



# వరి

1. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి ఈ మధ్యకాలంలో విడుదలైన జెజిఎల్ 33124, జెజిఎల్ 28639, ఆర్‌డిఆర్ 1200, ఆర్‌డిఆర్ 1162 మరియు కెపిఎస్ 6251 అనే స్వల్పకాలిక రకాలను రానున్న వానాకాలానికి సాగుచేసుకోవచ్చు. జెజిఎల్ 28639 అనే రకం స్వల్పకాలిక దొడ్డుగింజ పొడవు గింజ రకం. దొడ్డు గింజ వరి రకాలలో కెఎన్‌ఎమ్ 118, జెజిఎల్ 24423, ఆర్‌ఎన్‌ఆర్ 29325, ఆర్‌ఎన్‌ఆర్ 28361 రకాలు, సన్నగింజ రకాలలో, ఆర్‌ఎన్‌ఆర్ 15048, కెఎన్‌ఎమ్ 1638, కెఎన్‌ఎమ్ 733, ఆర్‌ఎన్‌ఆర్ 21278 రకాలను సాగుచేసుకోవచ్చు.

- వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి వివిధ పరిశోధన స్థానాల నుండి ఈ మధ్య విడుదలైన కొత్త వరి రకాలు: కె.పి.యస్ 2874, ఆర్.ఎన్.ఆర్ 11718, జె.జి.యల్ 28545, జె.జి.యల్ 27356, కె.ఎన్.ఎమ్ 1638, డబ్ల్యు.జి.యల్ 962, ఆర్.ఎన్.ఆర్ 29325, ఆర్.ఎన్.ఆర్ 21278, సాగుచేసి అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులు నాట్లువేసి, వరి సాగు చేసే బదులుగా దమ్ము చేసి గాని లేదా పొడి దుక్కిలో గాని నేరుగా వరిని విత్తుకోవడం ద్వారా నాటుకయ్యే కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చు మరియు ఒక వారం రోజులు ముందుగా పంటను కూడా కోసుకోవచ్చు.

2. తెలంగాణ రాష్ట్రంలో గత 2-3 సంవత్సరాల నుండి యాసంగి కాలంలో వేసిన వరి పంట కోత దశలో అకాల వర్షాలు, వడగండ్ల వానలు మరియు ఈదురు గాలుల వల్ల పంట నష్టం జరుగుతుంది. ఈ నష్టాలను అధిగమించడానికి వానాకాలం వరి పంటను ముందస్తుగా సాగు చేసి పంట కోతలను అక్టోబర్ మూడవ వారం నుండి నవంబర్ మొదటి వారంలోపు పూర్తి చేసుకోగలిగినట్లైతే యాసంగి పంట సాగుకు నేల తయారీకి సరిపోయే సమయం ఉంటుంది. యాసంగి వరి నారుమడులను నవంబర్ 25 మధ్యలో విత్తుకున్నట్లైతే మార్చి చివరి వరకు లేదా ఏప్రిల్ మొదటి వారంలో పంట కోతలను పూర్తి చేసుకోవచ్చు. తద్వారా, అకాల వర్షాలు, వడగండ్ల వానల నుండి పంటలను రక్షించుకోవడానికి మరియు నూక సమస్యను అధిగమించడానికి అవకాశం ఉంటుంది.

3. విత్తనశుద్ధి: నారుపోసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. తడి విత్తనశుద్ధికి కార్బండాజిమ్ 1 గ్రా. లేదా పొడి విత్తనశుద్ధికి 3 గ్రా. కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తుకోవాలి.

**నారుమడిలో ఎరువులు మరియు కలుపు యాజమాన్యం:**

- నారుమడి తయారీకి 2 వారాల ముందు 2 గుంటల నారుమడికి 2 క్వింటాళ్ళు బాగా మాగిన పశువుల ఎరువును వేసి పొలాన్ని 2-3 సార్లు కలియదున్నాలి
- ఒక ఎకరం నాటుకోవడానికి, రెండు గుంటల్లో అతి సన్న గింజ రకాలైతే 15 కిలోలు, సన్నగింజ రకాలైతే 20 కిలోలు మరియు దొడ్డు గింజ రకాలైతే 25 కిలోలు ఎత్తు మడులపై చల్లుకోవాలి.
- విత్తనం వత్తుగా చల్లుకున్నట్లైతే నారు పెరుగుదల బలహీనంగా ఉంటుంది.
- రెండు గుంటల (200 చ.మీ) నారుమడికి 2 కిలోల నత్రజని (1 కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు), 1 కిలో భాస్వరం మరియు 1 కిలో పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవాలి
- మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, వారం రోజులు ఆరుతడులు ఇచ్చి, ఆ తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.
- జింకు లోప నివారణకు లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి.
- నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు నివారణకు విత్తిన 15-20 రోజులకు సైహలోఫాప్-పి-బ్యుటైల్ 1.5 మి.లీ. లేదా అన్ని రకాల కలుపు ఉన్నప్పుడు బిస్‌పైరి బ్యాక్ సోడియం 0.5 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి విత్తిన 10-12 రోజులకు పిచికారి చేసుకోవాలి



- నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలు చల్లుకోవాలి.

**డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్‌నెం. 9440225385**

## మొక్కజొన్న

వర్షాధారంగా పండించే మొక్కజొన్న పైరును విత్తుటకు జూన్ 15 నుండి జూలై ఆఖరు వరకు అనుకూలమైన సమయం. జూన్ 15 నుండి జూలై వరకు దీర్ఘకాలిక మరియు మధ్యకాలిక రకాలు మరియు జూలై 15 నుండి జూలై ఆఖరు వరకు స్వల్పకాలిక రకాలను విత్తుకోవచ్చు. వర్షాధారంగా సాగు చేసినప్పుడు తొలకరి వర్షాలు 50 మి.మీ. పడి తగినంత పదును ఉన్నప్పుడు మాత్రమే విత్తుకోవాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన మధ్యకాలిక సంకరరకాలైన డి.హెచ.యం 117, డి.హెచ్.యం 121, కరీంనగర్ మక్క మరియు కరీంనగర్ మక్క-1 లేదా సిఫారసు చేసిన ప్రైవేట్ హైబ్రిడ్లు విత్తుకోవాలి. ఎకరా మొక్కజొన్న పైరుకు 80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చు ఎరువులు మరియు 20 కిలోల జింక్ సల్ఫేట్ అవసరం. 1/3వ వంతు నత్రజని, మొత్తం భాస్వరం, సగం పొటాష్, మొత్తం జింక్ ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. లోతుగా దుక్కులు దున్ని తయారు చేసిన పొలంలో 60 సెం.మీ. దూరంలో బోదెలను వేసుకోవాలి. బోదెకు ఒకవైపున పై నుండి 1/3వ ఎత్తులో 20 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. బోదెలు కాలువల పద్ధతిలో పైరుకు నీరు అందించుటకు మరియు అధిక నీటిని బయటికి తీయుటకు ఉపయోగపడుతుంది. ఎకరాకు 8 కిలోల విత్తనం వాడి విత్తిన 1-2 రోజులలో అట్రజిన్ 50% పొడిమందును ఎకరాకు 800-1200 గ్రా. 200 లీ. నీటిలో కలిపి నేలపై తేమ ఉన్నప్పుడు పిచికారి చేయాలి. విత్తిన తర్వాత పొలంలో నీరు నిలిస్తే మొలకరాదు కావున నిలిచిన నీటిని బయటకు తీయాలి. అదేవిధంగా 30 రోజుల దశ వరకు మొక్కజొన్న పంటను అధిక తేమ నుండి కాపాడుకోవాలి. కత్తెర పురుగు నివారణకు కిలో విత్తనానికి 6.0 మి.లీ. సయాంట్రనిలిప్రోల్ + థయోమిథాక్సామ్‌తో విత్తనశుద్ధి చేసుకున్నట్లైతే తొలిదశలో మొక్కలను కత్తెర పురుగు బారి నుండి కాపాడుకోవచ్చును.

## చిరుధాన్యాలు

**సజ్జ:** జూన్ మొదటి వారం నుండి జూలై రెండవ వారం వరకు విత్తుకోవచ్చు. సంకర రకాలు పి.హెచ్.బి-1625, పి.బి.హెచ్-3, హెచ్.హెచ్.బి-67, ఐ.సి.యం.హెచ్-356 మరియు కాంపోజిట్ రకాలు ఐ.సి.టి.పి-8203 (ధన శక్తి), ఐ.సి.యం.వి.-221 లను వాడి అధిక దిగుబడులను పొందవచ్చు.

**విత్తు దూరం:** వరుసల మధ్య 45 సెం.మీ. మొక్కల మధ్య 10-15 సెం.మీ. ఉండేలా విత్తుకోవాలి. విత్తిన 2 రోజులలోపు తడి నేలపై అట్రజిన్ 50% పొడిమందును ఎకరానికి 600-800 గ్రా. 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయడం వలన కలుపు నివారించుకోవచ్చు.

**విత్తన మోతాదు:** 2 కి/ఎ

**విత్తనశుద్ధి:** ఉప్పు నీటి ద్రావణం 2% (20 గ్రా./లీ. నీరు) లో విత్తనాలను 10 నిమిషాలు ఉంచటం ద్వారా ఎర్గాట్ శిలీంద్రాలను తేలేటట్టు చేసి తొలగించవచ్చు. ఆరిన కిలో విత్తనానికి 6 గ్రా. మెటలాక్సిల్ (ఆప్రాన్) 35 ఎస్.డి ను కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**రాగి:** రాగి పంటను జూన్ మొదటి వారం నుండి జూలై రెండవ వారం వరకు విత్తుకోవచ్చు. నారుపోసి లేదా నేరుగా రాగి పంటను విత్తుకోవచ్చు. మేలైన రకాలు పి.ఆర్.యస్-38, మారుతి, భారతి, చైతన్య, వకుళ, తిరుమల, వేగవతి, స్వర్ణముఖి, గౌతమి, ఇంద్రావతి ఎన్నుకోవాలి.

**విత్తే దూరం:** వరుసల మధ్య 20-30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ. పాటించాలి. విత్తనశుద్ధికి కిలో విత్తనానికి కార్బండాజిమ్ 2 గ్రా. లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. లేదా ట్రైసైక్లోజోల్ 2 గ్రా. వాడాలి.



**కలుపు నివారణ:** ఎకరానికి పెండిమిథాలిన్ 600 మి.లీ. లేదా అనిలోఫాస్ 750 మి.లీ. మందును 200 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి. నాటిన 30 రోజులకు వెడల్పాకు కలుపు నివారణకు ఎకరానికి 2,4,డి సోడియం సాల్ట్ 80% 400 గ్రా. లేదా ఇథాక్సీసల్ఫ్యూరాన్ 100 మి.లీ. మందును 200 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**విత్తన మోతదు:** 2 కిలోలు ఎకరానికి

**కొర్ర:** జూన్ మొదటి వారం నుండి జూలై రెండవ వారం వరకు విత్తుకోవచ్చు. మేలైన రకాలు సూర్యనంది, యస్.ఐ.ఎ-3156 ఎంచుకోవాలి. విత్తనశుద్ధికి కిలో విత్తనానికి థైరమ్ 3 గ్రా. లేదా మ్యాంకోజెబ్ 2 గ్రా. లేదా ట్రైసైక్లోజోల్, 2 గ్రా. వాడాలి. కలుపు నివారణకు ఎకరానికి ఐసోప్రొట్యురాన్ 400 గ్రా. 200 లీ. నీటితో కలిపి విత్తిన 2 రోజుల లోపల తడి నేలపై పిచికారి చేయాలి.

**విత్తే దూరం:** 22.5 సెం.మీ. వరుసల మధ్య 7.5 సెం.మీ. మొక్కల మధ్య పాటించాలి.

**విత్తన మోతాదు:** 2 కిలోలు ఎకరానికి

**జొన్న:** జొన్న పంటను వర్షాధారంగా జూన్ రెండవ వారం నుండి జూలై రెండవ వారం వరకు విత్తుకోవచ్చు. ఈ వర్షాకాలంలో సాగుచేసుకునేందుకు అనువైన జొన్న రకాలు:

**1. తెలంగాణ జొన్న 1 (సియస్‌వి 41):** ఇది 110 రోజులలో పంట చేతికి వస్తుంది. 3500 కిలోలు/హెక్టారు గింజ దిగుబడి: 8000 కిలో/హె. చొప్ప దిగుబడినిచ్చే సామర్థ్యం కలిగి ఉండి, గింజ బూజును తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ రకం విత్తనాలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం నందు లభ్యమగును.

**2. పాలెం జొన్న 1 (పియస్‌వి 512):** ఈ రకం 110 రోజులలో పంట చేతికివచ్చి, 3200 కి/హె గింజ దిగుబడి, 12000 కి/హె. చొప్ప దిగుబడినిచ్చి, మధ్యస్థంగా గింజబూజును తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది.

**3. పాలెం పచ్చజొన్న 1 (పివైపిఎస్ 2):** అధిక మాంసకృత్తులు కలిగి ఉండి, తక్కువ కాలంలో పంట చేతికి వస్తుంది. ఎకరానికి 8-10 క్వి/గింజ దిగుబడి, 25 క్వి/చొప్ప దిగుబడినిచ్చే సామర్థ్యం కలిగి ఉండి గింజబూజును తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది.

- ఒక ఎకరానికి 3-4 కిలోల జొన్న విత్తనం సరిపోతుంది. విత్తేటప్పుడు 1 కిలో విత్తనానికి 7-12 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ అనే మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- పశువుల ఎరువు ఎకరానికి 3-4 టన్నులు ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. వర్షాధార జొన్నకు 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి.
- విత్తేటప్పుడు సాలుకు సాలుకు మధ్య 45 సెం.మీ. వరుసలో మొక్కల మధ్య 15 సెం.మీ. ఎడం ఉండేలా విత్తుకోవాలి.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## వేరుశనగ

- వేరుశనగకు అనువైన భూమిని 2-3 సార్లు మెత్తగా దుక్కి దున్ని సిద్ధం చేసుకోవాలి. వానాకాలంలో వేరుశనగ పంటను జూలై రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చు. ఈ మాసంలో ఆయా ప్రాంతాలకు అనుకూలమైన మేలైన విత్తనాలను ఎకరానికి 60 కిలోలు సేకరించి పెట్టుకోవాలి. కాయలను ఒలిచి విత్తనాలను ఉంచుకోవాలి. విత్తనశుద్ధికి కావాల్సిన రసాయన మందును ముందుగానే సమకూర్చుకోవాలి. టెబ్యుకోనజోల్ 1 గ్రా. కిలో విత్తనానికి, ట్రైకోడెర్మా విరిడె 10 గ్రా. కిలో విత్తనానికి, కొత్తగా సాగు చేసినచో రైజోబియం కల్చర్ 200 గ్రా. ఎకరా విత్తనానికి సరిపోతుంది. కాండం కుళ్ళు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో 2.0 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్‌ను 7 మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. వేరుపురుగు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.



## ఆముదం

- వానాకాలంలో జూన్ రెండవ పక్షం నుండి జూలై రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చు. ఎర్రనేలలు, నల్లరేగడి నేలలు మరియు గరపనేలలు ఆముదం సాగుకు అనుకూలం.
- వర్షాధారంగా ఆముదం సాగుచేసినప్పుడు బెట్టకు గురి అవుతుంది. ఆముదం + కంది 1:1 నిష్పత్తిలో వేసుకుంటే అధిక ఆదాయం పండించడానికి సంకర రకాలైతే 2.0-2.5 కిలోల విత్తనం, సూటి రకాలైతే 3.5-4.0 కిలోల విత్తనం సరిపోతుంది.
- సంకర రకాలు 90×60 సెం.మీ. లేదా 120×45 సెం.మీ. దూరం, సూటి రకాలు 90×45 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి.
- కిలో విత్తనానికి 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయడం వలన మొలక కుళ్ళు తెగులు అరికట్టవచ్చు. వడలు తెగులు అధికంగా గల ప్రాంతాల్లో కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండాజిమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడెతో విత్తనశుద్ధి చేయాలి.
- ఒక ఎకరానికి 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.

## నువ్వులు

- మే నెలలో విత్తిన నువ్వులకు ఒక నీటి తడినిచ్చి కలుపు మొక్కలను తీసి వేసి పంటను పలుచన చేసుకోవాలి.
- ఈ దశలో రసంపీల్చే పురుగులు ఆశించే అవకాశం ఎక్కువ. పేనుబంక ఆశించినట్లైతే ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తామర పురుగులు, పచ్చదోమ నివారణకై డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవచ్చు.
- విత్తిన 30 రోజులకు పైపాటుగా 18 కిలోల యూరియాను వేయాలి.

## ప్రొద్దుతిరుగుడు

- అదును బట్టి పొలాన్ని వాలుకు అడ్డంగా దున్నుకోవాలి.
- తేలికపాటి నేలల్లో జూన్ రెండవ పక్షం నుండి జూలై రెండవ పక్షం వరకు మరియు బరువైన నేలల్లో ఆగష్టు రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి 2.5-3.0 కిలోల విత్తనం అవసరమవుతుంది.
- నెక్రోసిస్ సమస్య గల ప్రాంతాల్లో థయోమిథాక్సామ్ 3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ నివారణకు ఇప్రోడియాన్ 25% + కార్బండాజిమ్ 25% మందును 2 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.
- బోదెలు మరియు సాళ్ళ పద్ధతిలో నాటినట్లైతే నీటి తడులు ఇవ్వడానికి అనుకూలంగా ఉంటుంది.
- ఎకరానికి 12 కిలోల నత్రజని 24 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. గంధకం తక్కువగా ఉన్న నేలల్లో జిప్సం ఎకరానికి 55 కిలోలు వేస్తే నూనె శాతం పెరుగుతుంది.
- విత్తిన రెండు రోజులలోపు, భూమిలో తేమ ఉన్నప్పుడు ఆక్సాడయార్జిల్ 120 గ్రా. ఎకరానికి కలుపు మందును పిచికారి చేయాలి.

**డా॥ యన్. వాణిశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.8186945838**

## సోయాచిక్కుడు

మన తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్‌లో సాగు చేయబడుతున్న 5 ప్రధానమైన పంటలలో సోయాచిక్కుడు ఒకటి. ఇందులో నాణ్యమైన మాంసకృత్తులతోపాటు 20-22 శాతం నూనెను కలిగి ఉన్నాయి. ఈ పంటను వానాకాలంలో మాత్రమే సాగుచేయాలి. ఒకవేళ యాసంగి లేదా వేసవిలో సాగుచేసినట్లైతే గింజ పరిమాణం తగ్గిపోయి పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఏక పంటగా లేదా ప్రత్తి, కంది, జొన్న మొదలగు పంటలలో అంతర పంటగా కూడా సాగు చేసుకోవచ్చు.



**రకాల ఎంపిక:** మన ప్రాంతానికి అనువైన, రోగ నిరోధక శక్తి కలిగి అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి. మన తెలంగాణ ప్రాంతానికి, తక్కువ కాలపరిమితి కలిగిన జె.యస్-93-5 రకం, మధ్యస్థ కాల పరిమితి గల జె.యస్-335, ఆదిలాబాద్ ఇండోర్ సోయాచిక్కుడు-1, ఎం.ఏ.యు.యస్-612, డి.యస్.బి-34. డి.యస్.బి-23, ఎం.ఏ.సి.యస్-1460 రకాలు, అలాగే బాసర వంటి దీర్ఘకాలిక రకాలు అనువైనవి. అనువైన రకాన్ని ఎంపిక చేసేటప్పుడు, నేల స్వభావం మరియు నీటి వసతులను పరిగణలోనికి తీసుకోవాలి. విత్తనాలు ప్రభుత్వ రంగ విత్తన సంస్థల ద్వారా లేదా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు రశీదు తీసుకుని, విత్తన సంచి లేబులింగ్ తప్పకుండా చూసుకోవాలి. అలాగే విత్తుకునే ముందు రైతులు మొలక శాతాన్ని తప్పకుండా పరీక్షించుకోవాలి.

**విత్తనశుద్ధి:** పంట తొలి దశలలో వచ్చే తెగుళ్ళ నుండి రక్షణ మరియు అధిక దిగుబడికి తప్పకుండా విత్తనశుద్ధి చేయాలి. ముందుగా ప్రతి కిలో విత్తనానికి 2 గ్రా. థైరమ్ 75 డబ్ల్యు.పి లేదా 1 గ్రా. కార్బండాజిమ్ 50 డబ్ల్యు.పి లేదా 1.5 గ్రా. కార్బక్సిన్ 37.5% + థైరమ్ లేదా 2 గ్రా. థియోఫానేట్ మిథైల్ + పైరాక్లోస్ట్రోబిన్, తరువాత 1.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.యస్ తో విత్తనశుద్ధి చేయాలి. చివరగా విత్తే గంట ముందు ప్రతి 10 కిలోల విత్తనానికి 200 గ్రా. బ్రాడి రైజోబియం జపానికం కల్చరును నీరు, బెల్లం కలిపి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

**విత్తే సమయం:** జూన్ రెండవ వారం నుండి జూలై మొదటి వారం వరకు విత్తుకోవాలి. నల్లరేగడి భూముల్లో 45×5 సెం.మీ. తేలిక భూముల్లో 30×7.5 సెం.మీ. చ.మీ.కు 33-44 మొక్కల చొప్పున ఎకరాకు సరాసరిగా లక్ష ముప్పైరెండు వేల నుండి లక్ష డెబ్బై ఆరు వేల మొక్కలు ఉండేటట్లు చూసుకోవాలి. విత్తేటప్పుడు భూమిలో తేమ శాతం చూసుకోవాలి. 60-70 మి.మీ. వర్షపాతం పడ్డ తర్వాత లేదా వరుసగా రెండు రోజులు భారీ వర్షాలు కురిసిన తర్వాతనే విత్తుకోవాలి. అదే విధంగా 3-5 సెం.మీ. లోతులో విత్తుకోవాలి.

**విత్తన మోతాదు:** గింజ పరిమాణం, మొలక శాతం మరియు విత్తే దూరం మీద ఆధారపడుతుంది. మొలక శాతం 70% కంటే తక్కువగా ఉంటే విత్తన మోతాదు పెంచుకోవాలి. ఎకరానికి 25-30 కిలోల విత్తనం వేసుకోవాలి.

**కలుపు నివారణ:** పంట మొదటి దశ 45 రోజుల వరకు కలుపు సమస్య లేకుండా జాగ్రత్త పడాలి. విత్తిన 48 గంటలలోపు పెండిమిథాలిన్ 30 ఇ.సి. 1.4 లీ. ఎకరానికి లేదా పెండిమిథాలిన్ 38.7% ఇ.సి. 700 మి.లీ. ఎకరానికి లేదా అలాక్లోర్ 50% ఇ.సి. 1 లీ. ఎకరానికి లేదా డైక్లోసులం 84% డబ్ల్యు.డి.జి 12.4 గ్రా. ఎకరం చొప్పున పిచికారి చేయాలి. కలుపు మందుల పిచికారి సమయంలో నేలలో తగినంత తేమ తప్పనిసరిగా ఉండాలి.

**డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు), వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 97041 34304**

## అపరాలు

- తొలకరిలో కురిసే వర్షాల ఆధారంగా దుక్కి బాగా తయారు చేసుకొని తేలికపాటి నేలల్లో కనీసం 60 మి.మీ. మరియు బరువు నేలల్లో 75 మి.మీ. వర్షపాతం నమోదైన తర్వాత లేదా 15-20 సెం.మీ. లోతు తడిసిన తర్వాత మాత్రమే విత్తనం విత్తుకోవాలి. అపరాలను చౌడు నేలలు, మురుగు నీరు నిలిచే నేలలు తప్ప మిగితా అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు.
- తొలకరిలో ఏక పంటగా లేదా అంతర పంటగా అపరాలను సాగు చేయవచ్చును. కంది + జొన్న / మొక్కజొన్న / సజ్జ 1:2 లేదా 1:4 కంది + పెసర / మినుము / సోయాచిక్కుడు 1:7 ఒక వరుస కంది 7 వరుసల అంతర పంటలు, కంది + ప్రత్తి 1:4 లేదా 1:6, కంది + పసుపు 1:4 లేదా 1:6 నిష్పత్తిలో వేసుకోవాలి.

**పంటల సరళి:** మొక్కజొన్న - పెసర / మినుము; వరి - మొక్కజొన్న -పెసర/మినుము; పెసర-వేరుశనగ-పెసర; పెసర-కంది; మొక్కజొన్న-కంది, పెసర-వరి; పెసర-మిరప; పెసర-మొక్కజొన్న.



### కంది:

**రకాలు:** తేలిక, మధ్యస్థ నేలలు మరియు తక్కువ వర్షపాతం కలిగిన ప్రాంతాల్లో త్వరగా పరిపక్వతకు (140-160 రోజులు) వచ్చు పి.ఆర్.జి-176, డబ్ల్యు.ఆర్.జి.ఇ-93, డబ్ల్యు.ఆర్.జి.ఇ-97, ఐసిసి-8863, డబ్ల్యు.ఆర్.జి-121 కంది రకాలను సాగు చేయాలి. బరువైన నల్లరేగడి నేలల్లో మరియు సాధారణ లేదా అధిక వర్షపాతం కలిగిన ప్రాంతాల్లో 160-180 రోజుల పంటకాలం కలిగిన డబ్ల్యు.ఆర్.జి-255. డబ్ల్యు.ఆర్.జి-65, టి.డి.ఆర్.జి-4, ఐసిపిల్-87119, ఐసిపిహెచ్-2740, టి.డి.ఆర్.జి-59, టి.డి.ఆర్.జి-272 కంది రకాలు సాగు చేయాలి.

**విత్తు సమయం / విత్తే దూరం:** జూన్ 15 నుండి ఆగష్టు 15 వరకు విత్తుకోవాలి. భూసారాన్ని బట్టి తేలికపాటి నుండి మధ్యస్థ నేలల్లో 90-150 సెం.మీ. బరువైన రేగడి నేలల్లో 150-240 సెం.మీ. సాళ్ళ మధ్య మొక్కల మధ్య 20 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి.

**విత్తనశుద్ధి:** కంది విత్తే ముందు కిలో విత్తనానికి కాప్టాన్ 2.5 గ్రా. లేదా థైరామ్ 3 గ్రా. మరియు ట్రైకోడెర్మా విరిడె 10 గ్రా. కిలో విత్తనానికి పట్టించి విత్తుకున్నప్పుడు విత్తనం లేదా భూమి ద్వారా సంక్రమించే శిలీంధ్రాల నుండి పంటను కాపాడవచ్చు. తొలకరిలో రసంపీల్చే పురుగులు, తెగుళ్ళు ఆశించకుండా విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

**విత్తన మోతాదు:** కందిలో హెక్టారుకు 10-15 కిలోల విత్తనం వాడాలి.

### పెసర / మినుము:

**రకాలు:** **పెసర:** అధిక దిగుబడినిచ్చే యం.జి.జి-385, యం.జి.జి-295, యం.జి.జి-344, టి.యం-96-2, డబ్ల్యు.జి.జి-37, డబ్ల్యు.జి.జి- 42 రకాలు వానాకాలంలో సాగుకు అనుకూలం.

**మినుము:** యం.బి.జి-1070, యం.బి.జి-207, పి.యూ-31, ఎల్.బి.జి-752, ఎల్.బి.జి-787, టి.బి.జి-104, జి.బి.జి-1 రకాలు కొంత మేరకు పల్లాకు తెగులుకు తట్టుకొని అధిక దిగుబడినిస్తాయి.

**విత్తే సమయం / విత్తే దూరం:** జూన్-15 నుండి జూలై 15 వరకు విత్తుకోవాలి. సాళ్ళ మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంతో చదరపు మీటరుకు 33-40 మొక్కలు ఉండేలా విత్తుకోవాలి.

**విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేసుకున్నచో 15-20 రోజుల వరకు రసంపీల్చే పురగుల బారి నుండి రక్షింపవచ్చు. అపరాల పంటలను మొదటిసారిగా సాగు చేసే పరిస్థితుల్లో ఎకరా విత్తనాలకు 200 గ్రా. రైజోబియం కల్చర్ మరియు 200 గ్రా. పి.ఎస్.బి. కల్చర్ విత్తనానికి పట్టించాలి. మొదటిగా శిలీంధ్రనాశిని మందును విత్తనానికి పట్టించిన తర్వాతనే రైజోబియం పొడిని విత్తనానికి పట్టించాలి.

**విత్తన మోతాదు:** పెసర / మినుములో ఎకరాకు 6-8 కిలోల విత్తనం వాడాలి. తక్కువ కాల పరిమితి గల డబ్ల్యు.జి.జి-42 అనే పెసర రకం యాసంగి వరి కోతలకు 2-3 రోజుల ముందుగా వెదజల్లుకున్నట్లైతే గృహావసరాలకు మరియు పచ్చిరొట్టగా ఉపయోగపడి భూసారం కూడా పెరుగుతుంది.

**ఎరువుల యాజమాన్యం:** అపరాల పంటలకు ఆఖరి దుక్కిలో ఎకరాకు 1.5-2 టన్నుల పశువుల ఎరువుతోపాటు 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను వేయాలి.

**అంతరకృషి / కలుపు నివారణ:** 20-25 రోజుల వరకు అపరాల్లో కందిలో 60 రోజుల వరకు కలుపు లేకుండా జాగ్రత్త పడాలి. తొలిదశలో కలుపు నివారణకు విత్తిన 24-48 గంటల్లో పెండిమిథాలిన్ 1-1.3 లీటర్లు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి సమంగా పిచికారి చేయవలెను. వీలైనంత వరకు పెసర / మినుమును సాళ్ళ పద్ధతిలో కందిని బోదెల పద్ధతిలో విత్తుకున్నచో అధిక దిగుబడి పొందవచ్చును.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**



## ప్రత్తి

- ప్రత్తి పంట సాగుకు నల్లరేగడి భూములు మరియు మధ్యస నేలలు అనుకూలం. ప్రత్తి పంటను జూన్ నుండి జూలై 20వ తేది వరకు విత్తుకోవచ్చు. జూలై 20 తరువాత విత్తితే దిగుబడులు తగ్గుతాయి.
- 60-70 మి.మీ. వర్షం కురిసిన తరువాత, మంచి పదునులో ప్రతి గింజలను విత్తుకోవటం వలన అన్ని గింజలు ఒకేసారి మొలకెత్తుతాయి. పంట యాజమాన్యం కూడా సులభం. పొడి దుక్కిలో విత్తనాలను విత్తుకోవద్దు. కానీ వర్షం సరైన మోతాదులో కురవనప్పుడు అన్ని గింజలు మొలకరాదు కొన్ని కుళ్ళి పోతాయి. మళ్ళీ గింజలు విత్తుకోవాలి. తద్వారా విత్తన ఖర్చు పెరుగుతుంది. కలుపు నివారణ కష్టం అవుతుంది.
- బోదె సాళ్ళ లేదా ఎత్తు మళ్ళ పద్ధతిలో ప్రత్తిని విత్తుకుంటే అధిక వర్షాలకు మరియు బెట్ట పరిస్థితుల్లో మొక్కలు నిలదొక్కు కుంటాయి. అధిక మొక్కల సాంద్రత (దగ్గర అచ్చు) లో వర్షాధారంగా ప్రత్తి సాగు చేసేటప్పుడు గుబురుగా ఎదిగే మొక్క, తొందరగా గూడలు, పూతకాతకు వచ్చే మధ్యస్థ కాయ సైజు మరియు అన్ని కాయలు ఒకేసారి అభివృద్ధి చెంది ఏక కాలంలో పగిలే హైబ్రిడ్‌లను ఎంపిక చేసుకోవాలి. వర్షాధారంగా ప్రత్తి సాగు చేస్తున్నప్పుడు భూస్వభావాన్ని బట్టి ప్రత్తి విత్తే అచ్చును వేసుకోవాలి. నల్లరేగడి భూములో అచ్చు: రెండు సాళ్ళ మధ్య 4 అడుగులు రెండు మొక్కల మధ్య 2 లేదా 1 1/2 అడుగులు (120×60 లేదా 45 సెం.మీ.). ఎకరాకు 2-3 ప్యాకెట్లు విత్తనం సరిపోతుంది. మధ్యస్థ నేలలో అచ్చు: రెండు సాళ్ళ మధ్య 3 అడుగులు రెండు మొక్కల మధ్య 1 1/2 లేదా 1 అడుగులు (90×45 లేదా 30 సెం.మీ.) ఎకరాకు 4-5 ప్యాకెట్లు విత్తనం అవసర ముంటుంది. తేలికపాటి లేదా చల్కా భూములలో అచ్చు: రెండు సాళ్ళ మధ్య 3 అడుగులు రెండు మొక్కల మధ్యల 6 లేదా 8 ఇంచులు (90×20 లేదా 15 సెం.మీ.) ఎకరాకు 6-7 ప్యాకెట్లు విత్తనం అవసరం. ప్రత్తిని ఆశించు తెగుళ్ళ నివారణకు కిలో విత్తనానికి 10 గ్రా. సూడోమోనాస్ ఫ్లోరిసిన్స్ లేదా ట్రైకోడెర్మా విరిడి లేదా 2 గ్రా. కార్బండాజిమ్‌తో కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. ప్రత్తి విత్తిన 10 రోజుల్లో మొలక రాని చోట గింజలు విత్తుకోవాలి. రెండు మొలకలు ఉన్న చోట పీకి వేసి కుదురుకు ఒక మొక్క ఉండేలా చూడాలి. ప్రత్తిలో అంతర పంటగా పెసర, సోయాచిక్కుడు, మినుము అనుకూలం. కందిని 4 లేదా 6 సాళ్ళ ప్రత్తి తర్వాత ఒక సాళ్ళు వేసుకొని సుస్థిర దిగుబడులను వర్షాధారంగా పొందవచ్చు. కలుపు నివారణకై ప్రత్తి విత్తిన 24-48 గంటలలోపు ఎకరాకు 1.2 లీ. పెండిమిథాలిన్ 30% లేదా 700 మి.లీ. పెండిమిథాలిన్ 38.7% సిఎస్ లేదా అల్లాక్లోర్ 50% 1.5-2లీ. 200 లీటర్ల నీటికి కలిపి నేలపై పిచికారి చేయాలి. భూమిలో సరియైన పదును/తేమ ఉన్నప్పుడే పిచికారి చేసినట్లైతే గడ్డి మందు సమర్థవంతంగా పనిచేసి 20 రోజుల వరకు కలుపు అరికట్టవచ్చు. నెల రోజుల పంటలో గడ్డి, వెడల్పాకు కలుపు నివారణకు క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ. లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ. మరియు పైరిథయోబ్యాక్ సోడియం 250 మి.లీ. లేదా పైరిథయోబ్యాక్ సోడియం 6%+క్విజలోఫాప్ ఇథైల్ 4% ఎమ్ఇసి 500 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.
- ఎకరాకు 110 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డి.ఏ.పి మరియు 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. భాస్వరం ఎరువును మొత్తాన్ని దుక్కిలో లేదా విత్తిన 15 రోజులలోపు వేసుకోవాలి. ప్రత్తి విత్తిన 20, 40, 60, 80 రోజులలో 25 కిలోల యూరియా 10 కిలోల పొటాష్ కలిపి 4 సార్లు వేసుకోవాలి. పైపాటుగా డి.ఏ.పి లేదా 20-20-0-13 లాంటి కాంప్లెక్స్ ఎరువులను వాడకూడదు. ప్రత్తిని మొదటి 30-45 రోజుల్లో రసం పీల్చు పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్ 1 పాళ్ళు నీరు 4 పాళ్ళు లేదా ఫ్లోనికామిడ్ 1 పాళ్ళు నీరు 20 పాళ్ళు కలిపి ప్రత్తి కాండం పై భాగాన ఉన్న లేత ఆకుపచ్చ భాగానికి పూయాలి. ఇలా 15 రోజులకొకసారి విత్తిన 30, 45 రోజులకు చేస్తే తక్కువ ఖర్చుతో రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా అరికడుతూ మిత్ర పురుగుల సంతతిని పెంపొందించు కోవచ్చు.



- అవసరాన్ని బట్టి 5% వేపగింజల కషాయాన్ని లేదా వేపనూనెను (1500 పి.పి.యం) 5 మి.లీ. లీటరు నీటితో పాటు ఒక మి.లీ. శాండోవిట్ కలిపి పిచికారి చేసుకోవాలి. పురుగు ఉధృతిని బట్టి ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9908033309

## చెఱకు

తోట వయస్సు నాలుగు నెలలు ఉన్నప్పుడు (జూన్-జూలై మాసాల్లో) మొక్కల మొదళ్ళకు ఎత్తుగా మట్టిని ఎగద్రోయాలి. దీనివలన అధిక వర్షాలు మరియు తుఫాను గాలులకు పంట పడిపోకుండా కాపాడుకోవచ్చు. వేసవిలో ఎండిన చెఱకుకు 50% యూరియా ద్రావణాన్ని పిచికారి చేసినట్లైతే, మొక్కలోని జీవరసాయనిక చర్యలు ఊపందుకొని, మొక్క ఎదుగుదల వేగవంతమౌతుంది. వేరు లద్దెపురుగు తేలిక నేలల్లో ఎక్కువగా కనిపించి మొక్కల వేళ్ళను తినివేయడం వలన మొక్కలు చనిపోతాయి. తొలకరి వర్షాలు పడిన వెంటనే పొలంలో దీపపు ఎరలు అమర్చుకోవడం ద్వారా ప్రౌఢ పెంకు పురుగులు ఆకర్షితమై, దీపపు ఎర క్రింద అమర్చిన పురుగుమందు ద్రావణంలో పడి, చనిపోవును. తద్వారా దాదాపు 50 శాతం పురుగులను నిర్మూలించవచ్చు. ఎదిగే తోటల్లో ఈ పురుగు నివారణకు ఫిప్రోనిల్ 40% మరియు ఇమిడాక్లోప్రిడ్ 40% డబ్ల్యుజి మందును ఎకరాకు 175 గ్రా. చొప్పున 400 లీటర్ల నీటిలో కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర పూర్తిగా తడిచే విధంగా పిచికారి చేయాలి. థయోమిథాక్సామ్ 0.9% + ఫిప్రోనిల్ 0.2% డబ్ల్యు/డబ్ల్యు జిఆర్ గుళికలను ఎకరాకు 6 కిలోల చొప్పున నేలలో వేసుకోవాలి. వేరుపురుగులు ఆశించే ప్రాంతాలలో ఆఖరి దుక్కిలో ఎకరాకు 200 కిలోల వేపపిండిని వేసి కలియదున్నాలి. తొలకరి వర్షాలు పడినవెంటనే పొలంలో దీపపు ఎరలు అమర్చుకోవడం ద్వారా 50% ప్రౌఢ పెంకు పురుగులను నిర్మూలించవచ్చు.

వాతావరణం మబ్బుగా ఉండి 19-35 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత మరియు 80-90 శాతం గాలిలో తేమ ఉన్నప్పుడు తెల్లపేను (ఊలి ఎఫిడ్) అభివృద్ధి చెందుతుంది. దీని యొక్క తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగుభాగంలో గుంపులుగా ఉండి రసాన్ని పీల్చడం వలన తెలుపు, పసుపు వర్ణం మిళితమైన మచ్చలు ఏర్పడతాయి. మొదట అంచులు, తర్వాత మొత్తం ఆకులు క్రమేపి ఎండిపోతాయి. ఈ పురుగుల విసర్జన తియ్యని జిగట పదార్థం లాగా ఉండి కిందున్న ఆకుల పైభాగాన పడి, దాని మీద సూటీమోల్డ్ అనే నల్లని శిలీంధ్రం పెరిగి ఆకు మసిబారుతుంది. పురుగు ఆశించిన ఆకులను తీసి వేసి తగులబెట్టాలి. పురుగు ఆశించిన తోటల నుండి చెఱకును ఇతర ప్రాంతాలకు రవాణా చేయకూడదు. నీటి ఎద్దడి, నీటి ముంపుకు లోనైన తోటల్లో వడలు తెగులు హెచ్చుగా వస్తుంది. జూన్-జూలై నెలల్లో నాటిన తోటలు ఎక్కువగా వడలిపోతాయి. తెగులు సోకిన మొక్కల ఆకులు నీటి ఎద్దడికి గురైన మొక్కల ఆకులవలె వడలిపోతాయి. చెఱకులో గుల్ల ఏర్పడడం వలన బరువు తగ్గుతుంది. వర్షాలు తొందరగా మే-జూన్ నెలల్లో ప్రారంభమై జూలై నెలలో అధిక వర్షాలు పడినప్పుడు మొవ్వ కుళ్ళు తెగులు ఉధృతంగా వస్తుంది. తెగులు సోకిన మొక్కల మొవ్వు ఆకుల మొదలు భాగం, పాక్షికంగా తెల్లగా అవుతుంది. మొవ్వు ఆకులు చిన్నగా ఉండి నరిగా విడివడవు. ఒక్కొక్కప్పుడు చుట్టుకునిపోతాయి. ఆకుల మొదలులో పాలిపోయిన భాగంలో ఎర్రటి చారలు ఏర్పడి ఆ చార వెంబడి ఆకు చిట్లిపోతుంది. మొవ్వు కుళ్ళిపోతే మొక్క ఎదుగుదలలేక చనిపోతుంది. వర్షాలు తగ్గగానే తెగులు ఉధృతి తగ్గి మొక్కలు మామూలు స్థితికి వస్తాయి. 1 మి.లీ. అజోక్సీస్ట్రోబిన్ 18.2% డబ్ల్యు/డబ్ల్యు + డైఫెన్‌కొనజోల్ 11.4% డబ్ల్యు/డబ్ల్యు గల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల ఈ తెగులును నివారించవచ్చు.

డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాల (జూన్ నుండి సెప్టెంబర్) కాలంలో 962.6 మి.మీ వర్షపాతం (+30 శాతం), పోస్ట్ మాన్సూన్ సీజన్‌లో (అక్టోబర్ నుండి డిసెంబర్) 86.5 మి.మీ వర్షపాతం (-24 శాతం), చలి కాలంలో (జనవరి నుండి ఫిబ్రవరి) 0.2 మి.మీ వర్షపాతం (-98 శాతం) మరియు వేసవి కాలంలో (మార్చి నుండి మే) 166.4 మి.మీ. వర్షపాతం (+203 శాతం) నమోదైనది. 27 మే 2025 తేదీన విడుదల చేసిన నైరుతి ఋతుపవనాల రెండవసారి ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం 2024 సంవత్సరానికి గాను దేశం మొత్తానికి జూన్ నుండి సెప్టెంబర్ మాసం వరకు (నైరుతి ఋతుపవనాల) భారత దేశంలో సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం (106 $\pm$ 4 శాతం) నమోదయ్యే సూచనలున్నాయి.

నైరుతి ఋతుపవనాల ద్వారా జూన్ నెలలో దేశం మొత్తం సాధారణం వర్షపాత సూచనలు ఉన్నప్పటికీ మన రాష్ట్రానికి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం (>108 శాతం) నమోదయ్యే సూచనలున్నాయి. అదేవిధంగా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువ మరియు కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం నుండి సాధారణం కంటే తక్కువగా ఈ మాసంలో నమోదుకావచ్చును.

ప్రస్తుతం, భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలో తటస్థ ఎల్ నినో-దక్షిణ ఆసిలేషన్ (ఇఎన్ఎస్ఓ) పరిస్థితులు ప్రబలంగా ఉన్నాయి. తాజా మాన్సూన్ మిషన్ క్లైమేట్ ఫోర్కాస్ట్ సిస్టమ్ (ఎమ్ఎమ్సిఎఫ్ఎస్) అలాగే ఇతర వాతావరణ నమూనా అంచనాలు ఋతుపవన కాలంలో తటస్థ ఇఎన్ఎస్ఓ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని సూచిస్తున్నాయి.

మన రాష్ట్రంలో 50 శాతం విస్తీర్ణంలో వరి, 40 శాతం విస్తీర్ణంలో ప్రత్తి, 5 శాతం విస్తీర్ణంలో సోయాచిక్కుడు, మొక్కజొన్న, కంది, పెసర మరియు మినుము పంటలు సాగు చేయబడుతున్నాయి. వాతావరణ విభాగం సమాచారం ప్రకారం ఈ సంవత్సరం రాష్ట్రంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నందున రైతులు కొన్ని ప్రత్యేకమైన యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా పంటలను అధిక వర్షాల నుండి కాపాడుకోవచ్చును.

### వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- వర్షాధార పంటలు విత్తుకోడానికి విత్తన నియమం పాటించడం అంటే, రాష్ట్రంలోనికి ఋతుపవనాలు ప్రవేశించిన తరువాత ఒక వారం రోజుల వ్యవధిలో తేలిక పాటి నేలల్లో 50 నుంచి 60 మి.మీ. మరియు బరువు నేలలో 60 నుంచి 75 మి.మీ వర్షపాతం నమోదైన తరువాత లేదా నేల 15-20 సెం.మీ. లోతు తడిసిన తరువాతనే రైతులు వర్షాధార పంటలైన ప్రత్తి, సోయాచిక్కుడు, జొన్న, కంది, పెసర, మినుము మొదలగు పంటలను విత్తుకోవాలి.
- తేలికపాటి నేలను వాలుకు అడ్డంగా దున్ని పంటలను విత్తుకున్నట్లయితే పంటకు ఎక్కువ కాలం తేమ లభ్యమవుతుంది. ఆరుతడి పంటలను బోదె మరయు సాళ్ళ పద్ధతి లేదా ఎత్తు మడుల పద్ధతిలో విత్తుకున్నట్లయితే పంటకు ఎక్కువ కాలం తేమ లభ్యమవుతుంది అదే విధంగా ఎక్కువ వర్షపు నీటిని కాలువల ద్వారా తీసివేయటానికి వీలుంటుంది. వర్షాధార పంటలలో ఆఖరి అంతర కృషి తరువాత గొడ్డుచాలు వేయడం. నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు దీర్ఘకాలిక వరి రకాల (140-145 రోజులు) నారుమళ్ళు పోసుకోవడానికి ఇది అనువైన సమయం.
- వరిలో 3 గ్రా. కార్బండాజిమ్ మందును కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధికి చేసుకోవాలి. రైతులు తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్ 15048) వరి విత్తనాన్ని జూన్ నెలలో నారుమడి పోసుకోకూడదు. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ళను అరికట్టడానికి ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న, జొన్న, పెసర, కంది, వేరుశనగ విత్తనాలను తెగుళ్ళ మందులతో విత్తన శుద్ధి చేసుకోవాలి.
- తేలికపాటి నేలల్లో సోయాచిక్కుడును వర్షాధార పంటలుగా సాగు చేయరాదు. ఒకటి లేదా రెండు తడులు ఇచ్చే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే తేలికపాటి నేలల్లో పంటను విత్తుకోవాలి. ప్రత్తి పంటను అధిక సాంద్రత పద్ధతిలో (హెచ్‌డిపిఎస్) తేలికపాటి నేలల్లో కూడా సాగు చేసుకోవచ్చును. వరి సాగు చేసే పొలాల్లో, తొలకరి వర్షాలను ఉపయోగించుకొని జనుము మరియు జీలుగను పచ్చి రొట్ట పైరుగా, ఆలస్యంగా నీరు విడుదలయ్యే ప్రాంతాలలో పెసరను పైరుగా లేనిచో పచ్చి రొట్టగా విత్తుకోవాలి. నూనె గింజల పంటలకు గంధకము ఆధారిత రసాయన ఎరువులను విత్తే సమయంలో వేయవలెను.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9704157445

# మొక్కజొన్న సాగులో శాస్త్రీయ పద్ధతులు - ఉత్తమ దిగుబడికి మార్గం

డా॥ డి. భద్రు, డా॥ కె. వాణిశ్రీ, డా॥ వై. యస్. పరమేశ్వరి, డా॥ బి. మల్లయ్య మరియు డా॥ యం. సుజాత
మొక్కజొన్న పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్



**మొక్కజొన్న - వర్షాధార పంటలో ప్రాముఖ్యత:** తెలంగాణ రాష్ట్రంలో వర్షాధారంగా పండించే పంటలలో వరి, ప్రత్తి తర్వాత మొక్కజొన్న ప్రధానంగా సాగు చేస్తున్నారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15.15 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగైంది. తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ దిగుబడి పొందదగిన పంటగా ఇది రైతులలో ప్రాచుర్యం పొందింది. అయితే, ఆశించిన దిగుబడి సాధించడంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ ఉన్నప్పటికీ, కొన్ని కీలకమైన కారణాల వల్ల ఈ పంట నుండి ఆశించినంత దిగుబడి సాధించలేకపోతున్నారు.

- సారవంతమైన భూములను వదిలేసి తక్కువ శక్తివంతమైన నేలల్లో సాగు చేయడం
- వర్షాభావం కారణంగా విత్తనాల విత్తటం ఆలస్యం
- పంట పెరుగుదల దశలో బెట్ట పరిస్థితులు
- మొలక దశలో నీటి ముంపుకు గురికావడం
- తగిన మోతాదులో ఎరువులు వేయకపోవడం
- అధిక వర్షాల వల్ల కలుపు నివారణను సకాలంలో చేయలేకపోవడం
- పంట సున్నిత దశల్లో తేమ లేకపోవడం
- చీడపీడల నివారణలో అప్రమత్తత లేకపోవడం

**అనుకూలమైన నేలలు:** మొక్కజొన్నకు నల్ల రేగడి, ఎర్ర మరియు ఇసుక కలిగిన ఒండ్రు నేలలు బాగా అనుకూలం. ఇవి నీరు బాగా ఇంకే నేలలుగా ఉండాలి, పిహెచ్ స్థాయి 6.5 నుండి 7.5 మధ్య ఉండాలి. అయితే చౌడు భూములు మరియు నీరు నిలిచే భూములు మొక్కజొన్నకు అనుకూలం కావు.

**విత్తు కాలం:** వర్షాధార మొక్కజొన్న పంటను సాధారణంగా జూన్ 2వ వారం నుండి జులై 2వ వారం వరకు విత్తాలి. వర్షాభావ పరిస్థితుల్లో స్వల్పకాలిక రకాలతో జులై చివరి వరకు విత్తవచ్చు.

**రకాల ఎంపిక:** వర్షపాతాన్ని బట్టి రకాలు ఎంపిక చేసుకోవాలి:

- అధిక వర్షపాతం గల ప్రాంతాల్లో దీర్ఘ, మధ్యకాలిక రకాలు
- తక్కువ వర్షపాతం ఉన్న తేలిక నేలల్లో స్వల్పకాలిక రకాలు
- ధృవీకరించబడిన ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థల నుండి విత్తనాలను తీసుకోవాలి.

**ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన రకాలు:**

**డిహెచ్ఎమ్-117:** కాండము తొలుచు పురుగు, కుళ్ళు తెగుళ్ళకు నిరోధకత కలిగి, 95-100 రోజుల్లో పండుతుంది.

**డిహెచ్ఎమ్-121:** కుళ్ళు తెగుళ్ళతో పాటు కొంత మేర నీటి ఎద్దడిని తట్టుకోగలదు.

**కరీంనగర్ మక్క-1:** ఎండుతెగుళ్ళు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అనుకూలం.

**కరీంనగర్ మక్క:** విత్తు ఆలస్యమైనా 90-95 రోజుల్లో పంట కోతకు వచ్చే రకం.

**నేల తయారీ:** ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు వేసి, నేల బాగా దున్ని చదును చేయాలి. 60 సెం.మీ. మధ్యంతరంతో బోదెలు తయారు చేయాలి.

**విత్తన మోతాదు మరియు మొక్కల సాంద్రత:** ఎకరాకు 8 కిలోల విత్తనాన్ని వాడాలి. 60 × 20 సెం.మీ. అంచనాలతో మొక్కలు నాటాలి, అంటే ఎకరాకు 33,333 మొక్కలు ఉండాలి.

**విత్తన శుద్ధి:** 1 కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ / థైరమ్ / కాప్టాన్ వాడాలి. సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సమ్ మిశ్రమం వాడడం వల్ల కత్తెర పురుగుల నుండి రక్షణ కలుగుతుంది.

**విత్తు పద్ధతి:** బోదెలను 60×20 సెం.మీ. లోతులో వేయాలి. విత్తిన పది రోజుల తర్వాత, ఒక్కో కుదురుకు ఒక్క మొక్క మాత్రమే ఉంచి మిగతా మొక్కలను తొలగించాలి.

**ఎరువుల నిర్వహణ:** భూసార పరీక్షా ఫలితాలను బట్టి ఎరువులను తగిన మోతాదులో వాడాలి. ఎకరాకు 10 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువు లేక కంపోస్టును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. వర్షాధార మొక్కజొన్నకు ఎకరాకు 80 కిలోల నత్రజని (150 కిలోలు యూరియా) నిచ్చే ఎరువును వేసుకోవాలి. దీనిని మూడు దఫాలుగా – 1/3 వ వంతు విత్తే సమయంలో, 1/3 వ వంతువిత్తిన 30–35 రోజులకు మరియు మిగిలిన 1/3వ వంతు విత్తిన 60–65 రోజులకు వేసుకోవాలి., 24 కిలోల భాస్వరం (50 కిలోల డి.ఎ.పి. లేదా 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) మొత్తం భాస్వరం ఎరువును విత్తే సమయంలోనే వేయాలి, పైపాటుగా వేయకూడదు మరియు 20 కిలోల పొటాష్ (35 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్) తీసుకొని మొత్తం ఎరువును బరువు నేలలలో అయితే ఆఖరి దుక్కిలో అదేతేలిక నేలలలో అయితే 20 కిలోల పొటాష్ ఎరువును విత్తే సమయం లోను మరియు మిగతా 15 కిలోల పొటాష్ ఎరువును విత్తిన 60–65 రోజుల మధ్య వేసుకోవాలి.

**కలుపు నియంత్రణ:** విత్తిన తరువాత అట్రజిన్ 50% డబ్ల్యు.పి. అనే కలుపుమందును తేలిక నేలలలో ఎకరాకు 800 గ్రా.లు మరియు బరువు నేలలలో 1 కిలోను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 2–3 రోజులలోపు నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారి చేయాలి. మరలా అవసరమైనచో మొక్కజొన్న పైరులో (15–18 రోజులు) కలుపు నివారణకు కలుపు 2–4 ఆకుల దశలో, టెంబోట్రయోన్ 34.4% ఎస్.సి. 115 మి.లీ.లేదా హాలో సల్ఫ్యూరాన్ మిథైల్ 75% డబ్ల్యు.పి. 36 గ్రా. మందును అట్రజిన్ 50% డబ్ల్యుపి 400 గ్రా. లేదా అట్రజిన్ + మీసోట్రైయాన్ 1400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలి. విత్తిన 30 నుంచి 35 రోజులకు కల్టివేటర్‌తో అంతరకృషి చేసి కలుపు మొక్కలను పూర్తిగా నివారించవచ్చు.

**నీటి యాజమాన్యము:** మొక్కజొన్నకు వానాకాలంలో 350–500 మి.మీ. నీరు అవసరం ఉంటుంది. మొక్కజొన్న లేత దశలో నీటి ముంపును తర్వాత పూతదశలో నీటి ఎద్దడిని తట్టుకోలేదు. విత్తిన తరువాత పొలంలో నీరు నిలవడంవలన విత్తనం మొలకెత్తదు. మొక్కజొన్న పంటలో ముఖ్యంగా పూత మరియు గింజ పాలు పోసుకునే దశలలో వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు నీటి సదుపాయం ఉంటే 1 లేక 2 తడులు ఇవ్వడం ద్వారా దిగుబడిని పెంచుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8008572660**

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| II. టి–శాట్ (రైతు మిత్ర – సోమవారం): సాయంత్రం 4.00–5.00 | | | |
| 1. | 02.06.2025 | వానాకాలం అపరాలు (సోయచిక్కుడు/పెసర/మినుము) సాగు రకాలు–మెళకువలు | **డా॥ ఎన్. సంధ్య కిషోర్,** సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, 9948976575 |
| 2. | 09.06.2025 | వానాకాలం కంది సాగుకు అనువైన రకాలు– మెళకువలు | **డా॥ జి. ఈశ్వర రెడ్డి,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 8808882766 |
| 3. | 16.06.2025 | వానాకాలం మొక్కజొన్న సాగు – సూచనలు | **డా॥ కె. నాగాంజలి,** శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట, 9492731222 |
| 4. | 23.06.2025 | వానాకాలం పంటలలో భూసార వృద్ధికి అనుసరించాల్సిన పద్ధతులు మరియు ఎరువుల యాజమాన్యం | **డా॥ ఎస్. సాయినాథ్,** శాస్త్రవేత్త (ఎస్.ఎస్.ఎ.సి.) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, 8891893440 |
| 5. | 30.06.2025 | వానాకాలనికి అనువైన వరి రకాలు | **డా॥ ఎల్. కృష్ణ,** ప్రధాన శాస్త్రవేత్త (జి.పి.బి.ఆర్.) వరి పరిశోధన స్థానం, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 9866091711 |

# వానాకాలం కంది పంట సాగులో మెళకువలు

డా॥ యం. మధు, డా॥ ఎన్. సంధ్య కిషోర్, డా॥ జి. పద్మజ, డా॥ డి. వీరన్న మరియు డా॥ ఆర్. ఉమా రెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్








- కంది దేశంలో మరియు రాష్ట్రంలో ఎక్కువ మొత్తం వానాకాలంలో సాగుచేసుకునే ముఖ్యమైన అపరాల పంట. కంది పంట ప్రపంచ వ్యాప్తంగా 6.03 మి.హెక్టార్ల విస్తీర్ణంలో సాగుచేస్తూ, 5.32 టన్నుల ఉత్పత్తితో సరాసరి ఉత్పాదకత 882 కి./హె.
- కంది సాగు విస్తీర్ణంలో మనదేశం (4.2 ఎమ్‌టి), అగ్రస్థానంలో ఉండగా, రెండవ స్థానంలో మలావి (0.44 ఎమ్‌టి), మయన్మార్ (0.32 ఎమ్‌టి), టరెజానియా, టాంజానియా (0.16 ఎమ్‌టి) మరియు కెన్యా (0.083 ఎమ్‌టి) (ఎఫ్ఎఓ, 2023)
- భారతదేశంలో కంది సాగు ముఖ్యంగా కర్ణాటక (15.83 ల హె.), మహారాష్ట్ర (12.17 ల. హె.), మధ్యప్రదేశ్ (3.61 ల.హె.), ఉత్తరప్రదేశ్ (3.15 ల.హె.), గుజరాత్ (2.27 ల.హె.), తెలంగాణ (2.02 ల.హె) లలో సాగులో ఉంది.
- తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా వికారాబాద్, సంగారెడ్డి, నారాయణ్‌పేట్, కామారెడ్డి, ఆదిలాబాద్, జోగులాంబ గద్వాల్ మరియు ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు.

**కంది సాగు వలన కలిగే లాభాలు:**

- కంది సాగు వల్ల భూసారం పెరుగుతుంది.
- కందికి ఎక్కువగా ఆకురాల్చు గుణం ఉండటం వల్ల, పంటకాలంలో ఎక్కువ మొత్తంలో ఆకునేల పడి సేంద్రియ పదార్థంగా మారడం వలన నేల భౌతిక, రసాయనిక లక్షణాలు మెరుగుపడతాయి.
- అంతేగాక భూమిలో మేలు చేసే సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి భూమి గుల్లబారి నీరు నిల్వ ఉంచుకొనే సామర్థ్యం పెరుగుతుంది.
- కంది వేర్లలో ఉండే రైజోబియం అను బ్యాక్టీరియా వేరు బుడిపెలలో ఉండి వాతావరణంలో నత్రజనిని గ్రహించి నేలకు అందిస్తాయి.

**నేలలు మరియు నేల తయారీ:** ఎర్ర చల్కా మరియు నల్లరేగడి నేలలు, మురుగు నీరు పోయే వసతి గల నేలలు సాగుకు అనుకూలం. చౌడు నేలలు మరియు నీటి ముంపునకు గురయ్యే నేలలు పనికిరావు. తొలికరిలో కురిసే వర్షాల ఆధారంగా దుక్కి బాగా తయారు చేసుకొని తేలికపాటి నేలల్లో 60 మి.మీ. మరియు బరువైన నేలల్లో 75 మి.మీ. వర్షపాతం నమోదైన తర్వాత లేదా దుక్కి 15-20 సెం.మీ. లోతు తడిపిన తర్వాత మాత్రమే విత్తనాన్ని విత్తుకోవాలి.

**విత్తే సమయం:** జూన్ 15 నుండి జూలై 15 వరకు విత్తుకోవాలి. వర్షాభావ పరిస్థితులలో ఆగష్టు 15 వరకు కూడా కందిని అపత్కాల పంటగా విత్తుకోవచ్చు.

**విత్తన మోతాదు:** ఒక ఎకరాకు 2-3 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: విత్తనం లేదా భూమి ద్వారా సంక్రమించే తెగుళ్ళను అరికట్టడానికి థైరమ్ లేదా కాప్టాన్ 3 గ్రా. ఒక కిలో విత్తనానికి చొప్పున పట్టించాలి. ఆ తర్వాత విత్తుకునే ముందు 200 గ్రా. రైజోబియం ఎకరా విత్తనానికి కలిపి విత్తుకోవాలి. అలాగే ట్రైకోడెర్మా విరిడె 8 గ్రా. కిలో విత్తనానికి పట్టించినచో ఎండుతెగులు మరియు భూమి ద్వారా సంక్రమించే తెగుళ్ళ నుండి అరికట్టవచ్చు.

**విత్తే దూరం:** నల్లరేగడి భూమిలో సాలుకు సాలుకు మధ్య 150 లేదా 180 సెం.మీ. ఎర్ర చల్కా భూముల్లో సాలుకు సాలుకు మధ్య 90 లేదా 120 సెం.మీ., రెండు మొక్కల మధ్య 20 సెం.మీ. ఉండేలా విత్తుకోవాలి.

### కంది రకాలు:

| రకం | పంటకాలం | దిగుబడి (క్వి/హె.) | గుణగణాలు |
|---|---|---|---|
| డబ్ల్యు.ఆర్.జి.ఇ-97 (వరంగల్ కంది-1) | వానాకాలం 150-160 | 7-8 | ఎండుతెగులును కొంతవరకు తట్టుకుంటుంది. గింజలు మధ్యస్థ లావుగా, ఎరుపురంగులో ఉంటాయి. |
| డబ్ల్యు.ఆర్.జి.ఇ-93 (తెలంగాణ కంది) | వానాకాలం 150-160 | 7-8 | గింజలు మధ్యస్థ లావుగా, ఎరుపు రంగులో ఉంటాయి. ఎండు తెగులును కొంత వరకు తట్టుకొనును |
| డబ్ల్యు.ఆర్.జి.ఇ-121 (తెలంగాణ కంది-2) | వానాకాలం 150-160 | 7-8 | బరువైన మరియు మధ్యస్థ నేలలకు అనువైనది. ఎండు తెగులును కొంత వరకు తట్టుకొను మధ్య స్వల్ప కాలిక రకం. |
| టి.డి.ఆర్.జి-4 (హనుమ) | వానాకాలం 160-180 యాసంగి 120-130 | 8-10 | ఫ్యూజేరియం ఎండుతెగులు, వెర్రి తెగులును మరియు శనగపచ్చ పురుగును కొంతమేరకు తట్టుకొనును |
| డబ్ల్యు.ఆర్.జి-65 (రుద్రేశ్వర) | వానాకాలం 160-180 యాసంగి 120-130 | 8-10 | ఫ్యూజేరియం ఎండుతెగులు మరియు శనగపచ్చ పురుగును కొంతవరకు తట్టుకొని, నల్లరేగడి భూములకు అనువైనవి. |
| పి.ఆర్.జి-176 (ఉజ్వల) | వానాకాలం 130-135 | 6-8 | తక్కువ వర్షపాతం కలిగిన ప్రాంతాలకు మరియు ఎర్ర చల్కా నేలలకు అనువైనవి |
| ఐ.సి.పి.హెచ్-2740 (మన్నెంకొండ కంది) | వానాకాలం 170-190 యాసంగి 120-140 | 8-10 | ఫ్యూజేరియం ఎండుతెగులు మరియు వెర్రి తెగులును పూర్తిగా తట్టుకొనును. నల్లరేగడి భూములకు నీటి పారుదలకు అనువైన సంకర రకం. |
| టి.డి.ఆర్.జి-272 (తెలంగాణ కంది-4) | వానాకాలం 160-165 | 7 క్వి/ఎ | ఫ్యూజేరియం ఎండుతెగులును మరియు కాయతొలిచే పురుగులను తట్టకుంటుంది. |
| డబ్ల్యు.ఆర్.జి.ఇ-255 | వానాకాలం 160-180 | 7-9 | ఫ్యూజేరియం ఎండుతెగులును తట్టుకుంటుంది. నల్లరేగడి నేలల్లో సాగు చేయడానికి అనుకూలం. |
| టి.డి.ఆర్.జి-59 | వానాకాలం 170-175 | 8-9 | ఫ్యూజేరియం ఎండుతెగులును గొడ్డుమోత తెగులును కొంతమేరకు తట్టుకొనును |

### విత్తే పద్ధతి:

- నాగలి వెంబడి గాని, సాళ్ళలో గొర్రుతో గాని విత్తుకోవాలి. యాంత్రికంగా సీడ్‌కమ్ ఫర్టిడ్రిల్‌తో బోదె కాలువల పద్ధతిలో కూడా విత్తుకోవచ్చు.
- కంది సాళ్ళ మధ్య మరియు మొక్కల మధ్య 90 సెం.మీ. సమ దూరంలో అచ్చు పద్ధతిలో కూడా విత్తుకోవచ్చును. ఇరువైపులా అంతరకృషికి దోహదపడే ఈ విధానంలో మంచి దిగుబడులు సాధించవచ్చును.

**అంతర పంటలు:** కందిని వివిధ పంటలలో అంతరపంటగా పండించినప్పుడు ఖచ్చితమైన నిష్పత్తిని పాటించాలి.

కంది + మొక్కజొన్న / జొన్న / సజ్జ - 1:4

కంది + పెసర / మినుము / సోయాచిక్కుడు - 1:7

కంది + ప్రత్తి - 1:4 లేదా 1:6

కంది + ప్రత్తి - 1:4 లేదా 1:6

### ఎరువుల యాజమాన్యం:

- ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు ఎకరానికి 2 టన్నుల చొప్పున వేసుకోవాలి.

- ముందు పంట అవశేషాలను రోటవేటర్‌తో భూమిని కలియదున్నాలి.
- ఎకరానికి 18 కిలోల యూరియా 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డి.ఎ.పి ని వేసుకోవాలి.

**కలుపు యాజమాన్యం:**

- పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.3 నుండి 1.6 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే గాని మరుసటి రోజుగాని పిచికారి చేయాలి.
- పైరు 20 రోజుల వయస్సులో వెడల్పాకు కలుపు లేత దశలో నివారణకు ఇమాజితాఫిర్ 300 మి.లీ. ఎకరాకు పిచికారి చేయాలి.
- గడ్డి జాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నచో క్విజాలోఫాస్-పి-ఇథైల్ 5% ఇసి 400 మి.లీ. లేదా ప్రొపాక్విజాఫాప్ 10% ఇసి 250 మి.లీ. కలుపు మొక్కలు 3-4 ఆకుల దశలో ఉన్నప్పుడు 250 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**నీటి యాజమాన్యం:** వానాకాలంలో కందిని వర్షాధారంగా పండిస్తారు. అవకాశమున్నచోట పూత, కాయ తయారయ్యే దశలో ఒకటి లేదా రెండు తడులు ఇస్తే దిగుబడులు పెరుగుతాయి.

**పంటకోత:**

- కంది రకాన్ని బట్టి పూత దశ నుండి 45-60 రోజులలో పంట పరిపక్వతకు వస్తుంది.
- కోతకు 3-4 రోజుల ముందు మలాథియాన్ 50 ఇసి 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసినచో నిల్వలో బ్రూచిడ్స్ ఆశించకుండా కాపాడవచ్చు.
- 80% కాయలు పూర్తిగా పరిపక్వతకు వచ్చిన తర్వాత కోయాలి.

**కోతానంతర జాగ్రత్తలు:**

- కోసిన మొక్కలను చిన్న కట్టలుగా కట్టి చిన్న చిన్న గూళ్ళుగా పెట్టి 10-12 రోజుల వరకు ఎండనిచ్చి ఆ తర్వాత నూర్పిడి చేయాలి.
- నూర్పిడి యంత్రంతో గాని మనుషుల ద్వారా గాని నూర్పిడి చేయవచ్చును.
- పశువులతో తొక్కించి లేదా ట్రాక్టర్‌తో తొక్కించి నూర్పిడి చేయవచ్చును.
- మనుషుల ద్వారా కట్టలను కర్రలతో కొట్టడం లేదా చెక్క బల్లలపై కొట్టి గింజలను వేరు చేయవచ్చును.
- నేరుగా కట్టలను నూర్పిడి యంత్రం (ఆల్ క్రాప్ థ్రెషర్) లో జొప్పించి నూర్పిడి చేయవచ్చు.

**ముఖ్య సూచనలు:**

- కందిని బోదసాళ్ళ పద్ధతిలో విత్తుకోవాలి.
- కంది పంట 45 రోజుల దశలో 10 సెం.మీ. పొడవు చిగుర్లు త్రుంచినప్పుడు కొమ్మలు ఎక్కువగా ఏర్పడి తద్వారా పూత కాత ఎక్కువగా ఏర్పడి దాదాపు 15 శాతం మేర అధిక దిగుబడి సాధించవచ్చు.
- శనగపచ్చ పురుగు మరియు మారుకా మచ్చల పురుగు సకాలంలో నివారించడానికి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- కీలకదశలో తేలికపాటి నీరు డ్రిప్ లేదా బోదెల ద్వారా అందించినచో అధిక దిగుబడులు సాధించవచ్చును. నిండు పూత దశలో నీరు పెట్టకూడదు.
- విత్తనం నుండి కోత వరకు యాంత్రిక పద్ధతులు అవలంభించినచో ఖర్చు తగ్గి ఆదాయం పెరుగును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 631553434**

**టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు**

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| III. టి-శాట్ (రైతు బంధు సమితి - శనివారం) సాయంత్రం 4.00-5.00 | | | |
| 1. | 21.06.2025 | వానాకాలం ప్రత్తి సాగు - సూచనలు | డా॥ కె. సుదాన్ష్ సుధాకర్, అసోసియేట్ ప్రొఫెసర్ (అగ్రానమి) వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, 9493871956ల |
| 2. | 28.06.2025 | వానాకాలనికి అనువైన వరి రకాలు-సూచనలు | డా॥ వై. చంద్రమోహన్, ప్రధాన శాస్త్రవేత్త (జి.పి.బి.ఆర్.) వరి పరిశోధన స్థానం, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 9908577040 |

# విత్తనశుద్ధి - అధిక దిగుబడికి మొదటి అడుగు

ఎమ్. సాయి చరణ్, డా॥ రమ్య రాథోడ్, బి. సౌందర్య, జి. రాకేష్, ఏ. దినేష్, డా॥ ఏ. కృష్ణ చైతన్య,
డా॥ ఫిర్దోస్ సహన మరియు డా॥ టి. అంజయ్య
ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్

పంటల సాగులో విత్తనశుద్ధి చాలా ముఖ్యమైన పద్ధతిగా భావించబడుతుంది. విత్తనాలను పురుగుమందులు, శిలీంధ్రనాశిని మరియు జీవసంబంధమైన రసాయనాలతో శుద్ధి చేయడం వల్ల మొలకలను ప్రారంభ దశలోనే మట్టిలో ఉండేలా లేదా విత్తనాల ద్వారా వ్యాపించే చీడపీడల నుండి రక్షణ కలిగించవచ్చు. విత్తనశుద్ధి వల్ల మొలకలు సమానంగా వస్తాయి. వ్యాధుల ప్రభావం తగ్గుతుంది. మొదటి దశలో స్ప్రే అవసరం తక్కువగా ఉంటుంది. ఇది తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఇచ్చే, పర్యావరణానికి హానికరం కాకుండా పంటల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పరిష్కార మార్గం. తెలంగాణలో వానాకాలంలో వివిధ పంటలను సాగుచేసే రైతులు నాణ్యమైన, తెగుళ్ళను తట్టుకునే పంట రకాలను ఎంచుకోవడంతో పాటు క్రింద తెలిపిన విధంగా విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలి.

**వరి:** నారుమడులను సిద్ధం చేసుకునే రైతులు ముందుగా విత్తనశుద్ధి పై శ్రద్ధ వహించాలి. మెట్ట నారుమడులకు అయితే కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండాజిమ్‌ను తడితో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. దమ్ము చేసిన నారు మడులకైతే లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి, తరువాత మండే కట్టిన మొలకలను నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు రసాయనం కలిపిన నీరు సరిపోతుంది. ఈ విధంగా శిలీంధ్రనాశినితో విత్తనశుద్ధి చేయడం వలన మొక్కకు తొలి దశలో ఆశించే అగ్గితెగులు మరియు ఆకు మచ్చ తెగుళ్ళను నివారించవచ్చు. అదేవిధంగా వరి నాట్లు వేసే ముందు నారు కట్టలను, క్లోరిపైరిఫాస్ 50% ఇసి 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 12 గం. ఉంచినట్లైతే తొలి 30 రోజుల వరకు వరి పంటను ఆశించే కాండం తొలిచే పురుగు, తాటాకు తెగులు, పచ్చదోమలను నివారించవచ్చు.

**చెఱకు:** విత్తనం కోసం జూన్-జూలై మాసంలో చెఱకు నాటుకునే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధిని చేసుకోవాలి. దీనికిగాను ముచ్చెలను వేడినీటిలో $52^0$ సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 30 నిమిషాలు లేదా తేమతో మిళితమైన వేడిగాలిలో $54^0$ సెల్సియస్ వద్ద 2 గం. ఉంచి శుద్ధి చేయాలి, దీని వలన గడ్డి దుబ్బు తెగులు, ఆకుమాడు మరియు కాటుక తెగుళ్ళను నివారించవచ్చు.

**సోయాచిక్కుడు:** పంట తొలిదశలో ఆశించే మొవ్వు కుళ్ళు తెగులు మరియు ఆకుమచ్చ తెగుళ్ళ నుండి సంరక్షించడానికి కిలో విత్తనానికి 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. థైరామ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేయాలి. తరువాత 1.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 48% తో విత్తనశుద్ధి చేయాలి, దీనివలన రసంపీల్చే తామర పురుగులు మరియు కాండం తొలిచే ఈగ నుండి పంట రక్షించబడుతుంది. దాని తరువాత ప్రతి పది కిలోల విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చర్‌ను తగినంత నీరు మరియు జిగురును కలిపి విత్తనానికి పట్టించి, నీడలో ఆరబెట్టి అరగంట తర్వాత విత్తుకోవాలి, దీని వలన నత్రజని స్థిరీకరణ పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు.

**మొక్కజొన్న:** పంటలో కాండం కుళ్ళు, ఆకుమాడు తెగులు మరియు మసికుళ్ళు అధికంగా ఆశించే ప్రాంతాలలో మ్యాంకోజెబ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేసుకోవాలి. అదేవిధంగా కత్తెర పురుగు మరియు గులాబిరంగు కాండం తొలుచు పురుగు నివారణకు థయోమిథాక్సామ్ + సయాంట్రానిలిప్రోల్ 4 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

**పసుపు:** పసుపు పంటను దుంప వేరుకుళ్ళు తెగులు మరియు ఆకుమచ్చ తెగుళ్ళ నుండి కాపాడుకోవడానికి లీటరు నీటికి 3 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 3 గ్రా. మెటలాక్సిల్ కలిపిన ద్రావణంలో 40 నిమిషాల సేపు కొమ్ములను ఉంచి బయటకు తీసి నీడలో ఆరబెట్టాలి. పసుపు కొమ్ము/విత్తనాలకు పొలుసు పురుగు ఆశించి ఉన్నప్పుడు శిలీంధ్రనాశినితో పాటు లీటరు నీటికి 5 మి.లీ. మలాథియాన్ మరియు 2 మి.లీ. మోనోక్రోటోఫాస్ కూడా కలిపి, తర్వాత నీడలో ఆరబెట్టి, నీటిని మార్చి 5 గ్రా. ట్రైకోడెర్మా విరిడె

కలిపిన ద్రావణంలో ముంచి కొమ్ములను నీటిలో ఆరబెట్టి విత్తుకోవాలి.

**వేరుశనగ:** ఆకుమచ్చ తెగులు, కాండం మొదలు కుళ్ళు తెగులును పంట తొలిదశలో నివారించడం కోసం కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. వేరు పురుగు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 7 మి.లీ. క్లోరిపైరిఫాస్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

**కంది:** కందిలో విత్తనం ద్వారా సంక్రమించే ఎండుతెగులును నివారించడానికి తెగులును తట్టుకునే రకాలను సాగు చేయడంతో పాటు 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడేతో కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. దాని తరువాత, ఎకరాకు సరిపోయే విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చర్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.

**పెసర, మినుము:** కిలో విత్తనానికి 2.5 గ్రా. మ్యాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేయడం వలన ఆకుమాడు తెగుళ్ళ నుండి పంటను కాపాడవచ్చు. పైరు తొలిదశలో ఆశించే రసంపీల్చే పురుగుల నుండి పంట రక్షణ కొరకు కిలో విత్తనానికి 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా మోనోక్రోటోఫాస్‌తో విత్తనశుద్ధి చేయాలి.

అపరాలు అయినటువంటి కంది, పెసర మరియు మినుము వంటి పంటలలో ప్రత్యేకంగా నిర్దేశించబడిన రైజోబియం కల్చర్‌ను 200 గ్రా. ఎకరాకు సరిపోయే విత్తనానికి పట్టించాలి, దీనివలన నత్రజని స్థిరీకరణ పెరిగి అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

**ప్రొద్దుతిరుగుడు:** ప్రొద్దుతిరుగుడులో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు ఆశించే ప్రాంతాల్లో రైతులు ఇప్రోడియాన్ 25% + కార్బండాజిమ్ 25% మందును 2 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. అదేవిధంగా పంట తొలి దశలో ఆశించే తెల్లదోమ మరియు పచ్చదోమ వంటి రసం పీల్చే పురుగుల నివారణకు కిలో విత్తనానికి 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.

ఈ విధంగా రైతులు సాగుచేసే పంటలలో తప్పనిసరిగా ముందుగా శిలీంధ్రనాశిని, తరువాత కీటకనాశిని దాని తరువాత జీవ సంబంధమైన రసాయనాలతో విత్తనశుద్ధి చేయడంతో పాటుగా సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపట్టి అధిక దిగుబడులు సాధించగలరు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **8919798959**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి బుధవారం రాత్రి **7:15-7:45** ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. జూన్, **2025** లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 05.06.2025 | వానాకాలం పంటల్లో ఎరువుల యాజమాన్యం | డా॥ టి. సుకృత్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (ఎస్.ఎస్.) ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ మైక్రోనూట్రియేట్స్, రాజేంద్రనగర్, 9491402702 |
| 12.06.2025 | అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగు | డా॥ జె.ఎస్. సుధారాణి, శాస్త్రవేత్త (అగ్రానమి) ఎలక్ట్రానిక్ వింగ్, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 9550526096 |
| 19.06.2025 | వానాకాలం పంటల్లో విత్తనశుద్ధి అవశ్యకత | డా॥ టి. రాజేశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూరు, 9390898305 |
| 26.06.2025 | వానాకాలం ప్రత్తి పంటలో సస్యరక్షణ | డా॥ యం. రాజశేఖర్. శాస్త్రవేత్త (ఎంటామాలజీ) ఇన్స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ(ఐబిటి), రాజేంద్రనగర్ 8247421216 |

# రైతు స్థాయిలో విత్తన నాణ్యత నిర్ధారించే పరీక్షలు - వాటి నిర్వాహణ

డా॥ పి. సుజాత, డా॥ కె. గోపాల కృష్ణ మూర్తి, డా॥ వి. గౌరీ శంకర్, డా॥ వై. భారతి, డా॥ ఎం. పల్లవి, కె. అర్పిత మరియు వి. నవ్య

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్



విత్తు కొద్ది పంట అనగా పంట ఆరోగ్యం మరియు దిగుబడి విత్తన నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. విత్తనం మాత్రమే వ్యవసాయంలో జీవసంబంధమైన పెట్టుబడి, దీనిపైనే మిగతా అన్ని పెట్టుబడులు ఆధారపడి ఉంటాయి. నాణ్యమైన విత్తనాన్ని వాడటం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించవచ్చు. మంచి నాణ్యత గల విత్తనం ఎక్కువ జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత, మొలక శాతం, జీవశక్తి, ఆరోగ్యం మరియు ప్రామాణాలకు అనుకూలంగా విత్తన తేమను కలిగి ఉంటుంది. అందువలన విత్తనాన్ని సేకరించిన తరువాత విత్తుకొనే ముందు దాని నాణ్యతను పరీక్షించి నిర్ధారించుకోవటం చాల అవసరం. రైతుల స్థాయిలో విత్తన నాణ్యతను అంచనా వేయడం చాలా అవసరం, ఎందుకంటే మంచి మొలక మరియు అధిక దిగుబడి సాధించాలంటే నాణ్యమైన విత్తనాల వాడకం తప్పనిసరి. ప్రయోగశాల ప్రమాణాలు అందుబాటులో లేని సందర్భాల్లో, రైతులు తమ స్థాయిలో కొన్ని సరళమైన పద్ధతుల ద్వారా విత్తన నాణ్యతను పరీక్షించవచ్చు. ముఖ్యంగా

విత్తన భౌతిక శుద్ధత, తేమ స్థాయి, మొలక వంటి అంశాలను అంచనా వేయడం ద్వారా విత్తన నాణ్యతను అంచనా వేయవచ్చు.

## విత్తన నాణ్యత ప్రమాణాలు

### 1. విత్తన స్వచ్ఛత:

**విత్తన జన్యు స్వచ్ఛత:** జన్యు స్వచ్ఛత అనేది విత్తనాలలో తల్లిదండ్రుల జన్యుగుణాల ఖచ్చితమైన కొనసాగింపును సూచిస్తుంది. ఇది వాణిజ్య విత్తనాల నాణ్యతకు చాలా కీలకం. శుద్ధమైన విత్తనాలను వాడటం వల్ల ఏకరీతిగా మొలకెత్తడం, సమానంగా అభివృద్ధి చెందడం, ఆశించిన దిగుబడులు రావడం సాధ్యమవుతుంది. జన్యు స్వచ్ఛతలో లోపం వస్తే పంటలో వైవిధ్యం, దిగుబడిలో తగ్గుదల, మరియు మార్కెట్ విలువలో తగ్గింపు సంభవించవచ్చు. కాబట్టి విత్తన ఉత్పత్తిలో జన్యు స్వచ్ఛతను నిర్ధారించేందుకు నియమిత పరీక్షలు మరియు పర్యవేక్షణ అవసరం. ఫౌండేషన్ విత్తనంలో జన్యు శుద్ధత కనీసం 98% ఉండాలి, అదే విధంగా సర్టిఫైడ్ విత్తనంలో ఇది కనీసం 95% ఉండాలి.

**విత్తన భౌతిక స్వచ్ఛత:** విత్తన భౌతిక స్వచ్ఛత అనేది ఒక నమూనాలో ఉన్న స్వచ్ఛమైన పంట విత్తనాల శాతం. ఇందులో కలుషితాలైన ఇతర పంటల విత్తనాలు, కలుపు మొక్కల విత్తనాలు, జడ పదార్థాలు (మట్టి తుక్కులు, విత్తన అవశేషాలు) ఉండకూడదు. భౌతిక స్వచ్ఛత ఎక్కువగా ఉన్న విత్తనాలు సమానమైన మొలక మరియు మంచి మొక్కల నిలుపుదలకు దోహదపడతాయి. భారత కనీస విత్తన ధృవీకరణ ప్రమాణాల ప్రకారం విత్తనానికి కనీస భౌతిక స్వచ్ఛత 98% ఉండాలి. కాబట్టి విత్తనశుద్ధి సమయంలో స్వచ్ఛత పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి.

రైతులు చూపు ద్వారా విత్తనాల్లో కలిసిన ఇతర పదార్థాలు (వేరే రకాల విత్తనాలు, పొడి భాగాలు, మలినాలు) ఉండకూడదని పరిశీలించవచ్చు. విత్తనాలను ఒక జల్లెడలో పోసి వేరు చేయడం ద్వారా ఇతర మలినాలను గుర్తించవచ్చు. అధిక శుద్ధత కలిగిన విత్తనాలే విత్తడానికి అనువైనవి.

పంటల వారీగా కనీస విత్తన భౌతిక శుద్ధత ప్రమాణాలు (%)

| పంట | భౌతిక స్వచ్ఛత ప్రమాణం (%) |
|---|---|
| బెండకాయ | 99 |
| వరి, మొక్కజొన్న, గోధుమ, బార్లీ, జొన్న, సజ్జ, పప్పుదినుసులు, కందులు, మినుము, పెసలు, బఠానీ, సోయాబీన్, ఆముదం | 98 |
| రాగులు, నువ్వులు, జనపనార | 97 |
| వేరుశనగ | 96 |
| గడ్డి విత్తనాలు | 95 |

**2. ఇతర ప్రత్యేక లక్షణాలున్న రకాల విత్తనాలు:** ఇతర ప్రత్యేక లక్షణాలున్న రకాలు పరీక్షిస్తున్న విత్తన రకం నుండి భిన్నంగా ఉంటాయి. ఇవి మొలకల దశ, మొక్కల ఎదుగుదల దశ లేదా పంట పరిపక్వ దశలో గుర్తించగల ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటాయి ఉదాహరణకు భిన్నమైన ఆకుల రంగు, ఆకారం మొదలైనవి. విత్తనశుద్ధతలో ఇవి ప్రధానంగా పరిగణనలోకి తీసుకోబడతాయి, ఎందుకంటే ఇవి జన్యుశుద్ధతను ప్రభావితం చేస్తాయి. ఫౌండేషన్ విత్తనాల్లో మరియు సర్టిఫైడ్ విత్తనాల్లో వీటి సంఖ్య పరిమితంగా ఉండాలి, తద్వారా పంటలో ఏకరీతి మరియు ఆశించిన దిగుబడి నిర్ధారించబడుతుంది. ఫౌండేషన్ విత్తనాల్లో వీటి పరిమితి సాధారణంగా 0.10% ఉండాలి, సర్టిఫైడ్ విత్తనాల్లో ఇది 0.20% ఉండాలి.

**3. విత్తన తేమ స్థాయి:** విత్తన తేమ స్థాయి అనేది విత్తనంలో ఉండే తేమ శాతం. దీనిపై విత్తన నిల్వ, నాణ్యత మరియు మొలకెత్తు సామర్థ్యం ఆధార పడి ఉంటాయి. తేమ స్థాయి అధికంగా ఉంటే విత్తనాలను శిలీంద్రాలు, బాక్టీరియా వంటివి ఆసించి విత్తన నాణ్యతను తగ్గిస్తుంది. సాధారణంగా వివిధ పంటల్లో విత్తన తేమ స్థాయిని 10-12% మధ్య ఉంచటం మంచిది, ఇది విత్తనాన్ని ఎక్కువ కాలం నిల్వ చేయడంలో సహాయపడుతుంది. విత్తన ధృవీకరణలో తేమ స్థాయి నిర్ధారణ తప్పనిసరి, ఎందుకంటే తేమ శాతం ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న విత్తనాలు మాత్రమే మొలకెత్తి మంచి దిగుబడిని అందిస్తాయి మరియు తేమ శాతం నిల్వ సామర్థ్యాన్ని నియంత్రిస్తుంది. విత్తన తేమ శాతం విత్తనాల నిల్వ కోసం వినియోగించే ప్యాకింగ్ మెటీరియల్ పై కూడా ఆధారపడి ఉంటుంది.

సాధారణ ప్యాకింగ్ కోసం విత్తనంలో తేమ 8-12% ఉండాలి, గాలి చొరబడని ప్యాకింగ్ కోసం 6-8% ఉండాలి.

విత్తనాన్ని చేతితో గట్టిగా నలిపితే పొడిగా ఉండాలి. విత్తనాన్ని దంచినపుడు పొడి ఉత్పత్తి అయితే తేమ తక్కువగా ఉందని అర్థం. ఎక్కువ తేమ ఉన్న విత్తనాలు నిల్వకు అనువుగా ఉండవు, అవి త్వరగా పాడవుతాయి.

**4. విత్తన మొలక శాతం:** విత్తనం అనుకూలమైన పరిస్థితుల్లో మొలకెత్తి కొత్త మొక్కగా మారే ప్రక్రియను మొలకెత్తడం అంటారు. ఇది సరైన తేమ, కాంతి, ఉష్ణోగ్రత, ఆక్సిజన్ వంటి అనుకూల పరిస్థితులలో మొదలవుతుంది. మొలకెత్తే సమయంలో విత్తనంలో ఉన్న శక్తిని ఉపయోగించి, విత్తన మొలకలు విత్తనపు కవచం నుంచి వెలువడతాయి. ఈ దశలో విత్తనం ఆరోగ్యంగా ఉండడం, మొలకెత్తే శక్తి ఎక్కువగా కలిగిన విత్తనాలను విత్తడం వలన మంచి దిగుబడిని సాధించవచ్చు. విత్తన ధృవీకరణలో మొలకెత్తు శాతం

**వివిధ పంటల విత్తనాలను నిల్వచేయుటకు ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణయించిన విత్తన తేమ శాతం క్రింది విధంగా పొందుపరచబడింది:**

| పంట పేరు | విత్తన తేమ (%) |
|---|---|
| వరి | 13 |
| మొక్కజొన్న, గోధుమ, బార్లీ, జొన్న, సజ్జ, రాగులు, సోయాబీన్ | 12 |
| పత్తి, బెండ, గడ్డి విత్తనాలు, గోగు | 10 |
| పప్పుదినుసులు, కందులు, మినుము, పెసర, బఠానీ, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ | 9 |
| ఆముదం, వంకాయ, టమోటా, మిరప, తోటకూర, మెంతి, ఉల్లిపాయ | 8 |
| కాకర, సొరకాయ, దోసకాయ, గుమ్మడికాయ, బీరకాయ, పొట్లకాయ, పుచ్చకాయ, | 7 |

తప్పనిసరి, ఎందుకంటే అది విత్తన నాణ్యతను సూచిస్తుంది. మంచిగా మొలకెత్తు విత్తనాల నుంచి పంట బాగా అభివృద్ధి చెందుతుంది. ఇది మొక్కజొన్నలో 90%, వరిలో 80% ఉండాలి.

**5. విత్తన శక్తి / విత్తన సామర్థ్యం:** విత్తనం మొలకెత్తిన తర్వాత ఆరోగ్యంగా, శక్తివంతంగా పెరిగే సామర్థ్యాన్ని విత్తన శక్తి అంటారు. విత్తన శక్తి అనేది విత్తనం మొలకెత్తే సామర్థ్యానికి తోడు, ప్రతికూల పరిస్థితుల్లోనూ వేగంగా, సమానంగా మొలకెత్తి, బలమైన మొక్కగా, వేగంగా మొలకెత్తే సామర్థ్యాన్ని సూచిస్తుంది. ఇది విత్తన నాణ్యతలో ఒక కీలక అంశం. విత్తన శక్తి ఎక్కువగా ఉన్న విత్తనాలు తక్కువ తేమ, అధిక ఉష్ణోగ్రత లేదా భూసారత లోపం ఉన్నా కూడా మెరుగైన మొక్కల నిలుపుదల చూపుతాయి. విత్తన శక్తి మెరుగ్గా ఉండడం వల్ల పంట ప్రారంభ దశ బలంగా ఉండి, చివరికి దిగుబడి మీద సానుకూల ప్రభావం చూపుతుంది.

**6. విత్తన ఆరోగ్యం:** విత్తన ఆరోగ్యం అనేది విత్తనంలో హానికరమైన శిలీంద్రాలు, బాక్టీరియా, వైరస్ మరియు ఇతర సూక్ష్మజీవులు లేని స్థితిని సూచిస్తుంది. ఈ రోగకారకాలు విత్తనాలపై లేదా లోపల ఉండి మొలకెత్తు శక్తిని మరియు మొక్కల అభివృద్ధిని ప్రభావితం చేయవచ్చు. దెబ్బతిన్న విత్తనాల వల్ల మొలకలు బలహీనంగా ఉండడం, వ్యాధులు ఆశించటం మరియు దిగుబడి తగ్గిపోవడం జరుగుతుంది. విత్తన ఆరోగ్య పరీక్షల ద్వారా విత్తనాలలో ఉండే వ్యాధికారకాలను గుర్తించి, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవచ్చు. ఆరోగ్యమైన విత్తనాల వినియోగం వల్ల ఆరోగ్యకరమైన పంట మరియు అధిక దిగుబడి సాధ్యమవుతుంది.

**విత్తన నాణ్యత పరీక్షల ఆవశ్యకత:**

1. విత్తనాలు మొలకెత్తే సామర్థ్యం ఉన్నాయా లేదా తెలుసుకోవచ్చు.
2. ఆరోగ్యంగా, సమానంగా మొలకెత్తే విత్తనాలను ఎంపిక చేసుకోవచ్చు.
3. వ్యాధిరహిత విత్తనాల ఎంపిక.
4. దిగుబడి అంచన.
5. నాణ్యత లేని విత్తనాల వలన వచ్చే నష్టం నివారించవచ్చు.
6. నిల్వలో పెట్టే ముందు విత్తన నాణ్యత తెలుసుకోవడం ద్వారా పంట విఫలమవకుండా చూడవచ్చు.
7. విత్తన నాణ్యత ప్రమాణాలను అనుసరించి సరైన రకం విత్తనాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

**విత్తన మొలక శాతం పరీక్ష విధానాలు:**

**1. కాగిత పద్ధతి:** తడిపిన గట్టి కాగితంపై 100 విత్తనాలు వరుసగా పెట్టాలి, దానిని చుట్టి. చల్లటి ప్రదేశములో, నీరు లేనిచోట మూసి ఉంచాలి. వారం రోజుల తర్వాత మొలక వచ్చిన విత్తనాలను లెక్కించి విత్తన మొలక శాతం నిర్ధారించాలి.

**2. పేపర్ పద్ధతి:** శుభ్రమైన ఫిల్టర్ పేపర్‌ని తీసుకోవాలి. దానిని ట్రే లేదా ప్లేట్‌లో ఉంచాలి. కొద్దిగా నీటితో తడపాలి. విత్తనాలను కాగితం మీద సమాన దూరంలో పెట్టాలి. పైభాగంలో మరో తడి పేపర్ను వేసి లేదా మూత పెట్టి ఉంచాలి. అనుకూలమైన ఉష్ణోగ్రతలో ఉంచి రోజూ తేమను కాపాడాలి. కొన్ని రోజుల్లో మొలకలు బయటపడతాయి తద్వార వాటి శాతం లెక్కించవచ్చు.

**3. ట్రే / ఇసుక పద్ధతి:** శుభ్రమైన ఇసుకతో ట్రేను నింపి దానిలో 100 విత్తనాలు నాటాలి. ట్రేలో తేమను ఎప్పుడూ ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. నిర్ణీత రోజులకు తరువాత మొలకలను లెక్కించాలి.

**4. గోనే సంచి పద్ధతి:** 100 విత్తనాలను తడిగా చేసిన బట్ట / గుడ్డ లో చుట్టి, చల్లని చోట ఉంచాలి. ప్రతి రోజు గోనే సంచి తడిపి తేమ ఉండేలా చూడాలి. 7-10 రోజులకు మొలకెత్తిన విత్తనాలను లెక్కించాలి. వివిధ పంటల్లో ప్రమాణాలకు అనుగుణంగా మొలక శాతం కలిగిన విత్తనాలు ఉన్నప్పుడే మాత్రమే విత్తనాలను విత్తుకోవాలి. మొలకల పరిశీలన మరియు మొలక శాతం లెక్కించే విధానం విత్తనాలు మొలకెత్తిన తర్వాత అవి ఆరోగ్యంగా మరియు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయా అనే దానిపై చేయబడే పరిశీలనను మొలక మూల్యాంకనం అంటారు. ఈ ప్రక్రియలో సాధారణ మొలక, అసాధారణ మొలక, మొలకెత్తని విత్తనం మరియు చనిపోయిన/ కుళ్ళిన విత్తనంగా వర్గీకరిస్తారు. సాధారణ మొలకలు బలమైన వేరు, అంకురం పైభాగ కలిగి ఉండి, భవిష్యత్తులో మంచి మొక్కలుగా ఎదుగుతాయి. ఈ మూల్యాంకనం విత్తన శక్తిని అంచనా వేసేందుకు ఉపయోగపడుతుంది. మొలక మూల్యాంకనం ద్వారా విత్తనాల నాణ్యతపై స్పష్టమైన అవగాహన లభించి, రైతులకు సరైన విత్తన ఎంపికలో మార్గదర్శకంగా నిలుస్తుంది.

మొలక శాతం లెక్కించు విధానం: విత్తన మొలక (%) = (మొలకెత్తిన విత్తనాల సంఖ్య / మొత్తం విత్తనాల సంఖ్య) × 100.

**భారత కనిష్ఠ విత్తన ధృవీకరణ ప్రమాణాల ప్రకారం వివిధ పంటలలో ఉండవలసిన కనీస మొలక శాతం (%):**

| పంట పేరు | కనీస మొలక శాతం (%) |
|---|---|
| మొక్కజొన్న - సంకర మరియు సాధారణ రకాలు | 90 |
| గోధుమ, బార్లీ, శనగ, ఆవాలు | 85 |
| వరి, వరి హైబ్రిడ్, మొక్కజొన్న ఇన్‌బ్రెడ్స్, ఉలవలు, నువ్వులు, కుసుమ, జనపనార | 80 |
| జొన్న, సజ్జ, కొర్ర, వరిగ, సామ, చిరు ధాన్యాలు, పప్పుదినుసులు, కందులు, మినుము, పెసలు, బఠానీ, ప్రత్తి హైబ్రిడ్ | 75 |
| సోయాబీన్, ఆముదం, వేరుశనగ, పొద్దుతిరుగుడు, వంకాయ, టమోటా, క్యాబేజీ, కాలీఫ్లవర్, తోటకూర, ఆకు కూరలు, ఉల్లిపాయ, ముల్లంగి | 70 |
| ప్రత్తి రకాలు, ఇండియన్ క్లోవర్, బెండ | 65 |
| క్యాప్సికమ్, మిరపకాయ, దోస, క్యారెట్ | 60 |
| దీననాథ్ గడ్డి | 50 |

రైతుల స్థాయిలో విత్తన నాణ్యత పరీక్షలు చాలా సులభంగా, తక్కువ ఖర్చుతో చేయవచ్చు. వీటివల్ల రైతులు పాడైన లేదా తక్కువ నాణ్యత కలిగిన విత్తనాలను ముందుగానే గుర్తించి తొలగించవచ్చు. ఇది మొలకెత్తు శాతం మెరుగుపరచడంలో, సమగ్ర దిగుబడి పెంపొందించడంలో కీలకంగా ఉంటుంది. నాణ్యమైన విత్తనాల ఎంపిక వ్యవసాయ విజయానికి మొదటి అడుగు. కావున రైతు సోదరులు విత్తనాలను విత్తుకోడానికి ముందే విత్తన నాణ్యత పరీక్షలు నిర్వహించి, నాణ్యమైన విత్తనంగా నిర్ధారించుకున్న తర్వాతే ప్రధాన పొలంలో నాటడం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7989007024**

**టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాల**

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డిడి - యాదగిరి (రైతు నేస్తం): సాయంత్రం 6.00-7.00 | | | |
| 1. | 9.6.2025 | ఉత్తర తెలంగాణ మండలానికి వానాకాలం పంటల ప్రణాళిక | డా॥ డి. శ్రీలత, పరిశోధన సహాయ సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, 8332970384 |
| 2. | 11.6.2025 | మధ్య తెలంగాణ మండలానికి వానాకాలం పంటల ప్రణాళిక | డా॥ ఆర్. ఉమా రెడ్డి, పరిశోధన సహాయ సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, 8332970385 |
| 3. | 13.6.2025 | అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగు | డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, 9908033309 |
| 4. | 18.6.2025 | రైతు సంఘాల ఏర్పాటు మరియు అవశ్యకత | డా॥ శివ కృష్ణ కోట, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, 8333818267 |
| 5. | 23.6.2025 | దక్షిణ తెలంగాణ మండలానికి వానాకాలం పంటల ప్రణాళిక | డా॥ సి. సుధాకర్, పరిశోధన సహాయ సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 8332970383 |
| 6 | 25.6.2025 | వానాకాలం వరి రకాలు మరియు వివిధ పద్ధతుల్లో వరి సాగు | డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్ వరి పరిశోధన స్థానం, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 8333818218 |

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



## అన్నదాతల అవగాహన కార్యక్రమం
**(మే 5-జూన్ 13, 2025)**

తెలంగాణ రైతాంగానికి ప్రధానమైన సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం నడుం బిగించింది. దీనిలో భాగంగా మా విశ్వవిద్యాలయం వ్యవసాయశాఖ సహకారంతో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మే 5 నుండి జూన్ 13 వరకు నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమాన్ని మే 5వ తేదీన వికారాబాద్ జిల్లా ధరూర్‌లో గౌ॥ శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి గౌ॥ శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ గౌ॥ శ్రీ ఎమ్. కోదండ రెడ్డి మరియు వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య లాంఛనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 శాస్త్రవేత్తల బృందాలు రాష్ట్రంలోని 1200 రెవిన్యూ గ్రామాల్లో పర్యటిస్తున్నాయి. దక్షిణ వ్యవసాయ మండలంలో సుమారు 100 శాస్త్రవేత్తల బృందాలు, ఉత్తర మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 చొప్పున శాస్త్రవేత్తల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాయి. ఈ కార్యక్రమం ప్రారంభించిన నాటి నుండి మే 31 వరకు 785 గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా సుమారు 40 వేల మంది పురుషులు, 8 వేల మంది మహిళలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం 48వేల మంది రైతులతో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు మరియు వ్యవసాయ విద్యార్థులు ముఖాముఖిగా మాట్లాడారు. ఇప్పటివరకు ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్‌పి డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, ఎమ్మెల్సీలు, సుమారు 30 మంది శాసనసభ్యులు, వివిధ స్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు,















అభ్యుదయ రైతులు, రైతు గ్రూపులు, సంఘాల ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. అదేవిధంగా శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ విద్యార్థులతో పాటు వారంలో ఒకరోజు విశ్వవిద్యాలయ ఉపకులపతి, ఇతర విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఆరు అంశాలైన తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించడం, అవసరం మేరకే రసాయనాలను వాడి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, వివిధ ఇన్ పుట్స్ కొనుగోలుకు సంబంధించిన రశీదులను భద్రపరచుకోవడం, సాగు నీటిని ఆదా చేయడం, పంట మార్పిడులను పాటించి సుస్థిరాదాయాన్ని పొందడం, చెట్లను నాటి పర్యావరణాన్ని రక్షించడం వంటి వాటిపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు రైతాంగానికి అవగాహన కల్పిస్తున్నారు. అలాగే రైతులు అడుగుతున్న అనేక సందేహాలను శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో నివృత్తి చేస్తున్నారు.



గత నాలుగు వారాలుగా సాగుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నున్న రైతాంగం నుంచి మంచి స్పందన వస్తున్నది. మనం అమలు చేస్తున్న ఈ వినూత్న కార్యక్రమం మాదిరిగానే దేశంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ అనే కార్యక్రమాన్ని మే నెల 29 నుండి అమలు చేయడం చాలా సంతోషకరం. ఇదే స్ఫూర్తితో రాబోయే రెండు వారాల్లో కూడా రాష్ట్రంలోని రైతు సోదరులు, మహిళలు, అభ్యుదయ రైతులు, రైతు గ్రూపులు, సంఘాల ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని దీన్ని ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాలని ఆశిస్తున్నాము.










# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునీత దేవి




**అడ్డం:**

2. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ఏ నేలలకు వేయరాదు? (7)
3. పచ్చిరొట్ట పంటలను ఏ దశలో భూమిలో కలియదున్నాలి? (4)
4. ట్రైకోగ్రామ ప్రీటియోజం అనే బదనికను మొక్కజొన్నలో ఏ పురుగు నివారణకు విడుదల చేస్తారు? (6) (కుడి నుండి ఎడమకు)
8. టమాటలో ఏ ధాతువు లోపం వలన కాయ ఎండుతెగులు వస్తుంది? (3)
9. పంట తొలిదశలో ఆశించే రసంపీల్చే పురుగుల నివారణకు విత్తనశుద్ధికి విరివిగా వాడే కీటకనాశిని ఏది? (6)

11 వేరుశనగలో ఏ తెగులు ఆశించడం వలన విత్తనం మొలకెత్తిన తర్వాత నేలకు ఆనుకొని కాండంపైన నల్లని శిలీంధ్ర బీజాలతో కప్పబడి ఉంటుంది? (8)

**నిలువు:**

1. రెండు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులో ఎన్ని కిలోల ఫాస్ఫరస్ లభిస్తుంది? (4)
5. వరిలో ఏ పురుగు ఆశించడం వలన అంకురం లేత ఆకుపచ్చని పొడగాటి గొట్టంగా మారుతుంది? (4) (క్రింది నుండి పైకి)
6. ప్రధాన పంటల కన్నా పురుగులు ఎక్కువగా ఆకర్షించే పంటలను ఏమంటారు? (5) (క్రింది నుండి పైకి)
7. బొప్పాయిలో రింగ్ స్పాట్ వైరస్ వ్యాప్తి ఏ పురుగు ద్వారా జరుగుతుంది? (4) (క్రింది నుండి పైకి)
9. పెసర / మినుము పంటలలో ఏ ధాతు లోపం వలన లేత ఆకులలో ఈనెల మధ్య హరితాన్ని కోల్పోయి పసుపు రంగు లేదా తెలుపు వర్ణంలోకి మారుతుంది? (3) (క్రింది నుండి పైకి)
10. మొక్కజొన్నలో ఏ ధాతు లోపం వలన ముదురు ఆకుల చివర్లలో మొదలై ఆకు అంచులు పసుపు మరియు గోధుమ రంగులోకి మారి క్రమంగా ఎండిపోతాయి? (4) (క్రింది నుండి పైకి)
11. జొన్న పంటను ఆలస్యంగా విత్తినప్పుడు లేదా విత్తిన వెంబడే వర్షాభావ పరిస్థితులు వస్తే ఏ పురుగు ఎక్కువగా ఆశిస్తుంది? (8) (క్రింది నుండి పైకి)

సమాధానాలు 50వ పేజీలో

## గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నాణ్యమైన విత్తనాల పంపిణీ జూన్ 2న ప్రారంభం

**– ఉపకులపతి డా॥ అల్దాస్ జానయ్య**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విత్తన వారోత్సవాలలో భాగంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 2వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు ప్రారంభించనున్నారని ఉపకులపతి డా॥ అల్దాస్ జానయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 2వ తేదీన ప్రతి రెవెన్యూ గ్రామానికి చెందిన 3-5 మంది అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తన సంచులను పంపిణీ చేయనున్నట్లు తెలపడం జరిగింది. ఈ విత్తన వారోత్సవాలలో భాగంగా జూన్ 3వ తేదీ నుండి వ్యవసాయ విశ్వవిద్యాలయ కేంద్రాల్లో వరి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, ఆముదం మరియు చిరుధాన్యాల పంటలకు సంబంధించిన సుమారు 8500 క్వింటాళ్ళ విత్తనం పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు పరిమిత వనరులతో, పరిమితంగా పంపిణీకి సిద్ధంగా ఉన్న నాణ్యమైన విత్తనాలను ఈ విత్తన వారోత్సవాలలో భాగంగా సంబంధిత కేంద్రాల నుండి జూన్ 3వ తేదీ నుండి కొనుగోలు చేసుకోవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ అల్దాస్ జానయ్య రైతులను కోరారు.

### విత్తన పంపిణీ కేంద్రాల వివరాలు

| క్ర.సం. | విత్తన పంపిణీ కేంద్రం | పంటల వివరములు | ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| 1. | వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎఆర్ఐ, రాజేంద్రనగర్ | వరి, మొక్కజొన్న | 9440225385 |
| 2. | విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రం, రాజేంద్రనగర్ | వరి | 8639975840 |
| 3. | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, మరియు కృషి వరి, జొన్న, కంది మరియు విజ్ఞాన కేంద్రం, పాలెం | వరి, జొన్న, కంది మరియు ఆముదం | 9705069580 |
| 4. | వ్యవసాయ పరిశోధన కేంద్రం మరియు కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్ | వరి | 9492396001 |
| 5. | వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూర్ | కంది, జొన్న, కుసుమ | 9885040499 |
| 6. | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ | వరి, కంది, పెసర | 9010756465 |
| 7. | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర | వరి, పెసర, మినుము | 9652204006 |
| 8 | కృషి విజ్ఞాన కేంద్రం, వైరా | వరి | 9652204006 |
| 9. | వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాల | వరి | 9849822270 |
| 10. | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల | వరి, నువ్వులు | 9701592326 |



# ప్రత్తి గులాబి రంగు పురుగు నివారణకు చేపట్టవలసిన ముందస్తు చర్యలు

డా॥ యస్. ఓం ప్రకాశ్, డా॥ జి. వీరన్న, అశ్విని, డా॥ ప్రశాంత్
మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్

మన తెలంగాణ రాష్ట్రంలో ప్రత్తి పంటను ప్రధాన వాణిజ్య పంటగా సాగు చేయడం జరుగుతుంది. గత సంవత్సరం 2024-25 ప్రత్తిని దాదాపు 44 లక్షల ఎకరాలలో సాగు చేయడం జరిగింది. నల్గొండ, ఆదిలాబాద్, సంగారెడ్డి, ఆసిఫాబాద్, వికారాబాద్ మరియు వరంగల్ జిల్లాలలో ప్రత్తి అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న ప్రత్తి అంతాకూడా బిటి ప్రత్తి. అయితే ఈ బిటి ప్రత్తిని 2015 సంవత్సరం నుండి గులాబిరంగు కాయ తొలిచే పురుగు ఆశించి నష్టాన్ని కలుగజేస్తున్నది. ఈ పురుగు యొక్క ఉధృతి ప్రతీ సంవత్సరం పెరుగుతూ ఉంది. అంతేకాకుండా ఈ పురుగును తట్టుకునే హైబ్రిడ్స్ కూడా అందుబాటులో లేవు. ఈ పురుగు ఆశించడం వలన దాదాపు 50% వరకు దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. అందువలన సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడమే కాకుండా ప్రత్తి వేసే ముందు కొన్ని ముందస్తు చర్యలు చేపట్టడం వలన గులాబి రంగు పురుగు వలన కలిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

**గులాబిరంగు పురుగు ఉధృతి పెరగడానికి గల కారణాలు:**

- ప్రత్తిలో రెప్యూజి పంట వేయకపోవడం
- పంటకాలాన్ని పొడిగించడం
- పంట మోళ్ళను ఆలస్యంగా తీసివేయడం
- పంట మోళ్ళను ఇంటి దగ్గర నిల్వ చేయడం

కొన్ని ముందస్తు చర్యలు పంట వేయడానికి ముందు పాటించినట్లైతే ప్రత్తిలో గులాబిరంగు పురుగు వలన కలిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

1. గులాబి రంగు పురుగు ఆశించిన ప్రత్తిని జిన్నింగ్ మిల్లుల వద్ద మరియు రైతులు ఇంటి దగ్గర నిల్వ ఉంచకూడదు.
2. జిన్నింగ్ మిల్లుల దగ్గర లింగాకర్షక బుట్టలు మరియు దీపపు ఎరలు అమర్చి పురుగు ఉధృతిని తగ్గించుకోవాలి.
3. ప్రత్తి తీసిన తరువాత ఎండిన మోళ్ళను, విచ్చుకొని కాయలను పొలం ప్రక్కనే ఉంచరాదు.
4. ప్రత్తి కట్టెను రోటవేటర్ లేదా ష్రెడ్డర్‌తో భూమిలో కలియదున్నాలి. దీని వలన నేలకు పోషకాలు అందటమే కాకుండా పురుగు యొక్క కోశస్థ దశలు నాశనం అవుతాయి.
5. రైతు సోదరులు తమ ప్రాంతానికి అనువైన స్వల్పకాలిక మరియు మధ్యకాలిక వంగడాలను ఎన్నుకొని సాగు చేసుకోవాలి.
6. రైతులు తమ ప్రాంతము అంతా ఒకేసారి విత్తుకొనే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి.
7. తుత్తురు బెండ, బెండ లాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
8. ప్రత్తి పంటను సాధ్యమైనంత వరకు జూన్ మాసంలో విత్తుకోవాలి.
9. బిటి ప్రత్తిని సాగు చేసేటప్పుడు 2-3 వరుసల నాన్ బిటిని సాగుచేసుకోవాలి.
10. పంట మొలకెత్తిన తరువాత పంట తొలిదశలో లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

ఈ విధంగా రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించి ప్రత్తిలో గులాబిరంగు పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9866373563



# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2025-26 సంవత్సరం వానాకాలంలో సాగుచేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంటకోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 7 నుండి 23 సంవత్సరాల నెలవారి మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2025-26 వానాకాలం పంటకోత సమయంలో ధర ఏ విధముగా ఉండునో అంచనా వేయడం జరిగింది. దానిని అనుసరించి:

| క.సం. | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి.) |
|---|---|---|---|---|
| 1. | వరి (సాధారణం) | సూర్యాపేట్ | నవంబర్-డిసెంబర్ | 2280-2550 |
| 2. | వరి (గ్రేడ్ ఏ) | జమ్మికుంట | నవంబర్-డిసెంబర్ | 2410-2800 |
| 3. | మొక్కజొన్న | బాదేపల్లి | అక్టోబర్-నవంబర్ | 2310-2560 |
| 4. | జొన్న | మహబూబ్‌నగర్ | సెప్టెంబర్-అక్టోబర్ | 1950-2250 |
| 5. | సజ్జ | నిజామాబాద్ | సెప్టెంబర్-అక్టోబర్ | 2170-2450 |
| 6. | రాగి | మహబూబ్‌నగర్ | అక్టోబర్-నవంబర్ | 2810-3450 |
| 7. | పెసర | సూర్యాపేట్ | సెప్టెంబర్-అక్టోబర్ | 6800-7200 |
| 8. | కంది | తాండూర్ | జనవరి-ఫిబ్రవరి | 6900-7200 |
| 9. | మినుములు | తాండూర్ | సెపెంబర్-అక్టోబర్ | 7320-7650 |
| 10. | వేరుశనగ | గద్వాల్ | అక్టోబర్-డిసెంబర్ | 6000-6300 |
| 11. | సోయాచిక్కుడు | నిజామాబాద్ | సెప్టెంబర్-అక్టోబర్ | 4350-4600 |
| 12. | ప్రొద్దుతిరుగుడు | సిద్దిపేట్ | అక్టోబర్-నవంబర్ | 4000-4300 |
| 13. | ఆముదం | గద్వాల్ | డిసెంబర్-జనవరి | 5500-5700 |
| 14. | ప్రత్తి | వరంగల్ | నవంబర్-ఫిబ్రవరి | 6800-7200 |
| 15. | మిరప | ఖమ్మం | జనవరి-మార్చి | 14000-16500 |
| 16. | పసుపు | నిజామాబాద్ | ఫిబ్రవరి-ఏప్రిల్ | 11900-12300 |
| 17. | టమాటా | బోయినపల్లి | ఆగష్టు-సెప్టెంబర్ | 1000-1200 |
| 18. | వంకాయ | బోయినపల్లి | ఆగష్టు-అక్టోబర్ | 1670-1840 |
| 19. | బెండ | బోయినపల్లి | ఆగష్టు-అక్టోబర్ | 1600-1800 |
| 20. | బత్తాయి | గడ్డిఅన్నారం | మార్చి-ఏప్రిల్ | 3100-3400 |
| 21. | జామ | గడ్డిఅన్నారం | నవంబర్-జనవరి | 1950-2350 |

**గమనిక :** గత 20 సంవత్సరాల ధరలను విశ్లేషించి పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును, కావున భవిష్యత్‌లో పంటల ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు. మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtau@gmail.com వెబ్ సైట్ : https://pjtau.edu.in/agri-marketing-intelligence.html

# సేంద్రీయ విధానాల్లో కీటకాల నియంత్రణ

లోక మౌనిక మరియు యల్లపు రామ్మోహన్
ఐ.ఏ.ఆర్.ఐ- సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్, హైదరాబాద్,





కీటకాలు పంటలకు నష్టం కలిగించి దిగుబడిని తగ్గిస్తాయి. వీటి నియంత్రణ కొరకు రసాయనిక పురుగు మందులు వాడినచో ఆరోగ్యానికి మరియు పర్యావరణానికి హాని కలిగిస్తాయి. అందువలన సేంద్రీయ విధానాలలో పురుగుల నియంత్రణ అనేది వ్యవసాయ ప్రక్రియల్లో ముఖ్యమైన మరియు ఖర్చు తక్కువతో కూడిన మార్గం. ఈ విధానంలో రసాయనాలను ఉపయోగించకుండా, సహజమైన పద్ధతులు మరియు పదార్థాలను ఉపయోగించి పర్యావరణానికి హానికరం కాని మార్గాల్లో కీటకాలను నియంత్రించవచ్చును. ఈ విధానం పంటలను రక్షించడమే కాకుండా, నేల ఆరోగ్యాన్ని, జీవ వైవిధ్యాన్ని, మరియు మానవ ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడుతుంది.

**క్రింద పేర్కొన్న కొన్ని సమర్థవంతమైన నియంత్రణ విధానాలను వివిధ పంటలపై అనుసరించవచ్చు:**

### 1. రసాయన రహిత పురుగు నియంత్రణ పద్ధతులు

#### ఏ) పంట మార్పిడి

పంట మార్పిడి అనేది పురుగులను నియంత్రించడానికి చాలా సమర్థవంతమైన పద్ధతిగా చెప్పవచ్చు. కొన్ని పురుగులు ప్రత్యేకమైన పంటలను మాత్రమే ఇష్టపడతాయి, కనుక పంటలను సీజనల్‌గా మార్పిడి చేస్తే, ఆ పురుగుల ఆహార మూలం పోతుంది, తద్వారా అవి పంటలపై ప్రభావం చూపడాన్ని నిరోధిస్తుంది. వరి పంట తర్వాత పప్పు లేదా మినుములు నాటడం. ఈ విధానం ప్రత్యేకంగా పేనుబంక, గొంగళి పురుగులు వంటి కీటకాలను నిరోధించడానికి సహాయపడుతుంది.

#### బి) సహజ సహచర మొక్కలు

పురుగులను తరిమేందుకు సహజ సహచర మొక్కలు చాలా ఉపయోగకరమైనవి. ఇవి కొన్ని మొక్కలు సహజంగా ఉత్పత్తి చేసే రసాయనాల ద్వారా పురుగులను భయపెడతాయి లేదా హానికర కీటకాలను ఆకర్షించుకుంటాయి. టమాటా పంటలో బంతి మొక్కలను కలిపి నాటడం ద్వారా నులిపురుగులు మరియు పేనుబంక నియంత్రించవచ్చు. తులసి మొక్కలు మిరప పంటలతో కలిపి నాటడం ద్వారా పేనుబంక మరియు మిడతలు నియంత్రించవచ్చు. వెల్లుల్లి మరియు ఉల్లిపాయలు గులాబీ పంటలో నాటడం ద్వారా గొంగళి పురుగులు, పెంకు లద్దె పురుగులు మరియు తెల్లదోమ వంటి కీటకాలు నియంత్రించవచ్చు.

### సి) ఉచ్చులు మరియు అవరోధాలు/సరిహద్దు మొక్కలు

పసుపు జిగురు అట్టలు తెల్లదోమ మరియు పేనుపంక పురుగులను ఆకర్షించేందుకు ఉపయోగపడతాయి. నీలం మరియు తెలుపు జిగురు అట్టలు తామర పురుగులను పట్టుకోవడంలో సహాయపడతాయి. కాంతి ఉచ్చులు పండ్ల రసం పీల్చే రెక్కల పురుగులను ఆకర్షించి, అవి పంటలకు హాని కలిగించకుండా నియంత్రిస్తాయి. అలాగే, ఎగురుతున్న పురుగుల నుండి పంటలను రక్షించేందుకు సరిహద్దు మొక్కలు నాటడం ప్రయోజనకరంగా ఉంటుంది. పండ్ల తోటలను పక్షులు మరియు రసం పీల్చు పురుగుల ప్రభావం నుండి కాపాడటానికి వలలను ఉపయోగించవచ్చు.

### డి) మల్చింగ్

మల్చింగ్ అనేది మట్టిపై ఒక సహజ పదార్థాన్ని (గడ్డి, ఆకులు, చెక్క ముక్కలు) పరచడం ద్వారా, నేలపై తేమను కాపాడుతుంది మరియు పురుగులు గుడ్లు పెట్టడానికి అనుకూలమైన పరిస్థితులను క్రమంగా తగ్గిస్తుంది. దాంతో పొడివాతవర్ణంలో పెరిగే నల్లి మరియు చెదలు పురుగులను తగ్గించవచ్చు.

## 2. సహజ శత్రువుల ద్వారా పురుగుల నియంత్రణ

ప్రకృతిలో, అనేక జంతువులు, పక్షులు మరియు కీటకాలు హానికరమైన పురుగులను ఆహారంగా తీసుకుంటాయి మరియు సహజ శత్రువులుగా పనిచేస్తాయి. పేనుబంక మరియు పిండినల్లిని తినే సహజ శత్రువులు, వీటిని ఆకర్షించేందుకు సోంపు, వాము, బంతి మొక్కలను నాటవచ్చు. పరాన్న జీవ కందిరీగలు పురుగుల లోపల గుడ్లుపెట్టి వాటిని నాశనం చేస్తాయి. వీటిని ఆకర్షించేందుకు క్యారెట్, ధనియాలు వంటి మొక్కలు ఉపయోగపడతాయి. గొల్ల బామలు మిడతలు, ఈగలు, చీడ పురుగులను తినిపోతాయి. పక్షులు సహజ శత్రువులుగా వ్యవహరిస్తూ, మిడతలు, గొంగళి పురుగులు, దోమలను తినిపిస్తూ కీటకాల నియంత్రణలో సహాయపడతాయి.

## 3. చీడ పురుగుల నియంత్రణ ద్రావణాలు మరియు పదార్థాలు

ఏ) వేప నూనె అనేది ఒక శక్తివంతమైన సహజ పురుగుమందుగా ఉపయోగపడుతుంది. వేప నూనె పురుగుల జీవచక్రాన్ని అడ్డుకుంటుంది. 2 టీస్పూన్ల వేప నూనె మరియు 1 టీస్పూన్ లిక్విడ్ సోప్‌ను 1 లీటరు నీటితో మొక్కలపై పిచికారీ చేయాలి. ఇది పేనుబంక, గొంగళి పురుగులు, మరియు నల్లిపురుగులు వంటి కీటకాలను సమర్థవంతంగా నియంత్రిస్తుంది.

బి) వెల్లుల్లి మరియు మిరప ద్రావణం సహజంగా పురుగులను నియంత్రిస్తుంది. 10 వెల్లుల్లి గడ్డలు మరియు 5 మిరపకాయలను 1 లీటరు నీటితో కలిపి గ్రైండ్ చేసి మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా పేనుబంక, తెల్లదోమ మరియు గొంగళి పురుగులను నియంత్రించవచ్చు.

సి) సబ్బు నీరు పోషకాహారాన్ని అందించకుండా, పురుగులను ఊపిరాడకుండా చేసి వాటిని చంపుతుంది. 1 చెంచా ద్రవ సబ్బు, 1 లీటరు నీటితో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

డి) వెనిగర్ మరియు బేకింగ్ సోడా ద్రావణం చీమలు మరియు స్లగ్స్/నత్తలు వంటి పురుగులను తరిమేందుకు ఉపయోగపడుతుంది. 1 భాగం వెనిగర్ లేదా బేకింగ్ సోడా, 3 భాగాలు నీటితో మరియు కొన్ని చుక్కల డిష్ సోప్ కలిపి పిచికారీ చేయాలి.

ఈ) డయాటోమేషియస్ ఎర్త్ పొడి పురుగు శరీరం నుంచి నీటిని నిర్జలీకరించి చంపుతుంది. నత్తలు, చీమలు మరియు పెంకు పురుగులను నియంత్రించడానికి మొక్కల మొదళ్ళ చుట్టూ ఫుడ్-గ్రేడ్ డయాటోమేషియస్ ఎర్త్‌ను వాడవచ్చును.

## 4. సూక్ష్మజీవ క్రిమిసంహారకాలు

సూక్ష్మజీవి పురుగుమందులు సహజమైన బాక్టీరియా మరియు ఫంగస్ నుండి తయారవుతాయి. ఇవి నిర్దిష్ట పురుగులను నియంత్రించడంలో సహాయపడతాయి. బాసిల్లస్ తురింజెన్సిస్ లద్దె పురుగులు, గొంగళి పురుగులను నియంత్రించగా, బవేరియా బస్సియానా తెల్లదోమలు, తామర పురుగులను మరియు మెటార్హిజియం అనిసోప్లియే ముఖ్యంగా మిడతలు, గొంగళి పురుగులు మరియు ఇతర కీటకాలను నియంత్రించేందుకు ప్రభావవంతంగా పనిచేస్తుంది.

## 5. లింగాకర్షణ బుట్టలు (ఫెరోమోన్ ట్రాప్స్)

ఫెరోమోన్ ట్రాప్స్ పురుగుల ప్రేరేపక రసాయనాల అనుకృత రూపాలను ఉపయోగించి వాటి పరిణితి చక్రాన్ని అడ్డుకుని, పురుగు సంఖ్యను తగ్గిస్తాయి. ఇవి ముఖ్యంగా పండ్ల తోటలు, ద్రాక్ష తోటలు, కూరగాయల పొలాల్లో ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఉదాహరణకు, నిమ్మ పండ్ల తోటల్లో పండు ఈగల ట్రాప్స్, టమాటా పొలాల్లో టమాటా పిన్‌వార్మ్ ట్రాప్స్ వాడుతున్నారు.

సేంద్రీయ పురుగు నియంత్రణ, వ్యవసాయానికి మరియు పర్యావరణానికి లాభదాయకం. ఇది రసాయనాల ప్రభావాన్ని తగ్గించి, పంట దిగుబడిని పెంచుతూ ఆరోగ్యకరమైన వరినరాలను అందిస్తుంది. సేంద్రీయ విధానాలను అనుసరించడం ద్వారా మన భవిష్యత్‌ను పచ్చగా, ఆరోగ్యంగా, స్థిరంగా మార్చుకోవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9908869115

# రైతు విజయానికి మొదటి మెట్టు - మంచి విత్తనం ఎంపిక

జి. రాకేష్, బి. మంజు భార్గవి, డా॥ ఏ. కృష్ణ చైతన్య, ఎం. సాయిచరణ్ ఏ. దినేష్, డా॥ రమ్యరాథోడ్,
సౌందర్య మరియు డా॥ టి. అంజయ్య
ప్రాంతీయ చెరుకు మరియు వరి పరిశోధన స్థానం రుద్రూర్, నిజామాబాద్



రైతుల ఆదాయాన్ని మెరుగుపర్చడంలో అధిక దిగుబడులు కీలకపాత్ర పోషిస్తాయి. ఈ లక్ష్యాన్ని సాధించడంలో విత్తనం ఎంపిక ముఖ్యమైన మొదటిమెట్టుగా చెప్పవచ్చు. విత్తనం మంచి రకమైనదై ఉండడమే కాకుండా, అది శుద్ధత, మొలకశాతం, తేమశాతం వంటి ప్రధాన ప్రమాణాలను కూడా అనుసరించాలి. పరిశ్రమలు మరియు ప్రభుత్వ వ్యవసాయశాఖలు సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న నాణ్యమైన విత్తనాల వాడకంవల్ల పంట దిగుబడిపై 25-30% వరకు ప్రభావం చూపుతుంది. పైగా, శుద్ధత, మొలకశాతం, కలుపుగింజలు, వ్యాధులు లేకపోవడం వంటి అంశాలు పంట ఆరోగ్యాన్ని నిర్ధారిస్తాయి. తక్కువ నాణ్యతగల విత్తనాలు రైతులను ఆర్థికంగా వెనక్కి నెట్టే ప్రమాదం కలిగిస్తాయి. అందువల్ల, విత్తన ఎంపికలో శాస్త్రీయ విజ్ఞానం ఆధారంగా, నేలకు అనుగుణంగా, స్థానిక వాతావరణ పరిస్థితులకు తగిన రకాలను ఎంచుకోవడం ద్వారా రైతులు ఎక్కువ దిగుబడులు, అధిక లాభాలను పొంద గలుగుతారు.

## విత్తన కొనుగోలు - రైతు తప్పనిసరిగా గమనించవలసిన అంశాలు

### 1. నాణ్యమైన విత్తనాల ఎంపిక

- వ్యవసాయ విశ్వవిద్యాలయాలు లేదా గుర్తింపు పొందిన పరిశోధనా సంస్థల ద్వారా విడుదలైన రకాల విత్తనాలనే ఎంపిక చేయాలి.
- అవి విస్తృతంగా సాగులో ఉండాలి, పంటలకు అనువైన వాతావరణంలో పరీక్షించబడినవిగా ఉండాలి.

### 2. మొలక శాతం

- విత్తనానికి నిర్దేశిత స్థాయి కన్నా తక్కువ మొలకశాతం ఉండకూడదు.

ఉదాహరణకు:

- అధిక మొలక శాతం వలన సమానమైన మొక్కల పెరుగుదల, తద్వారా సమష్టిగా మంచి దిగుబడి వస్తుంది.
- తెలంగాణలో ముఖ్య పంటలలో మొలకశాతం

| పంటపేరు | మొలకశాతం (%) |
|---|---|
| వరి | 80% |
| మొక్కజొన్న | 90% |
| జొన్న | 75% |
| పెసలు | 75% |
| మినుములు | 70% |
| కందిపప్పు | 80% |
| ఇతరపప్పు పంటలు | 70%-80% |

### 3. భౌతిక స్వచ్ఛత

- విత్తనాల్లో తాలు గింజలు, ఇతర పంట గింజలు, మురికిగా ఉన్న పదార్థాలు లేకుండా ఉండాలి.
- కనీసం 98% భౌతిక స్వచ్ఛత కలిగి ఉండే విత్తనాలు తీసుకోవాలి.

### 4. తేమశాతం

- నిల్వ సామర్థ్యం కోసం విత్తన తేమశాతం 8-10% లోపు ఉండాలి. (పంటలకు అనుగుణంగా)
- అధిక తేమ విత్తనాల్లో ఫంగస్, చీడలు ఆశించే ప్రమాదం ఉంటుంది.

**5. కలుపు విత్తనాలు లేకుండా చూసుకోవాలి**

- కలుపు మొక్కల గింజలు విత్తనంలో ఉంటే పొలంలో విస్తరిస్తాయి. ఇది దిగుబడికి, యాజమాన్యానికి సమస్యలు తెస్తుంది. కాబట్టి, శుద్ధమైన విత్తనాలను ఎంచుకోవాలి.

**6. వ్యాధులరహిత విత్తనాలు**

- విత్తన జనిత వ్యాధులు (చిత్తు, చుండె, గడ్డి మొదలైనవి) వ్యాప్తి చెందకుండా ఉండాలంటే పరిశుభ్రత కలిగిన, ధృవీకరించిన విత్తనాలు మాత్రమే వాడాలి.

**7. గుర్తింపు పొందిన లైసెన్సు డీలర్ల నుంచే కొనండి**

- వ్యవసాయశాఖ ద్వారా లైసెన్సు కలిగిన డీలర్లు లేదా గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనం కొనాలి.
- ఊర్లో తిరుగుతూ విక్రయించే, పరిచయంలేని వ్యక్తుల నుండి కొనరాదు.

**8. రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి**

- కొనుగోలు చేసిన వెంటనే విక్రయదారుని సంతకం ఉన్న రసీదు సుకోవాలి.
- సమస్య వచ్చినప్పుడు రసీదు ఆధారంగా చర్యలు తీసుకోవచ్చు.

**9. ప్యాకింగ్ వివరాలు పరిశీలించాలి**

- విత్తన సంచిపై ఉన్న:
    - రకం పేరు, లాట్ నెంబర్, గడువు తేది
    - లేబుల్ ట్యాగ్ (నీలి లేదా తెల్ల), హాలోగ్రామ్ పరిశీలించి సరైనదైతేనే కొనాలి.

**10. మొలకశాతం, స్వచ్ఛత, తేమశాతం పరిశీలించండి**

- లేబుల్ మీద కనీస మొలక శాతం, జన్యు స్వచ్ఛత, గరిష్ఠ తేమ శాతం వంటి వివరాలు తప్పనిసరిగా చూడాలి.

**11. ప్యాకింగ్ మరియు నిల్వ పద్ధతి**

- సీల్ చెక్కు లేకుండా గట్టిగా ఉండాలి.
- చిరిగిన, తడిచిన, తెరిచి మళ్లీ కుట్టినట్టున్న సంచులు కొనకూడదు.
- ఎరువులు, పురుగుమందులు, తేమ గల ప్రాంతాల దగ్గర నిల్వ చేసిన విత్తనాలను కొనవద్దు.

**12. ప్రభుత్వం అనుమతించని విత్తనాలు తీసుకోకూడదు**

- గుర్తింపు పొందిన కంపెనీలు మరియు ప్రభుత్వ ఏజెన్సీల నుంచి మాత్రమే విత్తనం కొనుగోలు చేయాలి.
- ప్రభుత్వ విత్తన మేళాలు, రైతు సేవా కేంద్రాలు నమ్మదగిన వనరులు.

రైతులు పై సూచనలను గమనించి, నాణ్యమైన విత్తనాన్ని సరైన స్థలంలో, సరైన సమయంలో కొనుగోలు చేస్తే అధిక దిగుబడులు సాధించడమే కాకుండా, పెట్టుబడులపై రాబడి కూడా గణనీయంగా పెరుగుతుంది. నకిలీ విత్తనాల బారిన పడకుండా, శాస్త్రీయమైన దృక్పథంతో విత్తన ఎంపిక చేయడం ద్వారా పంట విజయం రైతు విజయంగా మారుతుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.8501059411

**పి.జె.టి.ఎ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 04.06.2025 | అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు |
| | ఆర్థిక వ్యవస్థలను పున:నిర్మించడంలో మహిళ పారిశ్రామికవేత్తల పాత్ర |
| 11.06.2025 | నేరుగా విత్తే వరి సాగు పద్ధతి |
| | కౌమరదశలో సాధరణ ఆరోగ్య సమస్యలు మరియు ఒత్తిడి నిర్వహణ |
| 18.06.2025 | పుట్టుగోడుగుల పెంపకం |
| | సోయా యొక్క పోషక ప్రయోజనాలు మరియు విలువ ఆధారిత ఉత్పత్తులు |
| 25.06.2025 | మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ |
| | విద్యపై సాంకేతికత ప్రభావం |

# పంట మార్పిడి పాటించండి - సుస్థిర ఆదాయాన్ని పొందండి

డా॥ ఇ. రజనీకాంత్, డా॥ ఎన్. సాయినాథ్, డా॥ కె. స్వాతి, బి. శ్రీ లక్ష్మీ, డా॥ ఎన్. బలరామ్ మరియు డా॥ డి. శ్రీలత
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పొలాస, జగిత్యాల



పంట వైవిధ్యీకరణ అనేది రైతులు ఒకే తరహా పంటలు పెంచడం కాకుండా, వేరే వేరే రకాల పంటలను సాగుచేయడం అనగా ప్రస్తుతం పాటిస్తున్న పంట సరళిలో అధిక పోషక విలువలు, అధిక దిగుబడి మరియు నేల సారాన్ని పెంపొందించే పంటలను చేర్చడం. పంట వైవిధ్యీకరణను అనుసరించడం వలన పంట సరళిలో ఉత్తమమైన మార్పులు రావటంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా చేకూరుతుంది.

**పంటల వైవిధ్యీకరణ ముఖ్య లక్ష్యాలు:**

- పంటల ఉత్పాదకతను మరియు నేల నాణ్యతను మెరుగుపరచడం.
- వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను అభివృద్ధి చేయడం.
- విభిన్నమైన మార్కెట్ అవకాశాలు పొందడం.
- ఆహార భద్రత పెంపొందించడం.
- తెగులు మరియు పురుగుల ఉధృతి తగ్గించడం..
- రబీ, ఖరీఫ్ కాలాల్లో వేర్వేరు పంటలు సాగు చేయడం.
- మిశ్రమ పంటల సాగు పద్ధతిని అనుసరించడం.
- వాణిజ్య పంటలతో పాటు ఆహార పంటలు కూడా సాగు చేయడం.

**ప్రయోజనాలు:**

- నేల మరియు సారవంతం మెరుగుపడుతుంది.
- కొత్త కొత్త పంటలను సాగు చేయడంద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుంది.
- విభిన్న ఆహార ఉత్పత్తులు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చు.
- పంట మార్పిడి ద్వారా వివిధ రకాల పురుగులు తెగుళ్ళు నియంత్రించబడతాయి.
- నీటి వనరులను సమర్థవంతంగా వినియోగం
- వాతావరణ మార్పుల ప్రభావానికి తట్టుకోగలగడం.

**వరికి ప్రత్యామ్నాయ పంటలు:**

**ధాన్యపు పంటలు & ఇతరులు:**

**మొక్కజొన్న:**

**మొక్కజొన్న విత్తే కాలము:** వానాకాలంలో జూన్ నుండి జూలై 15 వరకు విత్తుకోవాలి. స్వల్పకాలిక రకాలను జూలై చివరి వరకు విత్తుకోవచ్చు. యాసంగిలో అక్టోబరు నుండి నవంబరులోగా విత్తుకోవాలి. వరి మాగాణుల్లో డిసెంబర్ చివరి వరకు విత్తుకోవచ్చు.

**రకాలు:** డి.హెచ్.యం. 117, డి.హెచ్.యం. 121, కరీంనగర్ మక్క మరియు కరీంనగర్ మక్క పేలాల మరియు తీపి మొక్కజొన్న రకాలు: బి.పి.సి.హెచ్. 6 (పేలాల రకం), అంబర్ పాప్‌కార్న్ (పేలాల రకం), మాధురి (తీపి రకం) మరియు ప్రియ (తీపి రకం).

**ప్రత్తి:** ప్రత్తి పంట కాలాలు మరియు అనుకూలమైన సమయం: ప్రత్తి సాధారణంగా ఏకవార్షిక పంట. ఇది వానాకాలం సాగుకు అనుకూలమైన పంట. పంటకాలం దాదాపు ఐదు నుండి ఆరు నెలలు. దీనిని జూన్, జూలై నెలలో విత్తుకోవచ్చు. వర్షాధారంగా జూలై 20 తర్వాత విత్తితే దిగుబడులు బాగా తగ్గుతాయి. నీటి వసతి ఉన్నచోట ప్రత్తిని మే చివర లేదా జూన్ మొదటి పక్షంలో విత్తుకుంటే దిగుబడులు బాగా వస్తాయి. తొలకరిలో కనీసం 60 మి.మీ. వర్షం కురిసిన తర్వాత మంచి తేమలో ప్రత్తిని విత్తుకొంటే, భూమిలో వేడి తగ్గి, మొలక శాతం బాగుంటుంది.

రకాలు: నరసింహ (ఎన్.ఎ. 1325), శివనంది, శ్రీరామ (ఎన్.డి.ఎల్.హెచ్. 1938), ఓరుగల్లు కృష్ణ (డబ్ల్యూ.జి.హెచ్.

హెచ్. -2 హైబ్రిడ్) మరియు ఆదిలాబాద్ కపాస్ - 1 ఎ.డి.బి. 542.

**పప్పు ధాన్యాలు:**

**కంది:**

**కంది పంటకు అనుకూలమైన సమయం:**

**వానాకాలం:** జూన్15 నుండి జూలై15 వరకు(ఆగష్టు15 వరకు మొక్కల సంఖ్య పెంచి దగ్గర అచ్చులో వేసుకోవచ్చు).

**యాసంగి:** 15 సెప్టెంబర్ నుండి 15 అక్టోబర్ వరకు.

**రకాలు:** ఎల్.ఆర్.జి.41, లక్ష్మీ (ఐ.సి.పి.ఎల్ 85063), ఆశ (ఐ.సి.పి.ఎల్ 87119), మారుతి (ఐ.సి.పి.ఎల్ 8863), డబ్ల్యు.ఆర్.జి.27, పాలెం కంది (పి.ఆర్.జి.158), సూర్య (డబ్ల్యు.ఆర్.జి. 1004), వరంగల్ కంది 53 (డబ్ల్యు.ఆర్.జి. 53), ఆర్.జి.టి.-(తాండూరు తెల్ల కంది), డబ్ల్యు.ఆర్.జి.-65 (రుద్రేశ్వర), టి.డి.ఆర్.జి.-4 (హనుమ), పి.ఆర్.జి-176 (ఉజ్వల), ఐ.సి.పి.హెచ్-2740 (మన్నెంకొండ కంది),డబ్ల్యు. ఆర్.జి.ఇ.-93 (తెలంగాణ కంది), డబ్ల్యు.ఆర్.జి.ఇ.-97 (వరంగల్ కంది-1) మరియు డబ్ల్యు.ఆర్.జి.ఇ.-121(తెలంగాణ కంది-2).

**సోయాచిక్కుడు:**

**సోయాచిక్కుడు పంట కాలం మరియు అనుకూలమైన సమయం:** సోయాచిక్కుడు వానాకాలంలో పండించుటకు అనువైన పంట. దీని పంటకాలం దాదాపు నాలుగు నెలలు (110-120 రోజులు). ఈ పంటను పండించు అన్ని ప్రాంతాలలో దీనిని వానాకాలం పంటగానే వేస్తారు. మన రాష్ట్రంలో యాసంగి మరియు వేసవిలో కూడా పండించగల పంట అయినప్పటికి, దిగుబడులు చాలా తక్కువగా, గింజ నాణ్యత లేకుండా వస్తాయి కాబట్టి ఈ రెండు సీజన్లు సాగుకు అనుకూలం కాదు. వానాకాలంలో ఈ పంటను జూన్, జూలై నెలల్లో విత్తుకోవాలి. జూన్ 15 నుండి జూలై 10 లోపు విత్తుకొంటే దిగుబడులు బాగా వస్తాయి. జూలై మొదటి పక్షం తర్వాత ఈ పంటను ఏమాత్రం సాగు చేయకూడదు ఎందుకంటే దిగుబడి తగ్గడంతో పాటు తెగుళ్ళు ఎక్కువవుతాయి.

**రకాలు:** జె.యస్-335, భాసర్ (ఎ.యస్.బి-22), భీమ్ (ఎల్.ఎన్.బి-18) మరియు జె.యస్-93-05.

**పెసర, మినుములు:**

**పెసర, మినుములకు అనుకూలమైన సమయం :**

**వానాకాలం:** జూన్ 15 నుండి జూలై 15. యాసంగి : 15 సెప్టెంబర్ నుండి అక్టోబర్

**వానాకాలం వరి తర్వాత :** 15 నవంబర్ నుండి డిసెంబర్ మొదటి వారం వరకు (ఖమ్మం మరియు వరంగల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు). వేసవి : ఫిబ్రవరి నుండి మార్చి 15 వరకు. పెసర రకాలు: ఎమ్.జి.జి.-295, డబ్ల్యు.జి.జి.-37(ఏకశిల), టి.ఎమ్.-96-2, యమ్.జి.జి.-348 (భద్రాద్రి), యమ్. జి. జి.-347 (మధిర పెసర), యమ్.జి.జి.-351 (శ్రీరామ) మరియు డబ్ల్యు.జి.జి.-42 (యాదాద్రి).

**మినుము రకాలు:** యల్.బి.జి.-752, ఎల్.బి.జి.-20 (తేజ), ఎల్.బి.జి.-623 (లాం 623), డబ్ల్యు.బి.జి.-26 (వరంగల్-26), యం.బి.జి.-207 (మధిర మినుము-207), పి.యు.31, యల్.బి.జి.-787 (తులసి), టి.బి.జి.-104 మరియు జి.బి.జి.-1.

**వరి మాగాణులకు అనువైన మినుము రకాలు:** ఎల్.బి.జి.-645, ఎల్.బి.జి.-648, ఎల్.బి.జి.-709 మరియు ఎల్.బి.జి.-752.

**శనగ:**

**శనగలకు అనుకూలమైన సమయం:** అక్టోబర్ నుండి నవంబర్ మొదటి పక్షం వరకు.

**రకాలు (దేశవాళి) :** జె.జి.11, జె.ఎ.కె.ఐ. 9218, క్రాంతి (ఐ.సి.సి.వి.-37), జె.జి.-130, నంద్యాల శనగ-1 (ఎన్.బి.ఇ.జి-3), నంద్యాల శనగ -47 మరియు జె.జి.14. కాబూళీ : కె.ఎ.కె.-2, పూలే.జి. 95311 మరియు శ్వేత (ఐ.సి.సి.వి.-2).

**బొబ్బర/అలసంద:**

**బొబ్బర/అలసందకు పంటకాలం/అనువైన సమయం:** అలసందలు వర్షాధారంగావానాకాలంలో, మిగులు తేమ ఆధారంగా లేట్ వానాకాలంలో, నీటి పారుదల క్రింద యాసంగిలో మరియు వేసవిలో కూడా పండించవచ్చును.

**వానాకాలంలో జూలై:** వానాకాలంలో ఆలస్యంగా విత్తినప్పుడు సెప్టెంబర్; యాసంగిలో నీటిపారుదల క్రింద అక్టోబర్-నవంబర్‌లో విత్తుకోవచ్చు. వేసవిలో ఫిబ్రవరిలో విత్తుకోవచ్చు.రకాలు: జె.సి.-3, వి-240, సి-152 మరియు కో-4.

**తరువాయి భాగం వచ్చే సంచికలో**

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9908698043**

# నేలకు ఆరోగ్య సంజీవని ట్రైకోడెర్మా విరిడి

డా॥ ఓ. శైల, వై. సుల్తాన్, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి,
డా॥ బి. రాజశేఖర్, డా॥ ఆదిశంకర్, కె. రామకృష్ణ,
ఆర్. రఘువరణ్ సింగ్, ఎమ్. రాజేష్ కుమార్,
బి. హరీష్ మరియు వి. పుష్పలత
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్‌కర్నూల్



తెలుగు రాష్ట్రాలలో రైతులు ఎక్కువగా పంటల సాగులో ఎదుర్కొనే సమస్యల్లో భూమి ద్వారా వ్యాపించే తెగుళ్ళు ప్రముఖమైనవి. ముఖ్యంగా వేరుకుళ్ళు, నారుకుళ్ళు, పూతకుళ్ళు ఎండుతెగులు వంటి వ్యాధులు మొక్కల పెరుగుదలపై తీవ్రమైన ప్రభావితం చూపుతాయి. ఈ సమస్యలను నివారించేందుకు చాలా మంది రైతులు రసాయన శిలీంధ్రనాశకాలను అధికంగా ఉపయోగిస్తుంటారు. అయితే దీని కారణంగా మట్టిలోని సహజ సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతింటుంది. తెగుళ్ళు తక్కువ సమయంలో కొత్త రూపంలో ప్రబలవచ్చు.

వ్యాధికారక శిలీంధ్రాల నిరోధక శక్తి పెరిగి, రసాయన మందులు సమర్థవంతంగా పనిచేయకపోవచ్చు. అందుకే జీవ నియంత్రణ విధానంలో జీవ శిలీంధ్ర నాశినులను సేంద్రియ వ్యవసాయంలో అలాగే చీడపీడల ప్రభావాన్ని తగ్గించేందుకు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ట్రైకోడెర్మా విరిడె, సుడోమోనాస్, బాసిల్లస్ వంటి సూక్ష్మజీవులు అత్యధికంగా ఉపయోగించబడుతున్నాయి.

ట్రైకోడెర్మా విరిడె – సహజ శిలీంధ్రనాశిని – ట్రైకోడెర్మా విరిడే ఒక సహజ శిలీంధ్ర నాశిని మరియు మొక్కల రోగనిరోధకతను పెంచే సూక్ష్మజీవి. ఇది హానికర శిలీంధ్రాల పెరుగుదలను నిరోధించడం ద్వారా తెగుళ్ళ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. ట్రైకోడెర్మా పొడి మరియు ద్రవ రూపాల్లో అందుబాటులో ఉంటుంది.

### ట్రైకోడెర్మా పని విధానం:

- ట్రైకోడెర్మా హానికర శిలీంధ్రా వృద్ధికి అవసరమైన పోషకాలను స్వాధీనం చేసుకొని వాటి పెరుగుదలను అడ్డుకుంటుంది.
- వ్యాధికారక శిలీంధ్రా పునరుత్పత్తిని తగ్గించి, వాటి వ్యాప్తిని నిరోధిస్తుంది.
- వాతావరణ పరిస్థితులను ప్రతికూలంగా మార్చడం ద్వారా తెగుళ్ళను సమర్థవంతంగా కట్టడి చేస్తుంది.
- మొక్కల ఎదుగుదల పై అనుకూల ప్రభావాన్ని చూపిస్తూ రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- రోగనిరోధక శిలీంధ్రం కంటే వేగంగా అభివృద్ధి చెందుతూ, వాటి ప్రబలత్వాన్ని తగ్గిస్తుంది.

### ట్రైకోడెర్మా విరిడె నియంత్రించగల వ్యాధులు:

- వరి – పాముపొడ, పొట్టకుళ్ళు, గోధుమ మచ్చతెగులు
- ప్రత్తి – వేరుకుళ్ళు, నారుకుళ్ళు, ఎండుతెగులు
- మిరప – నారుకుళ్ళు, ఎండుతెగుళ్ళు
- పప్పుధాన్య పంట – వేరుకుళ్ళు
- వేరుశనగ – కాండం కాయకుళ్ళు, మొదలు కుళ్ళు, వేరుకుళ్ళు
- పసుపు – ఆకుమచ్చ, దుంపకుళ్ళు
- అరటి – పనామా, ఎండుతెగులు
- నిమ్మజాతి – బంకనారు, ఎండువేరు కుళ్ళు, గానోడెర్మా వేరుకుళ్ళు
- ప్రొద్దుతిరుగుడు – నలుపు వేరుకుళ్ళు
- ఆముదం – వేరుకుళ్ళు, కొమ్మ ఎండు తెగుళ్ళు

### ట్రైకోడెర్మాను ఉపయోగించే విధానాలు:

#### విత్తనశుద్ధి:

- పొడి రూపంలో: 1 కిలో విత్తనానికి 5–10 గ్రా. ట్రైకోడెర్మా పొడిని కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- ద్రవ రూపంలో: ట్రైకోడెర్మా ద్రావణాన్ని నీటిలో కలిపి 30 నిమిషాలు విత్తనాలను నానబెట్టి నాటాలి.
- పశువుల ఎరువుతో కలిపి వాడటం: 90 కిలోల బాగా చివికిన పశువుల ఎరువుతో 10 కిలోల వేపపిండిని కలపాలి. తరువాత 1–2 కిలోల ట్రైకోడెర్మా పొడిని చల్లి, తేమ ఉండేలా నీటిని చిలకరించాలి. 7–10 రోజుల తర్వాత పొలంలో విస్తరించాలి.

- వర్మికంపోస్ట్‌తో కలిపి వాడటం: ఒక టన్ను వర్మికంపోస్ట్‌కు 2 కిలోల ట్రైకోడెర్మా కలిపి నేలలో వేసుకోవచ్చును.
- **మొక్కల మీద స్ప్రే చేయడం:**
- 1 లీటరు నీటికి 5 గ్రా. ట్రైకోడెర్మా పొడి లేదా 10 మి.లీ. ద్రవం కలిపి మొక్కలపై స్ప్రే చేయాలి.ల
- మొక్కలు పూత దశలో ఉన్నప్పుడు లేదా తెగుళ్ళు పెరిగే అవకాశమున్నప్పుడు స్ప్రే చేయడం మంచిది.
- **బిందు సేద్యంలో:**
- ట్రైకోడెర్మా ద్రావణాన్ని నీటిలో కలిపి బిందు సేద్యంలో పంపిస్తే వేరుకుళ్ళు, నేలపూస తెగుళ్ళు తగ్గుతాయి.

**పంటలలో ట్రైకోడెర్మా వాడడం ద్వారా కలిగే లాభాలు:**

- నేల యొక్క భౌతిక లక్షణాలు వృద్ధి చెంది నేల సారవంతము వృద్ధి చెందును
- రసాయన శిలీంద్రనాశనుల వినియోగం తగ్గి నేల ఆరోగ్యం కాపాడడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.
- నేలలో ఉన్న కరగని భాస్వరాన్ని కరిగే విధంగా చేస్తుంది.
- సేంద్రియ వ్యవసాయ సాగులో తెగుళ్ళ నిర్మూలనలో కీలకపాత్ర వహిస్తుంది.
- ఇది అన్ని రకాల వాతావరణాలలో, నేలల్లో పెరిగి పర్యావరణరహితంగా మొక్కల పెరుగుదలకు తోడ్పడే మిత్ర శిలీంధ్రము.
- పంటల సాగులో దీన్ని విత్తనశుద్ధికి, నేల, వేరు వ్యవస్థలో వాడుటకు అనుకూలంగా ఉంటుంది.
- అన్ని రకాల పంటల్లో వాడుకోవచ్చును.
- తెగుళ్ళను కలుగజేసే ఇతర శిలీంధ్రాల యొక్క కవచాన్ని బలహీన పరచి కరిగించే దోహక ద్రవ్యాలను ట్రైకోడెర్మా ఉత్పత్తి చేసి తద్వారా తెగుళ్ళను వ్యాప్తి చేసే శిలీంధ్రం యొక్క కణములోకి ప్రవేశించి వాటిలోని పదార్థాన్ని ఆహారంగా భుజిస్తాయి.
- మొక్క యొక్క వేరు ఉపరితలం పైన సహనివాసం ఏర్పరచుకొని మొక్క యొక్క జీవన క్రియలకు తోడ్పడుతుంది.
- మొక్కలలో తెగులు కారక జీవుల పట్ల మొక్క శారీరక నిరోధకతను పెంపొందిస్తుంది.

**ముఖ్య గమనిక:**

- రసాయన శిలీంధ్రనాశకాలు, పురుగుమందులతో కలిపి వాడకూడదు.
- మట్టిలో తేమ 60%కి పైగా ఉంటే ట్రైకోడెర్మా ఉత్తమంగా పని చేస్తుంది.
- ఉదజని సూచిక (పిహెచ్) 6.5-7.5 మధ్య ఉంటే మంచి ఫలితాలు వస్తాయి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9951461694**

**మే 2025 మాసంలో పి.జె.టి.ఎ.యు. వారి అగ్రికల్చర్ వీడియో - యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| క్ర.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1. | 03.05.2025 | రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు |
| 2. | 08.05.2025 | అయిల్ ఫామ్‌లో అధిక దిగుబడులకు సూచనలు |
| 3. | 09.05.2025 | విత్తన నాణ్యత మరియు మొలకశాతం నిర్ధారణ పరీక్షలు - ఆవశ్యకత |
| 4 | 12.05.2025 | తక్కువ యూరియా వాడండి సాగుఖర్చును తగ్గించండి |
| 5 | 12.05.2025 | అవసరం మేరకు రసాయనాలను వినియోగించండి - నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడండి |
| 6 | 12.05.2025 | రశీదులను భద్రపరచండి - కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందండి |
| 7 | 12.05.2025 | సాగునీటిని ఆదా చేయండి - భావితరాలకు అందించండి |
| 8 | 12.05.2025 | పంట మార్పిడి పాటించండి -సుస్థిర ఆదాయాన్ని పొందండి |
| 9 | 12.05.2025 | చెట్లను పెంచండి - పర్యావరణాన్ని కాపాడండి |
| 10 | 12.05.2025 | రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు ఉపకులపతి సందేశం |
| 11 | 12.05.2025 | రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు ప్రణాళిక వివరణ |
| 12 | 20.05.2025 | పి.జె.టి.ఎ.యు. యు.జి. అడ్మిషన్స్ - 2025 |
| 13 | 23.05.2025 | వానాకాలం ప్రత్తి పంట సూచనలు |
| 14 | 24.05.2025 | వ్యవసాయంలో జీవన ఎరువుల వాడకం - ప్రాముఖ్యత |
| 15 | 29.05.2025 | నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం - విత్తు కొద్ది పంట |



# వర్షాధారిత ప్రాంతాలలో నేల మరియు నీటి సంరక్షణా పద్ధతులు

డా॥ పి. రేవతి మరియు ఎస్.ఎం.ఎస్. రమ్య
అగ్రానమి విభాగం, పిజెటిఎయు, రాజేంద్రనగర్

వాతావరణ మార్పు వలన భారతదేశంలోని వర్షాధారిత ప్రాంతాలలో వర్షపు రోజులు తగ్గుతున్నాయి. వర్షపు తీవ్రత పెరగటం వలన వర్షపు నీరు వృధాగా పోతుంది, నేల క్షయానికి గురికాబడి నిస్సారమవుతుంది. వర్షధారిత ప్రాంతాలలో భూగర్భ జలాల క్షీణత, కరువు మరియు వరదలు రైతులకి నష్టాలు కలుగజేస్తున్నాయి. ఈ ప్రాంతాలలో వర్షపు నీటిని ఆధునిక పద్ధతులలో సంరక్షించుకొని అధిక దిగుబడులు పొందవచ్చును.

**నేల మరియు నీటి సంరక్షణా పద్ధతులు:** వర్షపు నీటిని పడిన చోటనే సంరక్షించుకునే పద్ధతులు వేసవి కాలంలో పొలాన్ని దున్నుట, కాంటూర్ సేద్యం, కాంటూర్ కట్టలు, గడ్డి ఫిల్టర్లు, కన్సర్వేషన్ ఫర్రో (సంరక్షణ కాలువ), బ్రాడ్ బెడ్ మరియు ఫర్రో పద్ధతులు నీటిని భూమిలోనికి ఇంకేటట్లు మురియు భూమి యొక్క సహజ లక్షణాలని పెంచి మొక్కకు అందుబాటులో, తేమ నిల్వ ఉండేటట్లు నేలను తయారు చేస్తాయి. ఈ పద్ధతుల ద్వారా నీటిని భూమిలో నిల్వ చేసుకొనుట అతి తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చును. కనుక చిన్న, సన్నకారు రైతులు కూడా అనుసరించవచ్చును. దేశంలోని అన్ని ప్రాంతాలలో ఈ పద్ధతుల ద్వారా సహజ వనరుల సంరక్షణ మరియు అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రయోగాత్మకంగా నిరూపించబడ్డాయి.

**1. వేసవి కాలంలో పొలాన్ని దున్నుట:** వేసవిలో, పంట కోసిన తర్వాత వచ్చు మొట్టమొదటి వర్షపు జల్లులతో నేల తడిసినప్పుడు పొలాన్ని వాలుకు అడ్డంగా దున్నుకోవాలి. ఈ విధంగా చేసినట్లయితే పొలములోని మట్టి, చిన్న వాలుగట్లుగా ఏర్పడి వర్షపు తీవ్రత తగ్గించి భూమిలోనికి నీటిని ఎక్కువగా ఇంకునట్లు చేయును. పొలంలోని కలుపు మొక్కలు భూమిలో కుళ్ళి సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుంది.

**2. కాంటూర్ సేద్యం:** వాలుకు అడ్డంగా దున్ని విత్తనం వేయడం, అంతరకృషి చేయడం మరియు ఇతర పొలం పనులను కాంటూరు పద్ధతి ద్వారా చేయటం మంచిది. ఇట్ల చేసినచో వర్షపు నీరు మొక్కకు బాగా అంది ఏపుగా పెరిగే అవకాశముంది.

**3. కాంటూర్ కట్టలు:** వర్షాధారిత ప్రాంతాలలో వాలుకు అడ్డంగా (సమతల పంక్తులపై) కాంటూర్ కట్ట నిర్మించుకొని వర్షపు నీటిని, నేలను, నేలలోని పోషకాలను సంరక్షించు కొనవచ్చును. ఈ పద్ధతిని అనుసరించి 40% వరకు వర్షపు నీరు, 60% మట్టి మరియు పోషకాలను సంరక్షించు కొనవచ్చును. 25% పంట దిగుబడులు పెంచుకొనవచ్చును. ఈ కాంటూర్ కట్టలను 45 నుండి 50 మీ. అంతరంలో 45 నుండి 60 సెం.మీ. ఎత్తులో నిర్మించుకోవాలి. వీటి ద్వారా పొలంలో పడిన వర్షపు నీరు మరియు మట్టి, పోషకాలు క్రిందకు కొట్టుకొని పోకుండా కాపాడవచ్చు.

**4. కాంటూర్ కందకాలు:** కాంటూర్ కందకములను వాలుకు అడ్డంగా నిర్మించుకోవటం వలన వర్షపు నీటిని ఈ కందకాలలో నిల్వ చేసుకోవచ్చు. పండ్ల తోటలు, ప్లాంటేషన్స్‌లో కాంటూర్ కందకాలు నిర్మించుకుంటే, ఈ కందకాలో వర్షపు నీరు నిల్వ అయి మొక్క వేరు భాగంలో భూమిలో తేమగా ఉంచుతాయి. దీని వల్ల మొక్కలు ఏపుగా పెరిగి మొక్కలకు రక్షణ తదులు తగ్గుతాయి. దీనితో పాటు భూమి క్షయానికి గురికాకుండా ఉంటుంది.

**5. కన్సర్వేషన్ ఫర్రో:** పంట పొలాల్లో వాలుకు అడ్డంగా ప్రతీ 5 నుండి 10 పంట వరసల మధ్య 60–75 సెం.మీ. వెడల్పు మరియు 20–30 సెం.మీ. లోతుతో వాలుకు పంట సాళ్ళలో చిన్న చిన్న నీటి సంరక్షణ కాలువలు (కన్సర్వేషన్ ఫర్రో) నిర్మించుకోవాలి. వీటివల్ల 44% నేల కోతని తగ్గించవచ్చును. ఈ పద్ధతి అనుసరించి 30% అధిక పంట దిగుడబడులు పొందవచ్చును.

**6. బ్రాడ్ బెడ్ మరియు ఫర్రో పద్ధతి:** నల్ల రేగడి భూములలో వెడల్పైన బెడ్ మరియు కాలువలను ప్లాంటార్ ద్వారా నిర్మించుకోవాలి. బెడ్ వెడల్పు 90–120 సెం.మీ. మరియు కాలువ వెడల్పు 50 మరియు లోతు 45 సెం.మీ. ఉండాలి. ఈ పద్ధతి ద్వారా వర్షపు నీరు భూమి లోనికి ఇంకి ఆ నీరు వర్షాభావ పరిస్థితులలో పంటకు ఉపయోగపడుటకు దోహదపడుతుంది. అధిక వర్షపాత సమయంలో భూమి కోతకు గురి కాకుండా అధిక నీటిని పొలంలో నుంచి బయటికి పంపవచ్చును. ఇవి నిర్మించుకోవడానికి బ్రాడ్ బెడ్ ప్లాంటర్స్ అందుబాటులో ఉన్నాయి.

**7. రిడ్జ్ మరియు ఫర్రో పద్ధతి:** వర్షాధార ప్రాంతాలలో భూమి యొక్క వాలుకి అడ్డంగా ఎద్దుల సహాయంతో బోదెలు మరియు కాలువలు నిర్మించుకొనవచ్చును. కాలువ యొక్క వెడల్పు 45–60 సెం.మీ. మరియు లోతు 20–30 సెం.మీ. ఉండే విధంగా ఏర్పరచుకోవాలి. రైతు తనకు అనుగుణంగా పంటను బోదె లేక కాలువలో విత్తుకొనవచ్చును. ఈ పద్ధతి ద్వారా వర్షపు నీటిని, నేలను, నేలలోని పోషకాలను సంరక్షించు కొనవచ్చును.

**8. గడ్డి ఫిల్టర్లు:** వర్షాధారిత ప్రాంతాలలో పంట పొలంలో కాంటూర్ కట్టల వల్ల రైతు కొంత శాతం తన సాగు భూమిని

కోల్పోవుచున్నాడు. దీని వలన ఎక్కువమంది రైతులు కాంటూర్ కట్టలు నిర్మించుకోవటానికి విముఖత చూపుతున్నారు, అట్టి ప్రాంతాలలో గడ్డి ఫిల్టర్ల ప్రత్యామ్నాయ పద్ధతిగా ఎంచుకొనవచ్చును. మేలైన పశుగ్రాస గడ్డి జాతి రకాలను, పారా, గినియా, నేపియర్ మరియు ఇతర రకాలను పొలాలలో 45 మీ. అంతరంలో, 1-2 మీ. వెడల్పు స్ట్రిప్‌లలో దట్టంగా నాటుకోవాలి. ఈ గడ్డి స్ట్రిప్ వర్షపునీటి వేగాన్ని తగ్గిస్తాయి, వర్షపు నీటిలోని మట్టిని మరియు పోషకాలను ఫిల్టర్ చేసి పంట పొలాలలో అవి కొట్టుకుపోకుండా కాపాడుతాయి. ఇలా నాటిన గడ్డి ఫిల్టర్లు 30-45 రోజులలో కోతకు వస్తాయి. అట్టి గడ్డిని భూమి నుండి 30 సెం. మీ. వదలి పశువులమేత కొరకు కోసుకొనవలెను. మిగిలిన భాగం ఫిల్టరుగా పని చేస్తుంది. ఈ గడ్డి ఫిల్టర్ల వల్ల 40% వర్షపు నీటిని, 65% మట్టిని మరియు 70% మట్టిలోని పోషకాలని పొలంలో నుండి కొట్టుకుపోయి వృథా కాకుండా కాపాడతాయి.

**వర్షపు నీటిని నిల్వచేసే పద్ధతులు:** వర్షాధారిత ప్రాంతాలలో అధిక వర్షపాతం వల్ల చిన్న చిన్న కాలువల ద్వారా, వాగుల ద్వారా, ప్రవహించే, వర్షపు నీటిని నీటికుంటలు, చెక్ డ్యాములు మరియు రీఛార్జి పిల్టర్ల ద్వారా నిల్వ చేసి సంరక్షించు కొనవచ్చును.

**1. నీటి కుంటలు:** వర్షాధారిత ప్రాంతంలో బెట్ట సమయాలలో పంటకు నీటి తడులు ఇచ్చి కాపాడు కొనుటకు రైతులు తమ పొలంలో అనువైన చోట నీటి కుంటలు నిర్మించు కొనవచ్చును. వర్షపాత సమయాల్లో పొలంలో ప్రవహించే నీటిని ఈ నీటి కుంటలోనికి మరలించి నీటిని నిల్వ చేసుకొనవచ్చును. 500 మైక్రాన్ మందం గల హెచ్.డి.పి.ఇ లేదా ఎల్.పి.ఇ షీట్ తో లైనింగ్ చేసుకోవాలి. ప్లాస్టిక్ లైనింగ్ చేసిన కుంటల ద్వారా పంటలకు బెట్ట సమయంలో 1 లేక 2 నీటి తడులు ఇచ్చి పంటను కాపాడుకొనవచ్చును మరియు అధికదిగుబడులు పొందవచ్చును.

**2. చెక్ డ్యాములు :** చెక్ డ్యాములను వర్షపు నీటి ప్రవాహ కాల్వలకి అడ్డంగా నిర్మించి నీటి వేగాన్ని కట్టడి చేసి, భూమి కోతకి గురికాకుండా అరికట్ట వచ్చును. వాగులకు ఎగువ భాగంలో చెక్ డ్యామ్ లను మట్టిలో, మధ్య భాగంలో రాళ్ళతో, దిగువ భాగంలో మ్యాస్పినరి లేక కాంక్రీతో నిర్మించు కొనవచ్చును. ముఖ్యంగా ఈ చెక్ డ్యామ్ ద్వారా వర్షపు నీటీని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచవచ్చును. అన్నింటికన్నా ముఖ్యంగా నిల్వచేసిన నీటిని ఉపయోగించుకొని ఖరీఫ్ మరియు రబీ పంటలను సాగు చేసుకొని అధిక దిగుబడులు పొందవచ్చును.వినూత్నమైన మరియు తక్కువ ధరలో లభ్యమయ్యే సామగ్రితో చెక్ డ్యామ్ నిర్మాణ ఖర్చు తగ్గించవచ్చును. దీని ద్వారా చిన్న, సన్నకారు రైతులు కూడా చిన్న చెక్ డ్యాములు నిర్మించుకొనవచ్చును.

**3. బావులకు అనుసంధానముగా ఇంకుడు గుంతలు (రీచార్జి ఫిల్టర్):** మట్టి, ఇసుక లేని నీటితో బావులు, బోర్లును రీచార్జి చేసేందుకు రీచార్జి ఫిల్టర్లు ఉపయోగపడతాయి. ఇందు కోసము 4 మీ. పొడవు, 3 మీ. వెడల్పు 1.5 మీ. లోతుతో బావికి దగ్గరగా ఒక గుంత తీసుకోవాలి. ఈ గుంతలో 250 మైక్రాన్సు మందంగా ఉండే ప్లాస్టిక్ షీటు పరవాలి. గుంత మధ్యలో రంధ్రాలున్న పైపు పెట్టుకోవాలి. ఈ పైపును బావికి అనుసంధానించాలి. మట్టి, ఇసుక ఈ పైపులో చేరకుండా ఉండేందుకు 2 సెం.మీ.×2 సెం.మీ. సైజులో ఒక వైరు మెష్‌ను ఈ పైపు చుట్టూ పెట్టుకోవాలి. శుభ్రమైన నీరు అడుగుకు చేరేందుకు గాను ఒక్కో వరస 30 సెం.మీ. మందంగా ఉండేట్లు మొదట 40 మి.మీ. కంకర రాయి, తర్వాత 20 మి.మీ. గంగ్ర ఇసుక ఆ తర్వాత 2 మి.మీ. పరిమాణంలో ఇసుకను పైపు చుట్టూ వేయాలి. అడుగున ఉండే కంకర సైజు 40 మి.మీ.కు మించకుండా చూసుకోవాలి దాని వల్ల సిల్పాలిన్ షీట్ చిరగకుండా ఉంటుంది. ఈ విధంగా తయారు చేసుకునేందుకు ఒక్కొక్క గుంతకు 10 వేల నుంచి 15 వేల రూపాయల దాకా ఖర్చవుతుంది. దీని వల్ల దాదాపు భూగర్భ జలాలు పెరగడంతో పాటు నాణ్యత కూడా మెరుగవుతుంది. పంటలకు నీరు అందుబాటులో ఉంటుంది. ఈ నీటి వలన పంట దిగుబడులు పెరుగుతాయి.

4. మల్చింగ్: మల్చింగ్ వలన చాలా ఉపయోగాలున్నాయి. ప్లాస్టిక్ మల్చ్‌తో పాటు, పంట వ్యర్థాలను కూడా మల్చ్‌గా ఉపయోగించవచ్చు. వేగంగా భూమిని తాకే వర్షపు నీటి చుక్కల్ని మల్చ్‌లు సమర్థంగా అడ్డుకుంటాయి. కలుపు పెరుగదు. వేసవిలో భూమి ఉష్ణోగ్రత సమతుల్యమవుతుంది. ఫలితంగా, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, పంటకు వాడిన జీవన ఎరువులు, రసాయనాలు బాగా పనిచేస్తాయి. వర్షపు నీటి కారణంగా ఏర్పడే నేలకోత వంటి సమస్యల్ని మల్చింగ్ ద్వారా సమర్థవంతంగా అరికట్టవచ్చు.

5. స్ట్రిప్ క్రాపింగ్: అధిక వాలు ఉన్న ప్రాంతాల్లో, నేల కోతలకు గురయ్యే భూములను స్ట్రిప్ క్రాపింగ్ ద్వారా నేల కోతను సమర్థంగా అరికట్టవచ్చు. ఇందుకోసము, నాలుగైదు వరుసల్లో రైతుకు నచ్చిన లేదా ఆదాయాన్ని, ఆహారాన్ని ఇచ్చే పంటలు సాగు చేయవచ్చు. ఆ తర్వాత కొన్ని వరుసల్లో నేలను గట్టిగా పట్టి ఉంచే గడ్డిజాతి మొక్కలు, వట్టివేరు, కిత్తనార వంటివి దగ్గర దగ్గరగా వేసుకోవచ్చు. ముక్కలు ముక్కలుగా అవసరమైన అన్ని పంటలతో పాటు, నేల కోతను అరికట్టే పంటలను వరుసలలో నాటుకోవడము ద్వారా సమర్థంగా భూసంరక్షణ చేసుకోవచ్చు. ఇది నేలలో తేమను సంరక్షించడమే కాకుండా, వాలులో వేగంగా వెళ్ళే నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచి కోతకు గురికాకుండా, పోషకాలు తరలిపోకుండా కాపాడుతుంది. ఈ విధంగా ప్రణాళిక ప్రకారము సాగు చేసుకుంటే, అధిక వాలు సమస్య ఉన్న భూముల్నించి కూడా ఆహార పంటలు, గడ్డి వంటివి పొందవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.9912944880**



# జూన్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు


డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**


**మామిడి:** కోతల అనంతరం చెట్లకు 15 రోజులు విశ్రాంతినివ్వాలి. తరువాత చెట్లలో తెగులు సోకిన, విరిగిన, ఎండిన కొమ్మలను కత్తిరించాలి. చెట్టు లోపల గాలి, వెలుతురు ప్రవేశానికి అడ్డుతగులుతున్న, నేలబారు కొమ్మలను కత్తిరించాలి. పూత కాడల నుండి వెనుకకు 10-15 సెం.మీ. వరకు కత్తిరించాలి. దీని వల్ల కొత్త కొమ్మలు పుట్టుకొచ్చి అవి తరువాత కాలంలో పూత, పిందెనిస్తాయి. తొలకరి వర్షాలు పడగానే అదును, పదును చూసి తోటలో వరుసగా మధ్య నేలను దున్నాలి. పాదులు చేసే మొదటి దఫా ఎరువులు 1100 గ్రా. యూరియా, 3 కిలోలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 850 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చెట్టు చుట్టూ తవ్విన గాడిలో వేసి మట్టి కప్పాలి. ఎరువులు వేసిన తరువాత నీటి తడులివ్వాలి.

**జామ:** చలికాలంలో వచ్చే పంట (మృగ్ బహర్) అధిక దిగుబడి కోసం ఈ మాసంలో చెట్లకు పాదులు చేసి ప్రతి పెద్ద చెట్టుకి 1085 గ్రా. యూరియా, 1250 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 850 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీరు కట్టాలి. పిండినల్లి నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**అరటి:** పొట్టి పచ్చ అరటి, పెద్ద పచ్చ అరటి రకాలను తొలకరి వర్షాలు పడిన తరువాత జూన్ మొదటి వారం నుండి నాటుకోవచ్చు. జంట వరుసల్లో నాటేటప్పుడు వరుసల మధ్య దూరం తక్కువగా (1.2 మీ. లేదా 1.0 మీ.) ఉండాలి. రెండు జంట వరుసల మధ్య దూరం, ఎక్కువగా (2.0 మీ. లేదా 1.8 మీ.) ఉండాలి. ముందు వరుసలోని మొక్కల మధ్య వచ్చే విధంగా నాటాలి.

**బత్తాయి, నిమ్మ:** కొత్తగా తోటలు పెట్టే రైతులు 60 సెం.మీ. పొడవు, వెడల్పు, లోతుగల గుంతలు తీసి, దానిలో 5 కిలోల పశువుల ఎరువు, 1 కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 100 గ్రా. క్లోరిపైరిఫాస్ పొడి మందులను పై మట్టికి కలిపి గుంతలను నింపుకోవాలి. నాణ్యమైన మొక్కలు నాటుకోవాలి. ఈ మాసం గజ్జి తెగులు వ్యాపించడానికి అనువుగా ఉంటుంది. కావున ఈ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 180 గ్రా. మరియు స్ట్రెప్టోసైక్లిన్ 6 గ్రా. మిశ్రమాన్ని 60 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఫైటోప్తోరా బంకతెగులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా 2.5 గ్రా. మ్యాంకోజెబ్ మందును లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** మజ్జిగ తెగులు నివారణకు ముందుగా బోర్డో మిశ్రమం (1 శాతం) తర్వాత రెండోసారి మెటలాక్సిల్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. మూడోసారి సైమోక్సానిల్ + మ్యాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి వారం వ్యవధితో పిచికారి చేయాలి.

**సపోటా:** తొలకరిలో తోటను ఇరువైపులా దుక్కిదున్ని, చెట్లకు పాదులు చేసి, పెద్ద చెట్లకు 880 గ్రా. యూరియా, 1 కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 750 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చెట్టు చుట్టూ 1.5 మీ. దూరంలో పాదంతా సమంగా వేసి, మట్టిలో కలిపి తేలికపాటి తడి ఇవ్వాలి.

**బొప్పాయి:** మొక్క మొదలు దగ్గర నీరు నిల్వకుండా చూడాలి.





బోర్డోమిశ్రమం 1 శాతంను లీటరు నీటికి చొప్పున కలిపి మొదలు తడపాలి. వారం రోజుల వ్యవధితో 2-3 సార్లు తడిపినట్లైతే కాండంకుళ్ళు రాకుండా ఉంటుంది.

**కూరగాయలు:**

**టమాట:** 21-25 రోజుల వయసు ఉండి, 3-4 ఆకులు గల నారును 60×45 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. కలుపు నివారణకు ఎకరాకు పెండిమిథాలిన్ 1.0 లీ. (తేలిక నేలలు), 1.2 లీ. (బరువు నేల) ను 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 48 గంటలలోపు తడినేలపై పిచికారి చేయాలి.

**వంగ:** వంగ నాటే ముందు ఎకరాకు 200 కిలోల వేపపిండిని దుక్కిలో వేసుకోవాలి. బ్యాక్టీరియా ఎండుతెగులు ఉండే ప్రాంతాలలో ఎకరాకు 6 కిలోలు బ్లీచింగ్ పొడిని చల్లుకోవాలి. రసంపీల్చు పురుగులు ఆశించకుండా ఎకరాకు 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను నాటే ముందు వేసుకోవాలి. 30-35 రోజుల నారుని నాటుకోవాలి. పొడవుగా, నిటారుగా పెరిగే రకాలను 60×60 సెం.మీ. గుబురుగా పెరిగే రకాలను 75×50 సెం.మీ. దూరం పాటించి నాటాలి.

**బెండ:** వర్షాకాలపు పంటను 60 సెం.మీ. ఎడంతో బోదెలమీద 30 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. సరైన సమయంలో వర్షం లేకపోతే 7-8 రోజులకొకసారి తడి ఇవ్వాలి.

**మిరప:** ఈ మాసం చివరిలో 1 మీ. వెడల్పు, 15 సెం.మీ. ఎత్తు ఉండేటట్లు ఎత్తైన నారుమడులు తయారు చేసి మధ్యలో 30 సెం.మీ. కాలువలు తీయాలి. సెంటు నారుమడిలో 650 గ్రా. విత్తనం నాటుకోవాలి. విత్తనంతోపాటు సెంటు నారుమడికి 80 గ్రా. ఫిప్రోనిల్ గుళికలను వాడినచో రసంపీల్చు పురుగులను నివారించవచ్చు.

**పందిరి కూరగాయలు:** ఈ మాసంలో ఆనప, దోస, బీర, కాకరలను 1.5-2.0 మీ. × 50-75 సెం.మీ. దూరంలో పాదులకు 2-3 విత్తనాలను 1-2 సెం.మీ. లోతులో విత్తుకోవాలి. మొక్కల 2-4 ఆకుల దశలో లీటరు నీటికి 3 గ్రా. బోరాక్స్ కలిపి ఆకులపై పిచికారి చేస్తే ఆడపూలు ఎక్కువగా పూసి పంట దిగుబడి బాగా ఉంటుంది.


**బంతి:** ఈ మాసంలో ఎకరాకు సరిపోయే 400 గ్రా. విత్తనంతో నారుపోసుకోవాలి.

**కనకాంబరం:** ఈ మాసంలో ఎకరాకు 2 కిలోల విత్తనంతో నారుపోసుకోవాలి.

**పసుపు:** ఈ మాసం మొదటి పక్షంవరకు పసుపును విత్తుకోవచ్చు. విత్తే కొమ్మల బరువు 30-40 గ్రా. విత్తే లోతు 8 సెం.మీ. ఉంటే దృఢంగా, మంచి ఎదుగుదల మొక్కలు పొందవచ్చు.

**నిమ్మగడ్డి:** నిమ్మగడ్డిని వర్షాకాలంలో పిలకల ద్వారా 60×45 సెం.మీ. దూరంలో నాటుకోవచ్చు. ఒక ఎకరా పొలంలో నాటుకోవడానికి సుమారు 15000 పిలకలు అవసరం. మొక్కలు పడిపోకుండా మొక్కల మొదళ్ళలో మట్టిని ఎగద్రోసి గట్టిగా నొక్కాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
**ఫోన్ నెం.9441168156**



# జీవాల పెంపకంలో అధిక లాభాలను సాధించడానికి శాస్త్రీయమైన చర్యలు

డా॥ జె. శశాంక్, డా॥ ఎమ్. ఫిబి రాణి, డా॥ ఎమ్.ఎల్. నమ్రత, డా॥ జె. జ్యోతి మరియు
డా॥ వి.వి.వి. అమృత్ కుమార్
పశువైద్య కళాశాల, పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, మామునూరు, వరంగల్



- జీవాల పెంపకం చేపట్టాలని అనుకున్న వాళ్లు జీవాల్ని సాంద్ర పద్ధతిలో లేదా పాక్షిక సాంద్ర పద్ధతిలో పోషిస్తే లాభాలు ఆర్జించగలుగుతారు. గొర్రెల్ని పెంచడమా లేదా మేకల్ని పెంచడమా అనేది ముందే నిర్ణయించుకోవాలి. గొర్రెలలో నెల్లూరు, దెక్కని, బళ్లారి మొదలైన జాతులు, మేకల్లో బార్బారి, బ్లాక్ బెంగాల్, ఒస్మనబాది, సిరోహి లాంటివి ఉత్తమమైనవి. జీవాల్ని దృఢంగా, ఆరోగ్యంగా పిల్లల్ని కనే శక్తి ఉండి, జాతి లక్షణాలున్న రెండు సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వాటిని కొనాలి. చూడితో నున్నవైనా ఫర్వాలేదు.
- జీవాల్ని అక్టోబర్, నవంబర్, ఫిబ్రవరి లేదా మార్చి మాసాల్లో కొనుక్కోవడం మంచిది. మండుటెండల్లో, వర్షాలు అధికంగా ఉండే అంటువ్యాధులు ప్రబలి ఉన్న సమయాల్లో కొనకూడదు. జీవాల్ని సంతలో కాకుండా, మాదల దగ్గరకి స్వయంగా వెళ్లి ఎంపిక చేసుకుంటే మంచిది. జీవాల పెంపకం ప్రారంభించే ముందు కొన్ని ఫారాలను స్వయంగా సందర్శించి పెంపకం దార్ల అనుభవాన్ని తెలుసుకోవాలి. తక్కువ పెట్టుబడితో మంద పెద్దది కాకుండా 50 గొర్రెలు / మేకలతో చిన్న మందతో జీవాల పెంపకం ప్రారంభించడం మంచిది.
- జీవాల పట్ల ప్రేమ ఉండి, వృత్తిలో అనుభవమున్న మరియు నమ్మకమైన పని మనుషులను ముందే ఏర్పాటు చేసుకోవాలి. యజమాని స్వయం శ్రద్ధ, పర్యవేక్షణ తప్పనిసరి అవసరమని గుర్తించాలి.
- పశుగ్రాస సాగుకి, పశుగ్రాసానిచ్చే చెట్ల పెంపకానికి అనుకూలంగా ఉన్న స్థలం ఎంచుకోవాలి. జీవాలు తాగడానికి, పాకల్ని శుభ్రం చేయడానికి, పశు గ్రాసం పెంచుకోవడానికి నీళ్ళ సౌకర్యం ఉండేలా చూసుకోవాలి.
- జీవాల కొట్టాలను పశుగ్రాసాలు సాగు చేయడం వీలు కాని వృధా భూమిలో ఎత్తయిన ప్రదేశంలో నిర్మించాలి. పాకను తూర్పు పడమర దిశలో తక్కువ ఖర్చుతో తాటాకులు వేసి నిర్మించుకోవాలి. పాక బయట జీవాలు తిరగడానికి కొంత స్థలం వదిలి, కంచె వేసి ఉంచాలి. పాకల్లో దాణా తొట్లు, నీటి తొట్లు, ఖనిజ లవణ ఇటుకలు సిద్ధంగా ఉంచుకోవాలి. పేడ కుప్ప వేయడానికి దూరంగా స్థలం కేటాయించాలి.
- 50 గొర్రెలు / మేకల పెంపకానికి, నీటి సౌకర్యం ఉన్న 2.5 ఎకరాలు స్థలం అవసరం ఉంటుంది. 2 ఎకరాలు స్థలంలో సంవత్సరం పొడవునా పశుగ్రాసాలు మరియు పశుగ్రాస చెట్లు సాగు చేయడానికి నీటి సౌకర్యం ఉండాలి. పాక కోసం, జీవాలు తిరగడానికి చుట్టూ స్థలం కలిపి అర ఎకరం అవసరముంటుంది.
- జీవాలు వచ్చే ముందు, ఆరు మాసాలు సరిపోను పశుగ్రాసాన్ని, రెండు వారాలకు సరిపోను దాణాను నిలువ ఉంచాలి. ముందస్తుగా పశుగ్రాసాల సాగు ప్రారంభించాలి. గడ్డి కత్తిరించే యంత్రమును కొని పెట్టుకోవాలి. పశు వైద్య సౌకర్యం ఎక్కడ అందుబాటులో ఉందో చూసుకోవాలి. ప్రాథమిక చికిత్సకు సంబంధించిన మందులు, పరికరాల్ని సిద్ధంగా ఉంచుకోవాలి. గొర్రె పిల్లలు పుట్టిన మొదటి రెండు నెలల్లో ఎక్కువగా మరణిస్తుంటాయి. దీనివలన పెంపకదారులు ఆర్థికంగా ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంటుంది. సరైన శాస్త్రీయపరమైన పోషణ మరియు గొర్రె పిల్లల మరణాలకు కారణాలు తెలుసుకొని తగిన జాగ్రత్తలు తీసుకుంటే మరణాల శాతం తగ్గించుకోవచ్చు.

**గొర్రె పిల్లల మరణాలకు కారణాలు, అధిగమించే చర్యలు:**

- 30 రోజులలోపు వయసు గల గొర్రె పిల్లల్లో 50 శాతం వరకు మరణించే అవకాశం ఉంటుంది. జీవాల్లో చూడి చివరి దశలో సరైన పోషణ ఇవ్వకపోవడం వలన వాటికి తక్కువ బరువుగల పిల్లలు పుడతాయి. కావున తల్లి గొర్రెలకు చూడి చివరి మాసాలలో (4-5 మాసాలలో), అదనంగా 200-300 గ్రాముల దాణ అందేటట్లు చూడాలి.
- ఈనిన తరువాత తక్కువ ఉష్ణోగతగల వాతావరణ పరిస్థితులు ఉంటే మరణాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువలన ఉష్ణోగ్రత తక్కువగా ఉండకుండా జాగ్రత్త వహించాలి.
- తోడేళ్ళు, నక్కలు, కుక్కలు వంటి జంతువుల నుండి గొర్రె పిల్లలకు రక్షణ ఉండేలా మంద చుట్టూ కంచె ఉండేటట్లు చూడాలి. పుట్టిన వెంటనే గొర్రె పిల్లల బొడ్డును 2-3 అంగుళాలు వదిలి దారంతో కట్టి కొత్త బ్లేడుతో కత్తిరించి దాని పై అయోడిన్ లేదా ఏదైనా యాంటీసెప్టిక్ ద్రావణం అద్దాలి. ఇలా చేయడం వలన ధనుర్వాతం, బొడ్డువాపు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.
- పుట్టిన మొదటి రోజున ఒక డోసు టెటానస్ (టి.టి.) టీకా వేయించాలి. గొర్రె పిల్లలకు పుట్టిన అరగంట లోపల జున్నుపాలు తాగించాలి. జున్ను పాలలో వివిధ రకాల అంటువ్యాధులకు వ్యతిరేకంగా పనిచేసే ప్రతిరక్షనిరోధకాలు అధిక స్థాయిలో ఉంటాయి. పుట్టిన కొన్ని గంటల వరకు మాత్రమే గొర్రె పిల్లల పేగులో ప్రతిరక్షనిరోధకాల శోషణ సమర్థవంతంగా వుంటుంది. జున్ను పాలు సరిపోకపోతే ఆవు పాలలో నీళ్లు కలిపి తాగించాలి.
- 10-15 రోజుల వయస్సు నుంచి క్రీప్ దాణాను మూడు మాసాల వరకు అందించాలి. దాణాతో పాటు పప్పుజాతి గడ్డి, వేప ఆకులు కొరికేందుకు అందుబాటులో ఉంచాలి.
- మొక్కజొన్న (60-70 శాతం), వేరుశనగ చెక్క (10 శాతం), వరి తవుడు (10 శాతం), ఎండు చేపల పొడి (10 శాతం), ఉప్పు (2 శాతం) వీటితో క్రీప్ దాణాను తయారు చేయొచ్చు.
- పాకల్లో ఖనిజ లవణ మిశ్రమ ఇటుకలను నాకేటట్లు అందుబాటులో ఉంచితే గొర్రె పిల్లల్లో బరువు పెరుగుదల ఎక్కువగా ఉంటుంది.

**క్రీప్ దాణా ఇలా ఇవ్వాలి :**

| వయస్సు (రోజులు) | క్రీప్ దాణా (గ్రాములు) |
|---|---|
| 15-30 | 50-100 |
| 31-60 | 100-150 |
| 61-90 | 200-250 |

**వీనింగ్ :** జీవాల (తల్లులు) నుంచి గొర్రె పిల్లల్ని వేరు చేయడం. 3 మాసాల వయస్సు నిండగానే గొర్రె పిల్లల్ని తల్లి నుంచి వేరు చేయాలి. దీని వలన తల్లులు త్వరగా ఎదకు వచ్చి పొర్లుతాయి. గొర్రె పిల్లలకు ఒకేసారి కాకుండా క్రమంగా పాలివ్వడం తగ్గించి పశుగ్రాసం, దాణా ఇవ్వడం మొదలుపెట్టాలి.

**ఆరోగ్య సంరక్షణ:** నట్టలు లేక అంతర పరాన్నజీవుల నిర్మూలనకు 15వ రోజు మొదటిసారి నట్టల మందు త్రాపించాలి. 3 నెలల వయస్సు వరకు ప్రతి నెలా ఒకసారి డివార్మింగ్ చేయాలి. ఆ తరువాత ప్రతి మూడు నెలలకు ఒకసారి చేయాలి. పిడుదులు, పేలు వంటి బాహ్య పరాన్నజీవుల నుంచి రక్షణ కోసం బుటాక్స్ మందులను పాకలో పిచికారీ చేయాలి. వ్యాధులు ప్రబలకుండా సరైన సమయంలో టీకాలు వేయించాలి.

**గొర్రెలు, మేకలలో టీకాల జాబితా**

| వ్యాధి | మొదటి టీకా | తదుపరి టీకా | టీకావేసే నెల |
|---|---|---|---|
| చిటుకు వ్యాధి | 4 వ నెల (మొదటి టీకా వేసిన 15 రోజుల తర్వాత బూస్టర్ టీకా తప్పని సరిగా వేయించాలి). | యేడాదిలో ఒకసారి | మే-జూన్ |
| పారుడు వ్యాధి (పి.పి.ఆర్.) | 4వ నెల | యేడాదిలో ఒకసారి | సెప్టెంబరు |
| బొబ్బ వ్యాధి (మశూచి / అమ్మతల్లి) | 4వ నెల | యేడాదిలో ఒకసారి | డిసెంబరు |
| నీలి నాలుక వ్యాధి | 3వ నెల | యేడాదిలో ఒకసారి | జనవరి-ఫిబ్రవరి |

పైన తెలిపిన విధంగా జీవాల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ తగిన యాజమాన్య జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9866922336

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

**డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి**
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం మరియు రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం | | | |
| 1 | 03.06.2025 | సోయా చిక్కుడు సాగు – మెళకువలు | **డా॥ ఎం. రాజేందర్ రెడ్డి,** ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు) వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, 8500749759 |
| | | 2025 వానాకాలం – వాతావరణ విశ్లేషణ | **డా॥ పి. లీలా రాణి,** ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ వాతావరణ పరిశోధన కేంద్రం, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 8333818215 |
| | | 2025 వానాకాలం – ముందస్తు పంటల | **డా॥ ఆర్. విజయ కుమారి,** ధరల విశ్లేషణ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకానమిక్స్, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, 9948780355 |
| 2. | 10.06.2025 | వానాకాలం కంది సాగు – మెళకువలు | **డా॥ సి. సుధాకర్,** సహ పరిశోధన సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 8332970383 |
| | | వానాకాలనికి ఎలాంటి కూరగాయలను ఎన్నుకోవాలి, సాగు వివరాలు మరియు మెళకువలు | **డా॥ జె. శ్రీనివాస్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (వెజ్‌టేబుల్ సైన్స్) కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్, శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, మోజర్ల, 9951487739 |
| | | జీవాలలో వచ్చే అంటువ్యాధులు, నివారణ చర్యలు | **డా॥ కె. లక్ష్మీ,** అసోసియేట్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ వెటర్నరీ మెడిసన్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్శిటీ, రాజేంద్రనగర్, 8978154747 |
| 3 | 17.06.2025 | చిరుధాన్యాలు సాగులో మెళకువలు | **డా॥ డి. శశిభూషణ్,** ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 891940993 |
| | | తొలకరి వర్షాలతో సాగు చేయవల్సిన పూల సాగు వివరాలు | **డా॥ జి. జ్యోతి,** శాస్త్రవేత్త (ఉద్యాన) & హెడ్ పూల పరిశోధన స్థానం, శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, 7993613179 |
| | | అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగు | **డా॥ టి. ప్రభాకర్ రెడ్డి,** ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం పాలెం, 8333818261 |
| 4 | 24.06.2025 | వానాకాలం కలుపు యాజమాన్యం | **డా॥ టి. రాంప్రకాష్,** ప్రధాన శాస్త్రవేత్త (ఎస్.ఎస్.) & హెడ్ ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ వీడ్ మెనేజ్‌మెంట్, రాజేంద్రనగర్, 8333818242 |
| | | వివిధ పంటలలో యాంత్రీకరణ | **డా॥ పి. రాజయ్య,** ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ ఎఫ్.ఐ.యం., ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 8333818219 |
| | | వ్యర్థ పదార్థాలతో సంపూర్ణ సమీకృత దాణాతో పశుపోషణ | **డా॥ ఎన్. నళిని కుమారి,** ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనిమల్ న్యూట్రిషన్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్శిటీ రాజేంద్రనగర్, 9440543628 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునీత దేవి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. రైతుస్థాయిలో విత్తనోత్పత్తి చేయాలంటే వరిలో ఏ విధమైన ప్రమాణాలు పాటించాలి?**

ఎ) ఐసోలేషన్ ఎడబాటు పాటించాలి

బి) పంట వివిధ దశలలో కేళీలు లేదా బెరుకులు ఏరి వేయాలి

సి) కోత సమయంలో కల్తీలు లేకుండా చేయాలి

డి) పైవన్నీ

**2. లాభాదాయ వ్యవసాయం కొరకు సరియైన పంటల ప్రణాళికలో భాగంగా రైతులు సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

ఎ) అంతరపంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి

బి) ఏక పంటకు బదులు బహుళ పంటలు ఎన్నుకోవాలి

సి) ప్రాంతాలకనువైన వివిధ చీడపీడలను తట్టుకునే రకాలను ఎన్నుకోవాలి

డి) పైవన్నీ

**3. వర్షాధారంగా సాగయ్యే ఎర్రనేలలో (మెట్ట సాగు) ఎలాంటి మెళకువలు పాటించాలి?**

ఎ) వాలుకడ్డంగా దుక్కిదున్నాలి, విత్తాలి

బి) బెట్ట పరిస్థితులలో అంతర కృషి చేయాలి

సి) నీటి కుంటలు విధిగా ఏర్పాటు చేసుకోవాలి

డి) పైవన్నీ

**4. ధృవీకరణ విత్తన ట్యాగ్ రంగు ఏది?**

ఎ) తెలుపు బి) ఆకుపచ్చ

సి) నీలం డి) పసుపు

**5. ప్రత్తి సాగులో సమస్యాత్మకంగా మారిన గులాబి రంగు పురుగు యాజమాన్యం ఎలా చేయాలి?**

ఎ) ఎండాకాలంలో లోతు దుక్కులు చేయుట ద్వారా పురుగు కోశస్థ దశలను నాశనం చేయాలి.

బి) బి.టి ప్రత్తిని విత్తేటప్పుడు విధిగా ప్రత్తి చుట్టూ 5 వరుసలలో నాన్ బి.టి. ప్రత్తిని విత్తాలి.

సి) ప్రత్తి పంట దగ్గర బెండ, తుత్తురు బెండ లాంటివి లేకుండా చేయాలి

డి) పైవన్నీ

**6. ఏ కలుపు మందు పంట విత్తిన రెండు రోజులలోపు అంటే పంట కలుపు మొలకెత్తక ముందే పిచికారి చేయాలి?**

ఎ) పెండిమిథాలిన్ బి) అట్రజిన్

సి) క్విజలోఫాప్ డి) ఎ & బి

**7. కంది + పెసర అంతరపంటల సరళిలో పాటించాల్సిన వరుసల నిష్పత్తి ఎంత?**

ఎ) 1:4 బి) 1:7

సి) 1:6 డి) 1:3

**8. అమ్మోనియం క్లోరైడ్ ఎరువులో ఎంత శాతం నత్రజని ఉంటుంది?**

ఎ) 14% బి) 60%

సి) 25% డి) 46%

**9. ఐ సి ఏ ఆర్ ఆధ్వర్యంలోని భారతీయ మొక్కజొన్న పరిశోధన కేంద్రం ఎక్కడ ఉంది?**

ఎ) కాన్పూర్ బి) సిమ్లా

సి) లూథియానా డి) కోయంబత్తూర్

**10. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి తగ్గించుటకు ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి?**

ఎ) వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలి

బి) ఆలస్యంగా మొక్కజొన్నను వేసుకోకూడదు

సి) అంతరపంటగా కందిని వేసుకోవాలి

డి) పైవన్నీ

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వెస్టర్న్ సిడ్నీ విశ్వ విద్యాలయంలు కలసి నూతన సంయుక్త వ్యవసాయ విద్యా కోర్సులు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్‌గా ఉన్న బీ ఎస్సీ (అగ్రికల్చర్), కమ్యూనిటీ సైన్స్, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులకి అదనంగా 2025 – 26 విద్యా సంవత్సరం నుంచి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆస్ట్రేలియాలోని వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం (డబ్ల్యుఎస్‌యు) తో కలసి నాలుగు సంవత్సరాల బి.ఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సు ప్రారంభించనుంది. విద్యార్థులు నాలుగు సంవత్సరాల కోర్సు వ్యవధిలో మూడు సంవత్సరాలు పీజేటీఏయూ లోనూ, ఒక ఏడాది వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయంలోనూ విద్యను అభ్యసిస్తారు. తద్వారా రెండు విశ్వవిద్యాలయాల్లోనూ విద్యనభ్యసించే అవకాశం విద్యార్థులకి కలుగుతుంది. అదే విధంగా విద్యార్థులు ఎమ్.ఎస్సీ కూడా చదవాలని భావిస్తే మరో ఏడాది వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం (డబ్ల్యుఎస్‌యు)లో చదువవలసి ఉంటుంది. తద్వారా బి.ఎస్సీ డిగ్రీ పీజేటీఏయూ నుంచి, ఎమ్.ఎస్సీ డిగ్రీ వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం నుంచి పొందే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఎవరైనా విద్యార్థులు పీజీ తర్వాత కూడా వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయంలో పీ.హెచ్‌డీ చేయదలచుకుంటే ఎటువంటి రుసుములు లేకుండా స్కాలర్ షిప్ సాయంతో పీహెచ్‌డీ పూర్తి చేయవచ్చని ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జనయ్య తెలిపారు.

## వ్యవసాయంలో జీవన ఎరువుల తయారీ మరియు వాడకంపై శిక్షణ కార్యక్రమం

వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో మే 20న జీవన ఎరువుల ప్రాముఖ్యత, రైతులకు కలిగే లాభాలు, జీవన ఎరువుల తయారీ మరియు జీవన ఎరువుల వ్యాపారం నైపుణ్యం, వ్యాపార ప్రారంభం తదితర అంశాలపై విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ అసోసియేట్ డీన్ డా॥ ఎమ్. గోవర్ధన్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఉద్యోగానికే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషిస్తూ వ్యవసాయ రంగంలో కొత్త వ్యాపార ఆలోచనలు ప్రారంభించడం ద్వారా తమకే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి కల్పించవచ్చని వివరించారు. డా॥ ఎస్. త్రివేణి మాట్లాడుతూ నేలను సారవంతం చేయుటలో, నేలసారంను సంరక్షించుటలో జీవన ఎరువుల సామూహిక ఉత్పత్తి, రైతులకు అందజేయుట, వాటి లాభాలు వంటి అంశాలను విద్యార్థులకు తెలియజేసి నేల సంరక్షణ, పశువులు, మానవ ఆరోగ్య సంరక్షణలో సూక్ష్మజీవుల పాత్రను గురించి తెలిపారు. ముఖ్యంగా జీవన ఎరువులను ప్రయోగశాలలో తయారు చేసుకునే విధానం, వాడే విధానంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోషి లావణ్య, డా॥ డి. శ్రీదేవి, కె. సి దీప్తి, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విస్తరణ విభాగాల రాష్ట్ర స్థాయి సాంకేతిక వార్షిక సమావేశాలు

విశ్వవిద్యాలయ ఆడిటోరియం, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల విస్తరణ వార్షిక సదస్సు మే 3 నుండి 5 వరకు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సు ముగింపు కార్యక్రమానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి – అటారి జోన్ – ఇ డైరెక్టర్ డా॥ షేక్ మీరా హాజరై మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు వ్యవసాయరంగంలో నూతన మార్పులు రైతులకు అందించేందుకు కృషి చేయాలని, వినూత్నంగా రైతులకు సేవచేయాలని తెలిపారు. రాబోవు రోజులలో రైతులకు మంచి విత్తనాలు, విస్తరణ సేవలందించాలని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా॥ ఎమ్. యాకాద్రి మాట్లాడుతూ కె.వి.కె లు రైతులకు చాలా విశిష్ట సేవలందిస్తున్నాయని తెలుపుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విడుదలైన రకాలు రైతులకు చేరవేసి, వాటి విస్తరణ పరిధి గురించి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ మూడురోజులు రాష్ట్రంలోని వివిధ కృషి విజ్ఞాన కేంద్రాలు గత సంవత్సరం చేపట్టిన విస్తరణ పనులు మరియు రాబోవు సంవత్సరానికి ప్రణాళికలు ఈ సందర్భంగా చర్చించటం జరిగింది. ఈ కార్యక్రమంలో వెటర్నరీ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా॥ ఎమ్. కిషన్ కుమార్, ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా॥ సురేష్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్తలు, సహ పరిశోధన సంచాలకులు, కృషి విజ్ఞాన కేంద్రం మరియు డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్‌లో సరస్వతీ మాత విగ్రహ ఆవిష్కరణ

విశ్వవిద్యాలయ పరిధిలోని నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్‌లో మే 9న సరస్వతీ మాత విగ్రహాన్ని రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సి.హెచ్. విద్యాసాగర్ ఆవిష్కరించడం జరిగింది. రిటైర్డ్ ప్రొఫెసర్ రాచా బత్తుల శ్రీహరిబాబు దంపతుల సహకారం తో నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్‌లో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన శ్రీహరి బాబు దంపతులను రిజిస్ట్రార్ డా॥ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ గ్రంథ పాలకుడు డా॥ వివేక వర్ధన్, సహాయ గ్రంథ పాలకుడు డా॥ ఎన్. పి రవికుమార్‌తో పాటు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాలెడ్జ్ మేనేజ్మెంట్ కేంద్రం ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పి. సుధాకర్, పిఆర్‌ఓ, మరియు మార్బ్ల బాబు

# మిరప నల్లతామర పురుగుల నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించి లాభాలు గడించిన రైతు విజయగాథ

డా॥ ఓ. శైల, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, డా॥ ఎ. శంకర్, డా॥ బి. రాజశేఖర్, కె. రామకృష్ణ మరియు ఇ. జ్యోత్స్న
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్‌కర్నూల్







మిరప తెలంగాణ రాష్ట్రంలో సాగు చేసే వాణిజ్య పంటల్లో ముఖ్యమైనది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ మిరప సుమారుగా 10,500 ఎకరాల్లో సాగవుతుంది. గత మూడు సంవత్సరాలుగా వాతావరణ మార్పులు, విచక్షణారహితంగా రసాయనాల పిచికారి వల్ల నల్లతామర పురుగు (త్రిప్సి పార్విస్పైనస్ ఉధృతి పెరిగి రైతాంగం అపార నష్టానికి గురయ్యారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం వివిధ రైతు పొలాల్లో నల్లతామర పురుగుల యాజమాన్యం పై ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రం 2021 నుండి 2023 సంవత్సరాలలో చేపట్టడం జరిగింది. దీని ఫలితాలను ఆధారం చేసుకొని రైతు విజయగాథ తెలియజేయడం జరుగుతుంది.

పాలెం గ్రామం, బిజినేపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా వాస్తవ్యులైన శ్రీ కాటె. బాలకృష్ణా రెడ్డి అనే రైతు 8 ఎకరాల భూమిలో వివిధ రకాల పంటలను పండిస్తాడు. అతడు వానాకాలంలో 2 ఎకరాల్లో మిరప, 2 ఎకరాల్లో మొక్కజొన్న, 4 ఎకరాల్లో ప్రత్తి మళ్ళీ యాసంగిలో 4 ఎకరాల్లో మొక్కజొన్న, 4 ఎకరాల్లో ఆముదాలు పండిస్తూ పంటల వైవిధ్యీకరణతో తోటి రైతులకు ఆదర్శంగా నిలిచాడు. అయితే గతంలో మిరప పంట చీడపీడలకు గురై దిగుబడులు తగ్గుతూ వచ్చాయి. అయితే కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం వారి ఆధ్వర్యంలో నల్లతామర పురుగుల యాజమాన్యం పై ప్రదర్శన తన రెండు ఎకరాలలో చేపట్టాడు. దీనికి గాను కెవికె పాలెం బృందం ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు యాజమాన్యానికి అవసరమయ్యే ఉత్పాదకతలను అందించారు. (తెలుపు మరియు నీలిరంగు జిగురు అట్టలు, అజాడిరాక్టిన్ 10,000 పిపియం, బెవేరియా బాసియాన, సయాంట్రానిలిప్రోల్, స్పైనోశాడ్).

**సాంకేతిక పరిజ్ఞానం:**

- తెలుపు మరియు జిగురు అట్టలను ఎకరాకు 25+25=50 చొప్పున ఎకరాకు అమర్చుకోవడం
- అజాడిరాక్టిన్ 10,000 పిపియం 3 మి.లీ. లతో పిచికారి
- జీవనియంత్రణ కారకాలైన బవేరియా బాసియాన లేదా లెకానిసిలియా 5 గ్రా. లేదా 5 మి.లీ. లీటరు నీటితో పిచికారి చేయాలి.
- ఆర్థిక నష్టపరిమితి స్థాయి దాటినప్పుడు ఫిప్రోనిల్ 50 డబ్ల్యుజి 0.2 గ్రా. లేదా సయాంట్రానిలిప్రోల్ 1.2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ + ఫిప్రోనిల్ 40% డబ్ల్యుజి 0.2 గ్రా. లేదా స్పైరోటెట్రామాట్ 150 ఓడి 0.8 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైన తెలిపిన మందులను మార్చి మార్చి ఉధృతిని బట్టి పిచికారి చేయాలి.

రైతు తన పొలంలో సరైన సమయంలో ఈ పద్ధతులను చేపట్టడం జరిగింది.

నీలి మరియు తెలుపు జిగురు అట్టలను అమర్చడం వల్ల తామర పురుగులపై నిఘా పెట్టడం కాకుండా సామూహికంగా పురుగులను ఎక్కువ సంఖ్యలో ఆకర్షించడం జరిగింది. ఉధృతి తొలి దశలో ఉన్నప్పుడు అజాడిరాక్టిన్ 10,000 పిపియం బవేరియా బాసియాన పిచికారి చేయడం వల్ల వీటి ఉధృతిని సమర్థవంతంగా నివారించగలిగారు. ఈ సాంకేతిక ఆచరించడం వలన రైతు సుమారుగా ఎకరాకు 20.5 క్వింటాళ్ళు, రైతు పద్ధతికంటే 28.2% అధిక దిగుబడిని సాధించాడు. అదేవిధంగా 40,260/- అధిక నికరాదాయాన్ని పొందాడు. 3 నుండి 4 పిచికారులను తగ్గించడం వలన సుమారుగా 5200/- రసాయనాల పై ఆదా చేయగలిగాడు. ఈ సాంకేతిక పరిజ్ఞానం నాగర్‌కర్నూల్ రైతాంగంలో మంచి ఆదరణను పొందింది.

| క్ర.సం. | వివరాలు | ప్రదర్శన (రూ./ఎకరా) | రైతు పద్ధతి (రూ./ఎకరా) |
|---|---|---|---|
| 1. | నేల తయారీ | 2280/- | 2280/- |
| 2. | విత్తన ఖర్చు | 2120/- | 2120/- |
| 3. | నారుమడి ఖర్చు | 600/- | 600/- |
| 4. | పశువుల ఎరువు | 3000/- | 2120/- |
| 5. | నాటడానికయ్యే ఖర్చు | 1320/- | 1320/- |
| 6. | కలుపు యాజమాన్యం | 620/- | 800/- |
| 7. | అంతరకృషి | 4000/- | 5400/- |
| 8. | సస్యరక్షణ మందులు | 8400/- | 13600/- |
| 9. | ఎరువులు | 3800/- | 7500/- |
| 10. | కోత ఖర్చులు | 22400/- | 23600/- |
| 11. | ప్యాకింగ్ మరియు రవాణా ఖర్చు | 5600/- | 5600/- |
| 12. | మొత్తం సాగు ఖర్చు | 54140/- | 64940/- |
| 13. | దిగుబడి (క్వి./ఎకరానికి) | 20.5 | 16.2 |
| 14. | స్థూల ఆదాయం రూ. 16,200/- | 315900/- | 262440/- |
| 15. | నికర ఆదాయం | 261760/- | 221500/- |
| 16. | ఆదాయం : ఖర్చు నిష్పత్తి | 3.7:1 | 2.4:1 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9951461694**

## 28వ పేజీలోని పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ప | | | 2 పా | ల | చౌ | డు | నే | ల | లు |
| 3 పూ | త | ద | శ | | | | | క్రో | | | ట |
| | | హా | | | | | | ల్లి | | | పం |
| | గు | రు | పు | ర | త్తె | క 4 | | 5 ఉ | | | ర |
| | రు | | | | | బం | | | | | ఎ 6 |
| | పు | | | | | ను | | | | | |
| | చు | | | ము | | 7 స్పే | | | 8 కా | ల్షి | యం |
| | లు | | | ను | | | | | | | షి |
| | తొ | | | 9 ఇ | మి | డా | క్లో | ప్రి | డ్ | | టా |
| | వ్వు | | | | | | | | | | పా 10 |
| | 7 మొ | ద | లు | కు | ళ్ళు | తె | గు | లు | | | |
| | | | | | | | | | | | |

**46వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు :** 1. డి 2. డి 3. సి 4. సి 5. డి 6. డి 7. బి 8. సి 9. సి 10. డి

# భూసార సంరక్షణ కొరకు పచ్చిరొట్ట సాగు

డా. సిహెచ్. పల్లవి మరియు డా. ఎస్. శ్రీదేవి
ఏరువాక కేంద్రం మరియు వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాల




**పచ్చిరొట్ట పంటలు (50% పూత దశలో)**

1. జీలుగ
2. జనుము
3. పిల్లిపెసర
4. పెసర
5. అలసంద/బొబ్బెర

**పచ్చి ఆకు ఎరువులు (ఆకులు మరియు కొమ్మలు)**

1. వేప
2. గ్లైరిసీడియా
3. పొంగామియా
4. సుబాబుల్

RNI No : TELTEL/2015/60296 June, 2025 Postal Regd.No:HSE/1013/2024-2026
Total No. of Pages : 52
Date of Publication : 06.06.2025
Date of Posting : 09.06.2025

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001

# రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు












To

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. C. Padma Veni on behalf of Professor Jayashankar Telangana Agricultural University, Owned by Professor Jayashankar Telangana Agricultural University, Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. C. Padma Veni, RNI File No. 1262077, Title-Code: TELTEL00152